శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంపూర్ణ గ్రంథావళి.

నీతినిధి

అనువాదకర్త

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

ప్రచురణ

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2015

NEETI NIDHI

Translated by Sri Veturi Prabhakara Sastri.

T.T.D. Religious Publications Series No.

First Edition: 2015

© All Rights Reserved

Copies : 1000

Price.Rs...............

Published by

Dr. D.Sambasiva Rao I.A.S.
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati -517 501

D.T.P. SVPSVP., T.T.D. Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams, Press.
Tirupati.

ఓం నమో వేంకటేశాయ

ముందుమాట

తిరుమల తిరుపతి దేవస్థానం ధార్మికప్రచారంలో ఒక భాగంగా రామాయణ, భారత, భాగవతాది ఆధ్యాత్మిక, సాహిత్య, ధార్మిక గ్రంథాల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో ముద్రించి ప్రజలకందించే ప్రయత్నం చేస్తున్నది. ఈ ప్రయత్నంలోనే ధార్మిక, ఆధ్యాత్మిక సాహిత్య ప్రాజెక్టులను నెలకొల్పి వాటి ద్వారా ధర్మప్రచారం నిర్వహిస్తున్నది.

సంస్కృతాంధ్రములలో గొప్ప పండితులైన శ్రీ శాస్త్రిగారు మద్రాసులోని ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారంలోను, తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థలోను పనిచేసే సమయంలో అనేక అముద్రిత తాళపత్ర గ్రంథాలను పరిశీలించి, పరిష్కరించారు. అన్నమయ్య సంకీర్తనలను వెలుగులోనికి తీసుకొనివచ్చి, వాటిని పరిష్కరించడంలోనూ, తాళపత్ర గ్రంథాలను సేకరించి పరిరక్షించడంలోనూ, ప్రాచీనశిల్పకళాసంపదను సేకరించి శ్రీ వేంకటేశ్వర మ్యూజియంను స్థాపించడంలోను శ్రీ శాస్త్రిగారు చేసిన నిర్విరామకృషి ప్రశంసనీయమైనది. శాస్త్రిగారు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి చేసిన సేవను గుర్తించి వారి పేరు మీద తిరుమల తిరుపతి దేవస్థానం "శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం"ను స్థాపించి వారి ముద్రితాముద్రిత రచనలను ప్రచురించుటకు శ్రీకారం చుట్టి వాఙ్మయపీఠం ద్వారా అనేక గ్రంథాలను ముద్రించింది. ప్రస్తుతం శాస్త్రిగారి అనువాద గ్రంథం **"నీతినిధి"** ప్రచురింపబడుతున్నది.

మానవజీవితం ఎలాంటి ఆటంకాలు లేకుండా హాయిగా సుఖంగా సాగిపోవాలంటే అన్నిటికంటే ముఖ్యమైనది నీతిమార్గం ఒకటే. జీవయాత్రకు నీతి ఒకటే సాధనం. మోక్షవిషయంలో వివిధ మతాలు, వివిధ అభిప్రాయాలను వెల్లడి చేసినా నీతివిషయాల్లో మాత్రం ఎలాంటి అభిప్రాయభేదాలుండవు. మానవుని జీవనయాత్రను స్వర్గయాత్రగా చేయగలిగినవి నీతిధర్మములే. అలాంటి నీతులకు నిధియైన ఆంగ్లగ్రంథం "The Economy of Human life ". ప్రపంచభాషల్లోకి అనువదించబడిన ఈ ఉత్తమగ్రంథాన్ని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు **"నీతినిధి"** పేరుతో తెలుగులోనికి అనువదించి ఆంధ్రుల కందించారు.

ఈ గ్రంథంలో ప్రధానంగా రెండుభాగాలున్నాయి. మొదటి భాగంలో మానవుని ధర్మాలకు సంబంధించిన నీతులు, రెండవభాగంలో మానవునికి సంబంధించిన సామాన్య నీతులు కలవు. మానవధర్మనిర్వహణకు, పురుషార్థాలను సాధించడానికి నీతి ధర్మాలతో నిండియున్న ఈ **"నీతినిధి"** సకలజనులకు ఉపయోగపడగలదని భావిస్తున్నాము. ఈ ఉత్తమగ్రంథాన్ని తెలుగు పాఠకులందరూ తప్పక ఆదరించగలరని ఆశిస్తున్నాము.

ఈ గ్రంథాన్ని పాఠకులకు అందించిన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం అధికారులను మరియు సిబ్బందిని అభినందిస్తున్నాము.

సదా శ్రీవారి సేవలో

కార్యనిర్వహణాధికారి

నివేదన

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రాచీన గ్రంథాలను పరిశీలించి, పరిష్కరించి ప్రచురించడమే గాక కొన్ని గ్రంథాలను ఇతర భాషలనుండి తెలుగులోనికి అనువదించి అనువాదరచయితగా కూడా ప్రసిద్ధికెక్కారు. వీరు చేసిన అనువాదగ్రంథాలలో ప్రసిద్ధమైంది, ప్రయోజనకరమైంది "**నీతినిధి**". ఆంగ్లంలోని "The Economy of Human life " అనే గ్రంథానికి ఇది అనువాదం. మూలగ్రంథం అనేక ప్రపంచభాషల్లోకి అనువదించబడింది.

ఈ గ్రంథం ముక్త్యాల కుమారరాజాగారికి అంకితం చేయబడింది. దీని ప్రథమముద్రణ 1926లోను, ద్వితీయ ముద్రణ 1982లోను వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్టు తరపున వచ్చాయి. ప్రస్తుతం ఈ గ్రంథం శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం పక్షాన తి.తి.దేవస్థానంవారు ముద్రించడం జరిగింది.

ఇందులో రెండుభాగాలు కలవు. ప్రథమభాగంలో ఏడు అధ్యాయాలు, ద్వితీయభాగంలో ఐదు అధ్యాయాలు గలవు. ప్రతి అధ్యాయంలో వివిధ సందర్భాల్లో మానవునికి అవసరమైన నీతులు వివరింప బడినవి. సామాజిక జీవనంలో భర్తలకు, భార్యలకు, తల్లులకు, పిల్లలకు, చుట్టములకు, రాజులకు, ప్రజలకు కావలసిన నీతిధర్మాలు చెప్పబడినవి. మానవధర్మనిర్వహణకు, పురుషార్థాలను సాధించడానికి ఉపయోగపడే నీతిధర్మాలతో నిండి ఉన్న ఈ 'నీతినిధి' పండితులకు, పామరులకు, పురుషులకు, స్త్రీలకు, వృద్ధులకు, బాలురకు అందరికీ ఉపయోగపడుతుందనడం అక్షరసత్యం. ఉత్తమమైన ఈ గ్రంథాన్ని ముద్రించి సిద్ధంచేయడంలో సహకరించిన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం సిబ్బందికి అభినందనలు. ఈ గ్రంథాన్ని ముద్రించుటకు అనుమతించిన శ్రీ కార్యనిర్వహణాధికారిగారికి వందనాలు.

సదాశ్రీవారి సేవలో

ప్రత్యేకాధికారి

విషయసూచిక

(పీఠిక)

విషయము	**పుటలు**
మనవి	x
సంపాదకీయము	xii
పంచరత్నములు	xv
తొలిపలుకు	xviii
ఉత్తరము (ఆంగ్లం)	xxi
ప్రజాసామాన్యమునకై ప్రకటన	
ప్రస్తావన	xxviii
గ్రంథప్రశంస	
(Neeti Nidhi A unique exercise in translation)	xxxii

ప్రథమభాగము

అవతరణిక	1

ప్రథమాధ్యాయము

మానవుని ధర్మములు

పర్యాలోచనము	3
అణఁకువ	3
పూనిక	5
సద్గుణలిప్స	6
దూరాలోచన	8
స్థైర్యము	10
సంతుష్టి	11
మితభోగము	12

ద్వితీయాధ్యాయము

మనోవికారములు

ప్రత్యాశ-నిరాశ 15

సంతోషము, దుఃఖము 16

కోపము 18

కనికరము 19

కోరిక, ప్రేమ 20

తృతీయాధ్యాయము

ఉవిద 21

చతుర్థాధ్యాయము

రక్తసంబంధము

పెనిమిటి 24

తండ్రి 25

పుత్త్రుండు 26

అన్నదమ్ములు 27

పంచమాధ్యాయము

మనుష్యులలో దైవికములయిన తారతమ్యములు

జ్ఞానవంతులు, జ్ఞానహీనులు 28

భాగ్యవంతులు, దరిద్రులు 29

యజమానులు, సేవకులు 31

రాజు, ప్రజలు 32

షష్ఠాధ్యాయము

సాంఘిక ధర్మములు

ఉపకారబుద్ధి 35

న్యాయము 36

త్యాగము 37

కృతజ్ఞత 37

నిష్కాపట్యము 38

సప్తమాధ్యాయము

మతము 40

ద్వితీయభాగము

ప్రథమాధ్యాయము

మానవసామాన్య విషయములు

మానవదేహము, దాని నిర్మాణమును 45

ఇంద్రియముల యుపయోగములు 46

మనుజుని యాత్మ, దాని యారంభము, చేష్టితములు 48

మానవుని జీవితకాలము, దాని ప్రయోజనములు 52

ద్వితీయాధ్యాయము

మనుష్యుని మనోవికారములు, వాని దోషములు

గర్వము 57

చాంచల్యము 59

దౌర్బల్యము 63

జ్ఞానముచాలమి 66

దౌర్భాగ్యము 69

వివేకము 72

అహంకారము 76

తృతీయాధ్యాయము

స్వపరానర్థకములగు వ్యామోహములు

దురాశ	80
మితిమీఱుట	82
ప్రత్యపకారచింత	83
క్రూరత్వము, ఏవగింపు, అసూయ	86
హృదయోద్వేగము	89

చతుర్థాధ్యాయము

మనుజుఁడు తోడివారిమీఁటి పొందఁదగిన దొడ్డగుణములు

ఘనత, గౌరవము	94
శాస్త్రములు, పాండిత్యము	97

పంచమాధ్యాయము

తప్పించుకోరాని దైవికములు

లాభనష్టములు	101
వ్యాధి, బాధ	103
మరణము	104

మనవి

(వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్టు
ప్రచురణలోనిది యథాతథం)

ఇంకొక ఆరేండ్లలో, అనగా 1988 ఫిబ్రవరి 7వ తేదీ నాటికి స్వర్గీయ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి శతజయంతి రానున్నది. అప్పటిలోగా శ్రీ ప్రభాకరశాస్త్రి గ్రంథావళిని సంపూర్ణముగా వెలువరచే ప్రయత్నము సాగింపవలెనని సంకల్పించితిమి. ఆ పనికి పూనుకొని శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళిలో తొలి సంపుటముగా ఇప్పుడీ నీతినిధిని ప్రకటించుచున్నాము. క్రమమున ఇట్లే తక్కిన సంపుటములును వెలువడగలవు.

ఈ ప్రయత్నమున ఆర్థికవ్యవస్థాపరములైన ఇబ్బందులను అధిగమించుటకై "వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్టు" స్థాపన కుద్యమించితిమి. ఈ ట్రస్టు త్వరలోనే వ్యవస్థితము కానున్నది. ఇకపై మా ప్రచురణములన్నియు ఈ ట్రస్టు పేరనే వెలువడగలవు.

వీటి మూలమున వాఙ్మయ–యోగ–పరిశోధన రంగముల కంకితమైన శ్రీ ప్రభాకరుల కీర్తిద్యుతు లిక నిరాటంకముగా నాంధ్రావని నలరింపజేయుచుండగలవని మా విశ్వాసము. ఇంతకు పూర్వము శ్రీ ప్రభాకర పరిశోధక మండలి పక్షమున జరుగుచుండిన కృషియొక్క ఫలరూపమైన వికాసమే ఇప్పుడేర్పడిన ట్రస్టు. గత రెండేళ్లుగా వెలువడుచున్న మా "మణిజమంజరి" షాణ్మాసిక పత్రికయు ఈ కృషికి తగిన ప్రాతిపదిక నేర్పరచినది. అదియు కొనసాగగలదు.

శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళి ప్రణాళికను గూర్చియు, ట్రస్టు ఆదర్శములను గూర్చియు ముమ్ముందు విన్నవించుకోగలము.

శ్రీ ప్రభాకరుల నీతినిధి (1926); తెలుగు మెఱుగులు (1948) వంటి గ్రంథము లొకటిరెండు ఆంధ్రగ్రంథమాల పక్షమున పూర్వము ప్రకటింపబడియుండినవి. శ్రీ ప్రభాకర పరిశోధకమండలి పక్షమున "తెలుగు మెఱుగు" లిదివరకే పునర్ముద్రణ భాగ్యమందినది. అట్టి వ్యాససంకలనముల

ప్రతులన్నియు నేడు చెల్లిపోయినవి. వాని నన్నిటిని కలిపి శ్రీ ప్రభాకర సంపూర్ణగ్రంథావళిలో తిరిగి ఒక సంపుటముగా మున్ముందు వెలువరచ గలము.

తొలి ముద్రణము వెలువడిన ఏభైయారేండ్ల తర్వాత నీతినిధి రెండవ ముద్రణమిది మీ ముందున్నది. గ్రంథ పునర్ముద్రణావశ్యకతను గూర్చి మే మిందు వేరుగా వ్రాయనవసరములేదు. తొలి కూర్పునందున్న విషయము లన్నింటిని మేమిందు యథాతథముగా స్వీకరించితిమి. తొమ్మిదేండ్ల వయసున ఆ నాడీ గ్రంథమున నంకితముగొన్న వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాదుగారు నేడు మన మధ్యనలేరు. వారి నీ సందర్భమున స్మరించు చున్నాము.

నీతినిధి తొలికూర్పును తమ గ్రంథమాలలో ఒక కుసుమముగా స్వీకరించి ప్రకటించిన ఆంధ్రగ్రంథమాలవారి సౌజన్యము నీ పట్టున కీర్తించు చున్నాము. ఈ ముద్రణమున కడిగిన తోడనే అప్పుగా కొంత ద్రవ్యసహాయ మందించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారిని కృతజ్ఞతతో స్మరించు చున్నాము. శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళి ప్రణాళిక ననుసరించి ఈ గ్రంథసంపాదకులుగా నుండ నంగీకరించి ప్రస్తావన విషయమును వ్రాసి పంపిన పూజ్యులు డా॥ వేటూరి చంద్రశేఖరశాస్త్రిగారికిని. ఆంగ్లమున గ్రంథ ప్రశంసనందించి తోడుపడిన శ్రీ వేటూరి ఆంజనేయులుగారికిని నమోవాకము లర్పించుచున్నాము.

ముఖపత్రము నందముగా తీర్చియిచ్చిన కళాకారులు శ్రీ శీలా వీర్రాజు గారికిని, ముఖపత్రమును ముద్రించిన నందినీ ఆర్ట్ ప్రింటర్స్ వారికిని, గ్రంథ ముద్రణమును అచిరకాలములోనే ముచ్చటగా ముగించి యిచ్చిన మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్ వారికిని హార్దాభినందన లందించుచున్నాము.

విద్యార్థికు లీ నీతినిధి నాదరింపగలరని విశ్వసించుచున్నాము.

–ప్రకాశకులు.

సంపాదకీయము

(వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్టుప్రచురణలోనిది యథాతథం)

శ్రీ నీతినిధి ఆంధ్ర గ్రంథమాలయం దాఱవ కుసుమము. గ్రంథ మాంగ్లగ్రంథమున కనువాదము. సుప్రసిద్ధ గ్రంథకర్తలు బ్రహ్మజ్ఞాన సంపన్నులు శ్రీయుత వేటూరి ప్రభాకరశాస్త్రులుగా రనువాదకులు. గ్రంథోదంతము మూలగ్రంథమునందున్న విధమున నిందుఁ బొందుపఱుపఁ బడినది. నీతినిధికిఁ పీఠికను వ్రాయఁబూనుట భాస్కరునిఁగరదీపికలతోఁ జూపఁబూనునటులుండును. అయినను నియతమైన బాధ్యతయే యీ ప్రయత్నమునకుఁ గారణము. అంతయును బంగారమైయున్నపు డేరి కోరి మెఱుఁగులను నిరూపించు టసాధ్యముగదా!

పూర్వకాలమునుండియును భరతఖండము బ్రహ్మ జిజ్ఞాసువులకు నిలయము. బ్రాహ్మణ క్షత్రియాదులు తపోనిష్ఠాగరిష్ఠులై బ్రహ్మజ్ఞానమే జీవయాత్రకు ఫలమని గ్రహించుచుండిరి. ఆ బ్రహ్మజ్ఞులందొక రీ గ్రంథమును సంస్కృతభాషయందు రచించిరి. "సంస్కృతగ్రంథము త్రివిష్టపమును జేరి త్రివిష్టపభాషారూపమును దాల్చినది. త్రివిష్టపభాషనుండి చీనాభాషాను వాదమును బడసినది. చీనాభాషనుండి యాంగ్లభాషాంతరీకరణమును బొందినది." ఇయ్యది చస్టరుఫీల్డు ప్రభువునకు చీనానుండి గ్రంథకర్త వ్రాసిన యుదంతము. ఇందుఁగొంత సత్యమున్నను, గ్రంథరచనయందు గ్రంథకర్త భావములు విశేషముగఁ జేరియున్న విధమును గ్రంథపరిశీలనము విశదము చేయు చున్నది. క్రైస్తవమత సంప్రదాయములు, పలస్తీను ఈజిప్టు అరాబియాభి వర్ణనములు, సముద్రోపమానములు భారతీయ బ్రహ్మజ్ఞాన సంప్ర దాయము లకుఁ బ్రతికూలముగను, క్రైస్తవమతసంప్రదాయముల కనుకూలముగను నున్నవి. క్రైస్తవమతాభినివేశము, పాశ్చాత్యసంస్కారము గ్రంథమునందలి భావసాంకర్యమునకుఁగారణమై యుండనోపును. గ్రంథము ప్రాచ్యవిజ్ఞాన ముల ఫలమైనను గ్రంథరాజమై యాంధ్రభాషాయోష కొక యలంకారముగ నుండఁగలదు.

జీవయాత్రకు నీతి సాధనము; పురుషార్థము ఫలము. నరుఁడు నీతి సాధనమునఁ జతుర్విధపురుషార్థముల నారాధించుచు నారాయణపదము

నధిష్ఠించుచున్నాఁడు. మానవులకు ధర్మార్థకామమోక్షములు కరతలామలకము లయ్యును దురారాధ్యములుగ నున్నవి. వేదములు, ప్రస్థానత్రయము, దర్శనములు, శాస్త్రములు, పురాణేతిహాసములు, మతగ్రంథములు, కావ్యములు, నాటకములు. నవలలు, పాటలు, పద్యములు పురుషార్థసిద్ధికి సాధనముల ననంతరూపముల నుపదేశించుచున్నవి. ఆ సత్యోపదేశములను నిత్యజీవనము నందు సమన్వయము చేసి పురుషార్థమును బడయఁగల విధమును నీతులు తెలుపుచున్నవి.

వివిధ మతములకును మోక్ష విషయమునందు భేదాభిప్రాయము లున్నను నీతి విషయములందు భేదాభిప్రాయములు లేవు. సత్యము, శౌచము, శమము, దమము, దయ, వైరాగ్యము, త్యాగము మున్నగు సద్గుణముల నన్ని మతములును శ్లాఘించుచున్నవి. అహంకారము, కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము మున్నగు దుర్గణముల నన్ని మతములును నిరసించుచున్నవి. దుశ్చింతలను, దుర్భాషలను, దుర్గుణములను, దుష్కార్యములను బాసి సచ్చింతలను, సద్భాషలను, సద్గుణములను, సత్కార్యములును బొందఁగలవిధమును నీతినిధి సులభముగఁ దెలుపుచున్నది. జీవయాత్రను జేయఁగల నీతిధర్మములను నీతినిధి విశదము చేయుచున్నది. సుఖప్రాప్తికిని దుఃఖనివృత్తికిని మూలాంకురములైన నీతిధర్మములను నీతినిధి సుగమము చేయుచున్నది.

నీతినిధియందు రెండుభాగములు కలవు. ప్రథమభాగమునం దేడును ద్వితీయ భాగమునం దైదును అధ్యాయములు గలవు. ప్రతి అధ్యాయము నందును మానవులకు భిన్నావస్థలం దవసరమైన నీతులు వివరింపఁబడి యున్నవి. సంసార ప్రవృత్తియందు, భిన్నావస్థలందు మానవుల కనుష్ఠాన యోగ్యములైన నీతిధర్మము లీ చిన్నిపొత్తమునందుఁ జక్కఁగ నమర్చఁబడి యున్నవి. సంఘజీవనమునందుఁబతులకు, సతులకు, తల్లులకు, బిడ్డలకు, చుట్టములకు, రాజులకు, ప్రజలకు వలయు నీతిధర్మము లిందు వివరింపఁ బడి యున్నవి. మానవులు సకలావస్థలందును స్వధర్మనిర్వహణమును జేసి తరించుటకు నీతిమార్గము శరణ్యము. నీతిధర్మపరాయణులు సుఖ దుఃఖములను, లాభనష్టములను, జయాపజయములను, కీర్త్యపకీర్తులను బాటింపక స్వధర్మ

నిర్వహణమును జేసి కృతకృత్యులగుచున్నారు. స్వధర్మ నిర్వహణమునకు సకల ధర్మములందును నాత్మధర్మము ప్రధానము. జీవయాత్రయందు మానవ ధర్మమును సార్థకము చేయుటకు నిత్యమైన యాత్మధర్మమువలెను, అనిత్యములైన దేహేంద్రియ మనోధర్మములు ప్రయోజన కరములు గావు.

నిత్యమైన యాత్మధర్మారాధనమును జేయుటకు సాధనములైన నీతిధర్మ ములను ఆత్మానుభవము గల మహానుభావులు నిర్ణయింప సమర్థులు. నిత్యమైన పరతత్త్వము సర్వత్ర వెలుఁగుచున్నను నప్రత్యక్షముగ నున్నది. ఇంద్రియ గ్రామ మనిత్యమైన విషయవాసనలందు లగ్నమై పండితులనుగూడఁ బరవశులను జేయుచున్నది. అహంకార చతుష్టయము, జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు విషయవాసనలనుండి మరలుటకును బరమాత్మయందు లయమును బొందుటకును నీతిమార్గము సాధనముగనున్నది. మానవధర్మ నిర్వహణమునకును పురుషార్థసిద్ధికిని సాధనభూతములైన నీతిధర్మములతో నిండియున్న నీతినిధి సకలజనులకును– పండితపామరులకు, స్త్రీ పురుషులకు, బాలవృద్ధులకు– పారాయణయోగ్యముగ నున్నది. నీతినిధి బడులందును గృహములందును అనుదినమును జదువఁదగిన పుస్తకమై యున్నది. నీతినిధి ప్రతిమనుజునకును వెంటనుండఁదగిన ధర్మమిత్రము. ఆంధ్ర మహాజనులు నీతినిధిని బఠించి యందలి పరమార్థమును గ్రహించి శ్రీయుత ప్రభాకరశాస్త్రి గారి సంకల్పమును సార్థకము చేయుదురుగాక!

అక్షయ, వైశాఖ పూర్ణిమ,
చెన్నపురి. కా. నాగేశ్వరరావు.

పంచరత్నములు

శ్లో. శ్రీరమ్య! రామగోపాలకృష్ణ! భూపాలబాలక!
ఆరోగ్యవాన్భవాయుష్మాన్విద్యావాన్విజయీభవ

ఆ.వె. కులము వాసిగలది తలిదండ్రు లతిపుణ్య
చరితు లీవు వారివరుసవాఁడ
వెంచి నీకు సుకృతి నిచ్చితి హెచ్చుగా
మేలుగాంచుమా నృపాలబాల!

సీ. చిగురుటాకులఁబోలు చిన్నారి నీ కేలు
దోయి సత్కృతులెన్ని చేయవలెనో!
కలికిపల్కులగోము గల ముద్దు నీ మోము
నెఱి నెన్నివిద్యలు నేర్వవలెనో!
నెనరు చిప్పిలుచుండు నీ కన్నుఁగవ నిండు
సిరుల నెందఱఁ గటాక్షింపవలెనో!
అఖిలభాగ్యనిధానమైన నీ యాస్థాన
మింక నెంత సమృద్ధి నెసఁగవలెనో!

గీ. వంశదీపకుఁడైన నీ వలన నింక
కులమునకు నెంత విఖ్యాతి కలుగవలెనో!
వృద్ధినందుమా యవియెల్ల వెల్లడింప
మహితతేజ! ముక్త్యాల కుమారరాజ!

సీ. తలిదండ్రు లఖిలభద్రములు గూర్పఁగ మేన
యత్తలు కనుఱెప్పలట్లు ప్రోవ
పినతండ్రి విద్యాభివృద్ధి కన్గొనుచుండ
మాతామహుఁడు రాజనీతి నరయ
మామ యల్లుని విని మదిలో ముదముచెందఁ
దక్కు బంధుగులు నుత్సాహమంద

గురుఁడశ్రమమ్ముగా సరసవిద్యలునేర్పఁ
జెలఁగి మా బోంట్లు నాశీర్వచింప

గీ. చక్రముక్తీశ్వరస్వామి సర్వశుభము
లొసఁగుచుండ నభ్యుదయంబు నొందుమన్న!
చంద్రమౌళి క్షమాపాల సత్కుమార!
శ్రీమహిత! రామగోపాలకృష్ణభూప!

సీ. సంస్కృతాంధ్రాంగ్లభాషలు నీకుఁజక్కఁగా
వడివడిగా నలవడును కాక!
పితృపాదు లభిమానవిద్యగాఁ గను వైద్య
మున నీకు నైపుణ్య మొనరుఁ గాక!
తండ్రిధర్మంబు ముత్తాత ధర్మంబు నీ
వర్తనంబునఁ గూడి వచ్చుఁ గాక!
రాచసంబంధంబు మా చల్లపల్లికి
నీ చేత నిత్యమై నెగడుఁ గాక!

ఆ.వె. ముట్టినట్టిదెల్ల ముత్యంబుగాఁ జేతఁ
బట్టినట్టి దెల్లబంగరుగను
పొసఁగుఁగాక పూర్ణపురుషాయుషము నీకు
మహితతేజ శ్రీకుమారరాజ!

ఉ. ఎన్మిదియేండ్లు సాగి పరమేశ్వరుసత్కృపఁజంద్రమౌళి భూ
భృన్మణి పుత్రరత్న మభివృద్ధిదగన్ నవమాబ్దమందఁగా
జన్మదినోత్సవంబునను జక్కఁగఁదీరిచి పద్యరూపముల్
సన్మతిఁబంచరత్నము లొసంగెఁ బ్రభాకరశాస్త్రి కాన్కగాన్.

తొలిపలుకు

(వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్టు ప్రచురణలోనిది యథాతథం)

ఆరగింపఁబోవువారికిఁ గూర రుచి చెప్పఁబనిలేదన్నట్టు గ్రంథమును జదువనున్న వారికి దానిఁగూర్చి ప్రశంసచేఁత యంతగా నావశ్యముగాదు. నే నెఱిఁగినంతలో సంస్కృతాంధ్ర భాషలలో నిట్టి యుత్కృష్టనీతిగ్రంథము గానరాదు. మహాభారతాదులలో నింతకంటె నెక్కువగాఁగూడ నీతు లుండ వచ్చును; కాని, యవియెల్ల నాను పూర్వితో నిందున్నట్లు సందర్భితములుగా నుండవు. అంతేకాక యే దేశమునఁగాని యే కాలమునఁగాని యించుకేని మార్పనక్కఱలేకుండ సార్వత్రికముగా సార్వకాలికముగా నిలువఁదగిన విధమున నీతులిందు నిబద్ధములై యున్నవి. ఇతరత్ర యిట్టి తీరు గానరాదు.

క్రీ. 1751 సం॥ నుండి 1812 నాఁటి కీ గ్రంథమాంగ్లభాషలో నేఁబది పర్యాయములు ముద్రితమయ్యెనట. మఱియు ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ, వేల్సు మొదలగు దేశములం దాయా భాషలలోనికిఁ బరివర్తితమై బహుప్రచారము గాంచెనట. ప్రఖ్యాతులగు చిత్రకారు లీ గ్రంథవిషయములను బహువిధములఁ జిత్రించిరట. తేటగా, సూటిగా, సూక్ష్మముగా, సుదృఢముగా జీవితనిబంధనములఁ జెప్పుటలో నీ గ్రంథ మద్వితీయమయినది. కావుననే యక్కడ నంతవ్యాప్తిఁజెందెను. సర్వమానవ సామాన్యముగాఁ బారాయణము చేయఁదగిన దీ గ్రంథ మన్నంత యభిమానము నాకున్నది.

ఆంగ్లానువాదకారుఁడు ఛస్టర్ ఫీల్డు ప్రభునకు వ్రాసిన యుత్తరమును బట్టి మూలగ్రంథోపలబ్ధికథ తెలియనగును. ప్రాచీనుఁడగు బ్రాహ్మణుఁ డా గ్రంథము రచించెనని యాతఁడు వ్రాసినాఁడు. అది యే భాషలోనున్నదో యాతఁడు స్పష్టముగాఁ జెప్పఁడయ్యెను. 1749 సంవత్సరమునకు దుర్గమమై దుర్జ్ఞేయమైయున్న తిబెటుదేశమును, పొటలా పర్వతాగ్రముననున్న లామా మతమును నేఁడు సుగమమై సుజ్ఞేయమై యున్నవి. అక్కడ సురక్షితమై యున్న యా మూలగ్రంథము మనకు దొరకెనేని తత్త్వమెఱుఁగఁ గల్గుదుము.

ప్రాభవము గలవారు దానికై ప్రయత్నింపఁదగుదురు. ప్రాయికముగా నది బౌద్ధగ్రంథమై యుండునని నేను దలంచుచున్నాఁడను. ఈ గ్రంథమం దక్కడక్కడ అరేబియా ఐజిప్టు దేశముల పేళ్లున్నవి. బ్రాహ్మణుఁడు రచించినాఁ డనుటకు బలిష్ఠము లయిన సాధకములుగాని, బాధకములుగాని యిందుఁ గానరావు. కాని, యీ క్రింది వాక్య మార్యుఁ డెవ్వఁడు ననఁగూడనిదిగా నున్నది.

"అది (ఆత్మ) నీవు పోయిన పిమ్మటఁగూడ జీవించినను నీవు పుట్టుటకుఁ బూర్వముగూడఁగల దనుకొనకుము. నీ దేహముతో నదియు సృష్టింపఁబడినది. నీ ప్రేగులతో నదియుఁ బెఱిగినది."

క్రైస్తవుఁడగు నాంగ్లానువాదకారుఁడు స్వమత సిద్ధాంతానుగుణముగా నీ వాక్యమును మార్చెనో లేక చేర్చెనో యని నేను సంశయించుచున్నాఁడను. ఇఁక నంతగా నార్యమత విరోధములగు విషయము లిందు లేవు.

మన్మిత్రులు బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రొకప్పుడు ఆంగ్ల భాషలోనున్న యీ గ్రంథము నెఱిఁగించి తెలిఁగింప నన్నుఁ బ్రోత్సాహపఱిచిరి. ఆంగ్లభాష నేరనివాఁడ నయినను నే నా గ్రంథమును గొంత చదివించుకొని విని దాని యుత్కృష్టత కచ్చెరువంది తెలిఁగింతునుగాక యని పూనితిని.

అప్పుడే బి.యే. ప్యాసయియున్న యొక మిత్రునిచేఁ బయిగ్రంథము నకుఁ దెలుగుటీక వ్రాయించుకొంటిని. వారు వ్రాసిన యా టీక మూలమును గొంతవఱ కర్థముచేసికొనుటకు మాత్రమే నాకుపకరించెను. దానిని జేత నుంచుకొని మా తమ్ముఁడు చిరంజీవి-చంద్రశేఖరశాస్త్రి (ఎల్.ఎమ్.పి) తోడ్పాటుతోఁ గ్రొత్తగాఁ దీర్చిదిద్ది నే నీ తెలుఁగు రచనము చేసితిని. మూలాను గుణముగానే యీ తెలుఁగుచేత యుండును. నా కాంగ్లభాషరామి గ్రంథము నర్థము చేసికొనుటలోఁ గొంత యనర్థకమే యయినను, వాక్యరచన చేయుటలోఁ దెలుఁగుదనమును వెలయించుటకుఁ గొంత సార్థకమే యయ్యె ననుకొనుచున్నాఁడను. సంస్కృతభాషలోనికిఁగూడ దీని నిఁకఁ బరివర్తింతును.

ఇంగ్లీషున దీనికి 'The Economy of Life ' అని పేరున్నది. "మానవజీవిత నిబంధనము' అనుట దానికి సరియయిన తెలుఁగయినను,

ఆ పేరంత ససిగాలేదని 'నీతినిధి' యని మార్చితిని. మన ప్రాచీను లిట్టి గ్రంథములను నీతిశాస్త్రగ్రంథము లనిరి. కావున నేను బెట్టిన పేరు దూషితము గాదని నా యుద్దేశము. నా రచనమునందలి గుణదోషములకు ప్రాజ్ఞులు ప్రమాణము.

ముక్త్యాల సంస్థానాధీశ్వరులగు శ్రీరాజా వాసిరెడ్డి శ్రీ చంద్రమౌళీశ్వర ప్రసాద బహద్దరు వా రీ గ్రంథమును జాలఁగాఁ జిత్తగించి తమ పుత్త్రరత్నము పేర నంకితముసేయ నంగీకరించి ముద్రణాదులయందు నాకు సర్వసౌకర్యమును గలిగించిరి. బ్రహ్మశ్రీ దేశోద్ధారక కాశీనాథ నాగేశ్వరరావు పంతులుగారు తమ గ్రంథమాలలోఁ బ్రకటించి మిక్కిలిగాఁ దోడ్పడిరి. ఈ యిర్వురియెడ నే నెంతయుఁ గృతజ్ఞుఁడను.

అక్షయ తృతీయ
14-5-26 వేటూరి ప్రభాకరశాస్త్రి

ఉత్తరము

ఆంగ్లానువాదకారుఁడు చస్టరు ఫీల్డు ప్రభువుకు (The Earl of Chester field) వ్రాసిన యుత్తరము

పెకిను, మే. 12 తేది 1749.

అయ్యా,

1748 సంవత్సరము డిసెంబరు 23 తేదీని క్రిందటి తూరి మీకు వ్రాసిన యుత్తరమున నీ సామ్రాజ్యపు స్థలనిర్దేశమును గూర్చియు స్వభావ చరిత్రమును గూర్చియు తెలుపవలసిన విషయములను ముగించితి ననుకొనెదను. ఈ యుత్తరమందును నిఁక మీఁద వ్రాయఁబోవు నుత్తరములందును, నిక్కడి చట్టములు, పరిపాలన, మతము, ప్రజల సంప్రదాయములు, మొదలగు వానిని గూర్చి నాకు గోచరించిన విషయములను గొన్నింటినివ్రాయ నుద్దేశించితిని. యిటీవల నిక్కడి విద్యాధికుల సల్లాపములనెల్ల స్వాధీనపఱుచు కొనఁగల్గిన యత్యద్భుత విషయమొకటి సంప్రాప్తమయినది. ప్రాయికముగా నిది యిఁకముందు ఐరోపాలోని పండితులకుఁగూడ నాలోచనావిషయమై వెలయ వచ్చును. ఆ నూత్నవిషయము తమకుఁగొంత సంతోషమును గలుగఁజేయఁ గలుగునని నాకుఁ దోఁచుటచే నుపలబ్ధమైనంతవఱకు స్పష్టముగాను సమగ్రముగాను దానిని మీకు నివేదించుకొనుచున్నాఁడను.

చీనా సామ్రాజ్యము నానుకొని పడుమటి దిక్కున తిబెటు అనియుఁ గొందఱచే బారన్‌టోలా అనియుఁ బేర్కొనఁబడునట్టిది పెద్దదేశము గలదు. ఆ దేశమున లాసా యని పేరుగల రాష్ట్రమందు, ముఖ్యుఁడయిన లామా (ప్రధానమతాచార్యుఁడు) కలఁడు. ఇరుగుపొరుగు దేశముల వారనేక జాతులవా రాయనను శ్రద్ధాభక్తులతో నారాధించుచు నుందురు. అక్కడి విగ్రహార్చకుల కాయన ప్రధానాచార్యుఁడు. ఆయన పవిత్రచరిత్రమునెడ నత్యంతాదరము గలవారై యనేకులు మతాభిమానులు లాసాకువచ్చి యాయన నారాధించి యాయనచే నాశీర్వచనములంది పోవుచుందురు. పొటలాపర్వతాగ్రమున నతిరమణీయముగాఁ గట్టఁబడిన యొక మఠమున నాతఁడుండును. ఆ పర్వతము క్రిందను, లాసారాష్ట్రముననను, వేఱువేఱు సంప్రదాయములు గలవారు మఠాచార్యులు పలువురు గలరు. వారిలోఁ బలువురకు వారి గౌరవమునకుఁ దగినట్టు కట్టింపఁబడిన మఠములు పెక్కులున్నవి. అందు వా రారాధింపఁబడుచుందురు. ఇటలీదేశమువలె నా దేశముగూడ మఠాచార్యులతో నిండి యుండును. టార్టరీదేశపు భాగము లన్నింటనుండియు, మొగలాయిచక్రవర్తి రాజ్యమున నుండియు, తూర్పు దిక్కునఁగల యన్ని భాగముల నుండియుఁ బంపఁబడు ననర్ఘసత్కారములచే వారు మహాదశ ననుభవించుచున్నారు. ముఖ్యుఁడగు లామా (మఠాచార్యుఁడు) పూజా పురస్కారములందు నపుడొక దివ్యపీఠముపయి మృదువయిన పఱుపు మీఁద బద్మాసనమునఁ గూర్చుండును. ఆయన నారాధించు శిష్యులు దీనదీనముగా బ్రస్తుతించుచు, మిక్కిలియడఁకువతో సాష్టాంగముగాఁ బాదములపైఁబడి ప్రణమిల్లుదురు, కాని, యాయన వారియెడ నణుమాత్రమేని ప్రత్యాదరముఁజూపఁడు. గొప్ప రాచబిడ్డల నయినను నాతఁడెప్పుడును బలుకరింపఁడు. వారి శిరములపైఁ దన హస్తము నుంచును. దానితో వారు తమ పాపములెల్లఁ బటాపంచలైనవని తనియుదురు. తమ హృదయగతములయిన రహస్యములనుగూడ నాతఁడెఱుఁగునని నమ్మునంత యమాయికతతో వారాయన నారాధించుచున్నారు. ఆ మఠాచార్యులలో నభ్యర్హితులయినవారు రెండువందలమంది ముఖ్యుఁడయిన యా లామాకుఁ బ్రధాన శిష్యులుగా నున్నారు. వారాయన శాశ్వతముగా జీవించు వాఁడనియు నెన్నఁడయినఁ జని పోవునట్టు కన్పట్టినను నది ప్రాంతదేహమునువదలి క్రొత్తదేహమును జేరఁ బోవుటయనియుఁ బ్రజలకు నమ్మకము కల్గునట్టు చెప్పుచుందురు.

ప్రధానుఁడగు నా లామా వసియించు మఠమునఁ బ్రాచీన గ్రంథాలయములు గలవనియు వానిలోఁ బహుపురుషాంతరములనుండి యెవ్వరికిని దెలియకుండఁబెక్కు మహాగ్రంథములు గుప్తములయి యున్న వనియు, చీనాదేశపు విద్వాంసులు బహుకాలమునుండి తలంచుచుండిరి. ఇప్పుడు చీనాదేశమును బరిపాలించుచున్న సార్వభౌముఁడట్టి ప్రాచీన గ్రంథములను బరిశోధింపించుటలో వేడుకగలవాఁడు. కాలక్రమమున నాతని కీ విషయమున నభినివేశ మధికము కాఁగాఁ బ్రఖ్యాతములుగాని, ప్రాచీన గ్రంథములేవైన బయల్పడునేమో యని వెదకింప నిశ్చయించెను. ప్రాచీనభాషలు

మాటాడుటలోను వ్రాయుటలోను సమర్థుఁడగు విద్వాంసునిఁగనుఁగొను టాతనికిఁ బ్రథమకర్తవ్య మయ్యెను. కొలఁది కాలమునకే యాతఁడు కెయాట్సూ అను పేరుగల పండితప్రకాండు నొకని నీ కార్యమునకై నియోగించెను. ఆ పండితుఁ డిప్పటికి దాదాపుగా నేఁబదియేండ్ల యీడుగలవాఁడు. గంభీరమయి దీర్ఘాలోచనా పటుత్వమును సూచించు ముఖముగలవాఁడు. మంచి వాగ్ధాటి గలవాఁడు. లాసా దేశీయుఁడును, విద్యావంతుఁడును నగు నొక మతా చార్యుఁడు పెకిన్ పట్టణమునఁ బెక్కువత్సరములనుండి నివసించుచుండఁగా నీ పండితుఁడతనితో యాదృచ్ఛికముగా మైత్రిని బడసి తిబెట్టుదేశములోని మతాచార్యులు మాటాడుకొను భాషలోఁ బరిపూర్ణమగు పాండిత్యమును సంపాదించెను.

ఇట్టి యోగ్యతలు గలవాఁ డీ పండితుఁడు తిబెట్టుదేశమునకుఁ బ్రయాణమయ్యెను. ఈతఁడు చేయవలసిన పనికిఁ బ్రాముఖ్య మేర్పడుటకై యా సార్వభౌముఁడు ప్రధానమంత్రియను బిరుద మీతని కొసఁగెను. ఈతని వెంటనే దేదీప్యమానములగు దుస్తులను ధరించిన సిబ్బందిని, సేవకులను, బంపెను.

అక్కడి ప్రధానుఁడగు లామాకును, ఇతర మతగురువులలో నెన్నికగన్న వారలకును, ననర్ఘములయిన కానికల నంపెను. ఇవిగాక స్వహస్తాక్షరములతో నీ క్రింది విధముగాఁ బ్రధానుడగు నా లామా కొక యుత్తరము నంపెను.

"భగవంతుని ప్రతినిధులయి, అత్యౌన్నత్యము, నతిపవిత్రతయుఁ గాంచి పూజనీయులయిన పుణ్యాత్ములకు:–

"రాజాధిరాజులమయి చీనాసామ్రాజ్యమునకు సార్వభౌమత్వము వహించిన మేము మాచే నధికముగా గౌరవింపఁబడు కెయాట్సూ యను ప్రధానమంత్రి ద్వారమునఁ దమ పవిత్రపాదములకు భక్తితోను బ్రపత్తితోను సాష్టాంగ ప్రణామము లాచరించి, మాకును, మా మిత్రులకును, మా సామ్రాజ్యమునకు, నమోఘమై కరుణార్ద్రమై వెలయు తమ యాశీర్వచనముల ననుగ్రహింతురుగా కని విధేయులమయి వేఁడుచున్నారము."

"పురాతన గ్రంథములఁ బరిశోధించి పెక్కు పురుషాంతరములనుండి మఱుఁగుపడియున్న విజ్ఞానమును నేర్చుకొని, దానిని పునరుద్ధారము చేయవలయునను కోరికతో మేము, సామాన్యులకేకాక విద్యావంతులకుఁ గూడఁ బ్రాచీనతచే మిగుల నస్పష్టములయిన యమూల్యగ్రంథములు గొన్ని యనాది సిద్ధమయి యారాధనీయమైయున్న తమ యాచార్యాధిపత్యమునకు సంబంధించిన పవిత్ర గ్రంథాలయములందుఁ గలవని లెస్సగా నెఱిఁగి శక్యమగునంతవఱకు వానిని సంరక్షించుటకయి, పవిత్రతచేఁ బ్రాభవము గాంచిన తమ సన్నిధానమున కధికారమిచ్చి, విద్యాధికుఁడును మాననీయుఁ డును నగు కెయాట్సూ అను మా ప్రధానమంత్రిని బంపుట యుక్తమని తలంచి యట్లు చేసితిమి. ఆయన ప్రాచీనభాషలందుఁగల పాండిత్యాతి శయముచే నెట్టి ప్రాచీనగ్రంథములనేని పరిశోధించి వ్యక్తపఱుపఁగలఁడని తలఁచి యట్టివానిని జదువుటకును బరిశీలించుటకును దమ యనుమతిని బడయఁగోరుచుఁ బంపుచున్నాము. మేము వేఁడిన విషయమున మీ రనుమతి నొసఁగుటకు మీ యెడల గౌరవమును బ్రకటించు మా స్వభావము వ్యక్తమగునట్లు మీ పాదములకు సాష్టాంగముగా మ్రొక్కవలసినదని యీయనను మే మాజ్ఞాపించితిమి."

అనేక విచిత్రవిషయములతోఁ గూడియున్న తన ప్రయాణపు సమగ్ర చరిత్ర నా పండితుఁడు ప్రకటించెను. కాని, యా విషయములను వేనినేని వివరించి యిప్పుడు మీకుఁ గాలహరణము గావింపను. నే నింగ్లండునకుఁ దిరిగి వచ్చినప్పుడా విషయముల నన్నింటిని, ప్రాయికముగా నాంగ్లభాష లోనికిఁ బరివర్తించి ప్రకటించెదను. ఆ పండితుఁ డా పుణ్యదేశమునకు జేరిన తోడనే యాతఁడు కొనిపోయిన కానికల యనర్ఘతయే యాతని ప్రార్థన కనుజ్ఞ నిప్పించె నని తెల్పుట యిప్పటికిఁ జాలును.

మహోత్కృష్టమగు నామతాచార్యుని మఠమునందే యా పండితునకు విడిది యేర్పఱుపఁబడెను. గొప్ప విద్వాంసుఁడగు నొక మతాచార్యుఁడతనికి వలయు సాహాయ్యముఁ జేయుటకై నియమితుఁడయ్యెను. దాదాపుగా నాఱు నెల లాతఁడక్కడనుండెను. బహుపురాతనములును మహోత్కృష్టములును నగు గ్రంథముల నెన్నింటినో యాతఁడప్పుడు కనుఁగొనఁగలిగెను. వానిలో

గొన్నింటనుండి ప్రశస్తములగు భాగములను గొన్నింటిని గ్రహించి వానిని బట్టి వానిని రచించిన వారెవరో వారి దేశ కాలములేవో యాతఁడు నిర్ధారణ చేసెను. ఆ నిర్ధారణములనుబట్టి యాతఁడు కుశాగ్రబుద్ధియనియు, గొప్ప వివేచనశక్తి గలవాఁడనియుఁ, జాలఁగాఁ జదువుకొన్నవాఁడనియు నెఱుఁగ నగుచున్నది.

పూర్వపు జిమ్నోసోఫిస్టులయో, లేక బ్రామినులయో (బ్రాహ్మణులు) భాషలో రచితమై పెక్కు తరములనుండి యే మతాచార్యునకుఁగూడ నెఱుక పడకున్న చిన్న నీతిశాస్త్ర గ్రంథమొకటి యాతఁడు కనుఁగొన్నవానిలోని కెల్ల బహుపురాతనమయినది. కాని, యా గ్రంథమునకు రచయిత యెవ్వఁడో యేనాఁటివాఁడో యాతఁడు నిర్ణయింపఁజాలఁడయ్యెను. ఆ గ్రంథము నాతఁడు సంపూర్ణముగాఁ జీనాభాషలోనికిఁబరివర్తించెను. కాని, యా పరివర్తనము నకు మాతృకకుఁగల భావసౌష్ఠవము, రచనాసౌందర్యము, గొంత కొఱఁ తపడియే యుండునని యాతఁడే చెప్పుకొన్నాడు. బాంజీలును, మఱి యితర విద్వాంసులును నీ గ్రంథమును గూర్చి భిన్నాభిప్రాయములు గలవారై యున్నారు.

మిక్కిలిగా దీనిని మెచ్చుకొనుచున్నవారు తమ దేశపు మహావేదాంతి యగు కాన్ఫ్యూషియస్ దీనికిఁ గర్తయని యత్యుత్సాహముతో ననుచున్నారు. కాన్ఫ్యూషియస్ గ్రంథకర్త యగునేని గ్రంథము చీనాభాషలో నుండవలెను. దానికి వారు కాన్ఫ్యూషియస్ రచియించిన మూలగ్రంథమిప్పుడు నశించి పోయినదనియు, ప్రాచీనకాలపు బ్రామినుల (బ్రాహ్మణుల) భాషలోనికది పరివర్తితమయ్యె" ననియుఁ జెప్పుదురు. టెయస్సీయను వర్ణమువారి నేర్పఱి చినవాఁడును, కాన్ఫ్యూషియస్‌కు సమకాలమువాఁడునునగు లాకియన్ అను వేఱొక చీనాదేశపు వేదాంతి దీనిని రచియించెనని మఱికొందఱందురు. కాని, వీరుగూడ కాన్ఫ్యూషియస్ రచియించెనని యనువారివలెనే గ్రంథభాషా విషయమునఁ జిక్కులోఁ జిక్కుకొనుచున్నారు. గ్రంథమందుఁ గాననగు ప్రధాన విషయములను గొన్నింటిని బట్టియు, భావములను గొన్నింటిని బట్టియు, నిది యైరోపియనులచేఁ బదిలపఱుపఁబడి ప్రఖ్యాతిగాంచిన యుత్తరమును అలగ్జాండరు చక్రవర్తికి బహుకాలమునకుఁ బూర్వము వ్రాసియుండిన

డాండమిన్ అను బ్రామినుని (బ్రాహ్మణుని) చే రచితమయినదని మఱికొందఱ నుచున్నారు. కెయాట్సొకూడ నీ కడపటి మతము నొప్పుకొనునట్టు కన్పట్టు చున్నాఁడు. అది ప్రాచీనకాలపు బ్రామినులలో నొక్కనిచే రచియింపఁబడె ననియు, రచనాసౌష్ఠవమునుట్టి చూచిన నది యనువాదముఁ గాదనియు నాతఁడనుచున్నాఁడు. ప్రాగ్దేశవాసుల కా గ్రంథరచనావిధానము కేవలము క్రొత్త రీతిదిగాఁ గానవచ్చుచుండుటచేత గ్రంథకర్తనుగూర్చి వారెట్టి నిర్ణయమును జేయఁజాలకున్నారు. ప్రాగ్దేశవాసులవేయని చెప్పఁదగిన పలుకుబళ్లు కొన్ని లేకుండెనేనియును, ప్రాచీనమయిన బ్రామినులభాషలో లేకుండె నేనియును బలువురు దీని నొక పాశ్చాత్యుఁడు రచించియుండునని యూహించి యుందురు.

గ్రంథకర్త యెవ్వరయినను నీ పట్టణమందును నీ సామ్రాజ్యమందును బ్రజ లీ గ్రంథమును బ్రశంసించుచుండుటచేతను, అన్ని జాతులవారును నాసక్తితోఁ జదువుచుండుటచేతను, అందును గొందఱు మిక్కిలి యెక్కువగా మెచ్చుచుండుటచేతను ఆంగ్లభాషలోనికిఁ బరివర్తనముకుఁగాని నా రచన మెంత వెనుకఁబడియుండునో మీరు తెలిసికొనఁజాలరుగదా యని నేనిట్లు సాహసించితిని. పరివర్తన రీతికిని భాషాశైలికిని క్షమింపవలసినదిగా మిమ్ము నేను వేడుచున్నాఁడను. తొలుత నుపక్రమించినప్పు డీ విధముగా రచింప వలయునని నే నుద్దేశింపలేదు. కాని, యుపోద్ఘాతమందుఁగల యాలోచనా పటిష్ఠత, భావప్రకటనశక్తి, వాక్యముల సంక్షిప్తత నన్నట్టి శయ్యకుఁ దార్చినవి. మన జాబ్ పుస్తకము, ప్రార్థనగీతములు, సాలమనురచనలు, మతాచార్యుల రచనలు, తత్తుల్యసౌభాగ్యముగల యీ గ్రంథము ననువదింప దొరకొన్న నాకుఁ గొంత సౌకర్యమును గలిగించినవి.

ఇట్టి యీ గ్రంథము మీకు ముదము గూర్పఁగల్గినచో నే నానందభరి తుఁడ నగుదును. ఇంకొకతూరి యిచ్చటి ప్రజలఁగూర్చియు సామ్రాజ్యమును గూర్చియు మిగిలిన విషయములఁ దెలుపుకొందును.

ఇట్లు

....

ప్రజాసామాన్యమునకై ప్రకటన

(ఆంగ్లముద్రణమున)

ఎవని సంతోషము కొఱకయి యీ గ్రంథ మాంగ్లభాషలోనికిఁ బరివర్తితమై పంపఁబడినదో యాతఁడిది సౌశీల్యమును సద్వర్తనమును స్పష్టీకరించుచు, పటిష్ఠములు, భావపూరితములు, సంక్షిప్తములునగు వాక్యములు గలిగి పాఠకులకు మేలుగూర్పఁ జాలియున్నదని నమ్మి ప్రజాసామాన్యమునకై ప్రకటింప నుత్సహించెను.

ఈ గ్రంథమును బ్రకటించు నాతని నామధేయమును, వాఙ్మయ విషయమునఁ గ్రొత్త విషయములను గనుఁగొనుటకుఁగాక యితర కార్యములకై నియమితుఁడై చీనాదేశమునఁ బెక్కు వత్సరములనుండి నివసించుచుండిన యీ యాంగ్లానువాదకారుని నామధేయమును, నేఁడు గుప్తములుగా నుండుటయే యుక్తమనుటకుఁ దగ్గ కారణములు కొన్ని యున్నవి. ఈ కారణములెక్కువ కాలము నిలిచి యుండవు. ఇంగ్లండునకుఁ దిరిగివచ్చి కెయాట్సూ ప్రయాణచరిత్రమున కాంగ్లభాషానువాదము నీ యనువాద కారుఁడు ప్రకటింపనున్నట్లు తెలిపినాఁడు. అట్లు ప్రకటించినపుడు ప్రజలు తాము తెలిసికొనఁగోరు సర్వవిషయములను దెలిసికొనుటకు వీలుపడును.

ప్రస్తావన

నీతినిధి ఒక ప్రశస్తమైన ఉద్గ్రంథం. ఇది పరిమాణంలో కొద్దిదే అయినా ప్రభావంలో మాత్రం గొప్పది. ఈ గొప్పగ్రంథం పునర్ముద్రణ పొందుతున్న సందర్భంలో ఇప్పుడు నేనీ నాలుగు పంక్తులూ వ్రాయబూనడానికి ప్రధానకారణం చిరంజీవి ఆనందమూర్తి కోరికను కాదనలేక పోవడమే. శ్రీ ప్రభాకర సంపూర్ణగ్రంథావళి ప్రకటన కుద్యమిస్తూ అందు తొలిసంపుటంగా నీతినిధి నెన్నుకొని నా మీద ఆదరంచేతనూ, ఆ గ్రంథంతో నాకూ కొంత సంబంధమున్నదన్న హేతువుచేతనూ కావచ్చును ఆనందమూర్తి నన్నీ ప్రస్తావన వ్రాయగోరినాడు. అంగీకరించినాను. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్టును రూపొందించి దాని పక్షమున ఇప్పుడీ నీతినిధిని ముద్రించడము మెచ్చుకోదగిన విషయము; అవసరము కూడాను. ఈశ్వరానుగ్రహమున ఈ ఉద్యమము నిరంతరాయముగా కొనసాగగలదనీ, దానికి అన్ని విధాలా అందరి తోడ్పాటు లభించగలదనీ ఆశిస్తున్నాను.

ఈ నీతినిధి ఒక ఆంగ్లగ్రంథానికీ తెనిగింపు. ఆ ఆంగ్లరచన కూడా మూలరచన కాదు. అదీ చీనాభాషలో లభ్యమైన ఒక గ్రంథానికి అనువాదము. ఆ చీనాభాషాగ్రంథమూ మూలరచన కాక అదీ మరొక మూలభాషా రచనకి అనువాదంగా తెలియవస్తున్నది. ఇంతకూ ఈ రచన మౌలికంగా ఎప్పుడు ఏ భాషలో వెలువడిందో దాని మూలకర్త ఎవరోకూడ స్పష్టంగా మనకిప్పుడు తెలియరావడం లేదు.

ఏ మహాపురుషుడో ఎన్నడో ఎక్కడో వ్రాసిన ఈ గ్రంథం కాలగర్భంలో మరుగుపడి టిబెట్టు, చైనా దేశాలలో ఆయా భాషలలోనికి అనువదింపబడి నిలువర మందియుండినట్లు తెలుస్తున్నది.

చెస్టరుఫీల్డు ప్రభువుకి సంబంధించిన ఒక ఆంగ్లేయుడు 18వ శతాబ్ది మధ్యభాగంలో చైనాలోని గ్రంథాలయంలో చీనాభాషలో కానవచ్చిన ఈ గ్రంథాన్ని చూసి ఆకృష్టుడై " Economy of Human life " అనే పేరుతో దాన్ని ఆంగ్లభాషలోనికి అనువదించి చెస్టరుఫీల్డు ప్రభువునకు పంపెను.

ఇంగ్లండు దేశంలో అచ్చుపడి ఈ గ్రంథం బహుళ ప్రచారం పొందినట్లు, దరిమిలా అనేక యూరోపియన్ భాషలలోకి పరివర్తితమై ప్రసిద్ధి కెక్కినట్లు తెలియవస్తున్నది.

ఈ గ్రంథపు ఆంగ్లానువాద ప్రతులూ మనదేశంలో ఏ కొద్ది గ్రంథాలయాలలోనో అరుదుగా మాత్రమే ఉన్నట్లు తెలుస్తున్నది.

బహుగ్రంథపరిశోధకులు శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు ఈ గ్రంథ ప్రతినెక్కడో చూచి దాని ప్రాశస్త్యాన్ని శ్రీ ప్రభాకరశాస్త్రిగారి కెరిగించి దాని నాంధ్రీకరింప వలసినదిగా కోరగా, నైతిక విషయాలలో ప్రత్యేక శ్రద్ధాళువులైన శాస్త్రిగారు శ్రీ వేపా రామేశంగారి ద్వారా అడయారు లైబ్రరీలో నున్న " Economy of Human life " అనే ఆ గ్రంథాన్ని వెంటనే తెప్పించి అందలి కొన్ని భాగాలను నాచేత చదివించుకొని, ఆంగ్లభాష అంతగా రాకపోయినా తమ సహజప్రతిభచేత భావాన్ని గ్రహించి పరితోషపడి మక్కువతో దానిని తెనిగించుట కుద్యమించారు.

అప్పుడే కొత్తగా బి.ఏ. పాసై నిరుద్యోగిగా ఉన్న యువకుడొకడు శ్రీ గన్నవరపు సుబ్బరామయ్యగారితోపాటు ప్రతివిలేఖకుడుగా పనిచేయడానికి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారానికి వచ్చి, ఆయన మూలంగానే పరిచితుడై యుండెను. ఆ యువకునిచేత ప్రభాకరులు ఈ గ్రంథానికి తెలుగులో టీక తయారు చేయించారు. (ఆతని పేరేమో నాకిప్పుడు గుర్తులేదు.) ఆ టీకని తన దగ్గర పెట్టుకొని ఆంగ్లమూలాన్ని నేను చదివి వినిపిస్తూ దాని భావాన్ని తెనుగులో వివరించగా నా వివరణాన్ని తమ వద్దనున్న టీకతో సమన్వయించి మూలభావాన్ని, తెలుగు నుడికారానికి తగినట్లుగా ఆయన వాక్యరచనని కొత్తగా వెలయించి తమ సహజ సరళశైలిలో నీతినిధిని రచించినారు.

అజ్ఞాత వాఙ్మయ ప్రకాశకులైన శ్రీ ప్రభాకరుల కలంనుండి అట్లు వెలువడిన యీ రచన ఆంగ్లమూలంలోని భావాన్ని చక్కగా సుస్పష్టంగా విశదీకరించడమేకాక స్వతంత్ర రచనవలె చదువరుల హృదయాలకు హత్తుకుపోయేవిధంగా సాగింది. ఈ ప్రశస్త గ్రంథరచనలో అప్పుడు నేనాయనకు ఒసగగల్గిన తోడ్పాటు బహుస్వల్పమైనదైనా అది నా అదృష్ట విశేషమని సంతసిస్తూ ఉంటాను.

ఈ నీతిగ్రంథం సాధుశీలురగు ప్రభాకరుల దృష్టి నాకర్షించడం, ఆయన దీనిని ప్రత్యేకాభిమానంతో తమ సహజ మధుమయ ఫణితిలో అనువదించడం ఆంధ్రుల అదృష్టమని నేను భావిస్తున్నాను.

ఈ గ్రంథప్రాశస్త్యాన్ని గుర్తించి దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు

పంతులుగారు దీనిని తమ ఆంధ్రగ్రంథమాలలో అయిదవ కుసుమముగా స్వీకరించి సంపాదకీయము వ్రాశారు.

సారస్వతప్రియులు ఉదారులు అయిన ముక్త్యాల ప్రభువులు రాజా వాసిరెడ్డి చంద్రమౌళీశ్వర ప్రసాదుగారు తమ కుమారుని నవమ జన్మదినోత్సవం సందర్భాన ముక్త్యాల రాజమందిరంలో జరిగిన పండితసభకు శ్రీ ప్రభాకరశాస్త్రిగారిని ప్రత్యేకంగా ఆహ్వానించి వారి నుండి ఈ గ్రంథాన్ని తమ కుమారుని పేర అంకితముగాగొని ప్రభాకరశాస్త్రిగారిని, ఆహూతులైన ఇతర ప్రముఖుల్ని ఘనంగా సన్మానించారు.

ఆ సమయంలో ప్రభాకరశాస్త్రిగారు తమ ఆశీర్వచన పద్యరూపములను పంచరత్నములతో పాటు ఈ గ్రంథరత్నాన్ని కూడా వారికి కాన్కగా సమర్పించారు.

ఈ గ్రంథం ప్రథమముద్రణ ప్రతులు శీఘ్రంలోనే ఖర్చైపోవడం రెండవ ముద్రణ వెంటనే జరుగకపోవడంవలన ఈ మధ్యకాలంలో ఈ గ్రంథానికి ఉండతగినంత ప్రాచుర్యం లేకపోయింది. ఈ లోపాన్ని పూరిస్తూ శ్రీ ప్రభాకర పరిశోధకమండలి వారీ గ్రంథ ద్వితీయముద్రణ ఇప్పటికైనా తలపెట్టడం ముదావహం.

సార్వత్రికములు, సార్వకాలికములు అగు ధర్మములు ఈ గ్రంథమున వివిధ శీర్షికల క్రింద సుబోధములుగా పొందుపరుపబడినవి.

రచయిత ప్రతిబింబమే రచన. అనగా రచయిత భావాలను ప్రస్ఫుటంగా విశదీకరించేదే ప్రశస్తరచన. నీతినిధి రచన అనువాదమైనా శాస్త్రిగారి భావాలు మూలంలోని భావాలతో తాదాత్మ్యం చెంది వాటికి పరిపుష్టి కల్పించి ప్రస్ఫుటమై పాఠకుల హృదయాలను స్పందింపజేసేవిధంగా ఉన్నవి. అనువాద విధానంలోనూ మాతృభాషా రచనా పారమ్య మెరిగిన శాస్త్రిగారి వచన రచన మూలంలోని పదాంశ పదబంధాల స్థాయిని, వాక్య పరిధుల్ని అధిగమించి, సందర్భశుద్ధిగల సామ్యసిద్ధితో ముక్తకాలనదగిన మూల వచన ఖండికలలోని భావసౌకుమార్యాన్నంతా వెలార్చే తీరున మూలవిధేయమవుతూనే మూలాతిశాయిగా ఉంటూ, అనువాదమైనా స్వతంత్ర రచనగా సహృదయ హృదయావర్జకంగా సాగింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆంధ్రీకరణ కార్యమాధ్యంతమూ ఇదే మూలమా అన్నంత రమ్యంగా సాగింది: సామ్య పరిశీలనకీ గ్రంథావతరణికలోని ఉదాహరణలే చాలనుకొంటాను.

" He sitteth on his throne in the centre and the breath of his mouth giveth life to the World. He toucheth the Stars with his finger and they run their course reyoicing."

"ఆ సర్వేశ్వరుడు జగన్మధ్యమున సామ్రాజ్యాసనాసీనుడై యున్నాడు. ఆయన ఉచ్ఛ్వాసము ప్రపంచమునకు ప్రాణమిచ్చుచున్నది. ఆయన నఖములు సోకి నక్షత్రములు ప్రజ్వలించుచున్నవి. ప్రచలించుచున్నవి."

" The shadow of knowledge passeth over the mind of man as a dream, he seeth as in the dark, he reasoneth and is often deceived."

"స్వప్నమువలె జ్ఞానచ్ఛాయ మానవుని మనసు మీదనుండి దాటిపోవు చున్నది. దానిని మానవుడు చీకటిచూపున జూచుచున్నాడు. తర్కించి భ్రమయుచున్నాడు."

" Who is like unto the Lord in glory? Who in power shall contend with the Almighty? Hath he any equal in Wisdom? Can any in goodness be compared unto him?"

"కీర్తియం దా ప్రభువునకు నీడెవ్వరు? శక్తియం దా సర్వశక్తునకు సాటియేది? జ్ఞానమం దా సర్వజ్ఞునకు సమానమెక్కడ? సౌశీల్యమం దాయనకు సరికలదా?"

దేశీయము, కవిసమయ సిద్ధము, సుందరము, సంగ్రహము, ప్రౌఢము, సహృదయ హృదయైకవేద్యము అయిన ప్రభాకరుల అనువాదసాహితి కివే నా జోహారులు.

నైతికప్రమాణాలు దిగజారి, క్రమశిక్షణ యువకులలోను వయోజనులలోను లోపించిన ఈ రోజులలో నీతినిధివంటి ఉత్తమ గ్రంథాలు దేశానికి ఎంతైనా అవసరం. ఈ అవసరాన్ని గ్రహించి విద్యాధికులు సామాన్య ప్రజలు తమ విధిని గుర్తించి, చదివీ, చదివించీ ఇట్టి గ్రంథాలను ప్రోత్సహించి దేశంలో నైతిక ప్రమాణాలను పునరుద్ధరించడానికి తోడ్పడుదురుగాక!

విజయవాడ
22. 9. 82 వేటూరి చంద్రశేఖరశాస్త్రి.

NEETI NIDHI
A unique exercise in translation

One outstanding work of Prabhakara Sastry is his translation of an English work "Economy of Human Life' into Telugu. This translation by him was a unique exercise for more than one reason. The translator did not have proficiency in English. The fact that he came to know of the existence of such a work was itself surprising as only two copies of it were available - one in the Library of Theosophical Society, Adayar, Madras and another in the National Library, Calcutta. Thus the rarity of the original work is an unusual feature.

Prabhakara Sastry has mentioned in his foreword to his translation how he came to know of this work. Sastriji's friend and esteemed scholar, the late Manavalli Ramakrishna Kavi, who was himself a post- graduate, once told him of this work and suggested to him to translate it into Telugu. That a research scholar of the calibre of Ramakrishna Kavi should have thought that Prabhakara Sastry who did not know English could ably translate the English work into Telugu does credit to both of them.

The title of the Telugu translation is "Neeti Nidhi", The word "Neeti" here means aphorisms and the word 'Nidhi' means a treasure. Prabhakara Sastry has given the reason for not conforming to the title of the original work. He felt that a Telugu translation of the original title would be rather unsuitable. Moreover, our ancients had considered such works as belonging to 'Neeti Sastra'. (i.e. Science of Ethics). Since the work deals with moral values, the translator felt that for the Telugu version the pithy title he had chosen would be unobjectionable.

Here one should know about the greatness of the original work, part of which Sastriji got read out to him and was

astonished about its uniqueness before he decided upon its translation into Telugu.

A personal note has to be struck here inevitably. I came across a pocket size publication of this work, when by uncle Dr. Veturi Sankara Sastry and my self visited G.A. Natesan's bookstall in Esplanade probably in the early forties. I was a postgraduate student at that time. I drew by uncle's attention to this tiny book and suggested to him that the book might be purchased as I had no money with me. It was bought for one rupee and fourteen annas by him. For a long time it was in my uncle's library at Muktyala. Later on when I was in Delhi on service I wrote to my uncle and he kindly sent it on to me. I gave that book, no doubt, to a good friend and a bibliophile, one Kota Lakshminarayana,and the book was lost. Before it was lost in a letter to the Editor, Statesman, New Delhi, I wrote about this book. The letter was published on the 19th August 1963 under the caption " A Chinese Emissary to the Grand Lama - A Rare Book and its Mysteries". The Chinese aggression was on or was over at that time.

The pocket sized book was unpriced. It was published by Luzac & Co., 46, Great Russel Street, London in 1902. It was a translation by an Englishman who preferred to remain anonymous, from an Indian manuscript written "by an ancient Bramin". The translator had addressed two letters to Lord Chesterfield, his patron, forwarding the texts in two instalments to him on May 12, 1749 and January 10,1750. The letters gave the following details about the origin of the manuscript and how he came by it.

The Chinese Emperor (reigning probably in 1749) was interested to know of the hidden treasures in the archives of the Grand Lama of Tibet and sent an eminent Chinese scholar Caotsou, well-versed in Tibetan language, with a letter of introduction and lavish presents, to the Grand Lama. Cao spent about six months in the Sacred College where he was lodged and with the assistance of learned Lamas took copious notes from notable works of antiquity.

"*The most ancient piece he hath discovered and which none of the Lamas for many ages had been able to interpret or understand, is a small system of morality written in the language and character of ancient Gymnosophists of Bramins; but by what particular person, or in what time, he does not determine*".

The Chinese translation of the work became popular and the learned men of that country attempted to attribute it either to Confucius or Lo kium, the founder of the Taossee sect, conveniently assuming that the original Chinese text might have been lost and probably its translation in Sanskrit was only extant. On the basis of internal evidence, some others inferred that it might have been written by the Brahmin Dandamis "whose famous letter to Alexander the Great is recorded by the European writers". Cao seems to bave aggreed with the latter hypothesis.

Regarding the person to whom the book was sent to communicate to the public and the person who translated it into English, it was said:

" There are some reasons which at present make it proper to conceal, not only his own name, but the name of his correspondent, who has now resided in China several years, and been engaged in a business very diffenrent from that of collecting literary curiosities. These reasons will not subsist long: and as he seems to intimate a design, on his return to England, of publishing an entire translation of Cao-tou's whole journey, the public will then, in all probability, have an opportunity of being satisfied concerning any particular which they may be curious to know".

Evidently by 1902, when the Economy of Human Life was published by the Luzac & Co, the identity of the persons referred to was not known.

The preface to the book was written by a Douglas M. Gane of Richmond Hill. The preface mentioned that the book when first published had a ready sale in England and that by 1812 it ran into its fiftieth edition. Then it dropped out of notice. The book would seem to have been translated into French, German, Italian and Welsh. It was paraphrased in verse, illustrated in various styles and by distinguished artists. The publishers brought out a new edition in 1902 to revive interest in the book.

The book is in two parts. The first deals with the duties of man; passions like hope and fear, anger, pity ect. Women; man in his capacity as husband, father, son and brother; accidental differences among men like rich and poor, master and servant etc; social obligations like justice, charity, gratitude, security etc., and religion. The second deals with the organic structure, physical sense and the soul of man; his infirmities like vanity, inconstancy ect., and their effects, the ignoble and noble qualities of human beings; and natural accidents which man is heir to like prosperity and adversity, pain and sickness and death.

On the basis of by letter, the Statesman got the position checked from the National Library, Calcutta. The Library has a 1798 edition. The Economy of Human Life printed by T. Rickaby for E. Harding, Pall - Mall, London 1798. This edition is in seven parts. Part I duties that relate to man considered as an individual; part II of the passions; part III women; part IV consanguinity, or natural relations; part V Providence or the accidental differences of men; part VI social duties: part VII religion.

A. Mawaz of Dacca interacted to my letter in the Statesman on August 20th 1963. He had mentioned that he had a book in his possession with a different title; "UntoThee I Grant" (Unto thee I Grant the Economy of Life"). It is a private, revised, and limited edition in modern English, revised by Ramatheri, and issued by the Roscicrucian Order. It contains the unknown English Explorer's letter of may 12, 1749 and the Chinese Emperor's letters to the Grand Lama of Lahsa.

Mawaz mentioned that the preface says that the English man's letters were addressed to the Earl of Derby who (along with other interested English scholars) had commissioned the former to gather unknown historical and geographical data. It appears that a rare copy of the original translation in English (done in 1749 by the English explorer from Cao-Tsou's Chinese Version brought from Tibet to the court of the Emperor of China), issued in a limited edition by the Earl of Derby, is preserved in the archives of the Rosicrusians. As it was felt that the legibility of this copy could not be preserved for more than a few years, the issue of the present edition was specially authorised, as has been mentioned earlier.

Mawaz in his letter had further said that excavations in Egypt and Jerusalem within the last hundred years revealed that the original manuscript could not have been written by Confucius or anyone of his time or nation or beliefs. He has put in quotes that:

" There is every indication throughout the work most of it was written by Amenhotep IV, Pharaoh of Egypt, during the years 1360 to 1350 B.C. or thereafter, or by some of his successors in the great school of mysticism which he founded in Egypt."

Mawaz has not mentioned the source and authorship of the quotation.

Prabhakara Sastry's Telugu translation was published in May 1926, the publisher being the great Andhra Patriot, businessman, and journalist the late Kasinadhuni Nageswara Rao. It was priced at one rupee and eight annas. It was prescribed as a text book probably for the intermediate course by the Andhra University at one time. This translated work was dedicated to the son of the then Zamindar of Muktyala on the occasion of his nineth birthday, since the Zamindar had provided all facilities for printing etc.

In his foreword Prabhakara Sastry felt that the original might be a Buhdhistic treatise. There are references in the book here and there to places in Arabia and Egypt. Sastriji observed that there were no strong grounds to say that the manuscript was written by a Brahmin. He had reproduced a passage from his Telugu translation which he says would not be acceptable to any Hindu. Retranslated into English (for want of the original text from Economy of Human Life which is not readily available) it runs as follows:

" Even if it (soul) exists after you die,
do not think that it existed before your birth.
It was created along with your body.
It has grown with your intestines."

Prabhakara Sastry suspected that probably the English translator had changed the sentence in accordance with his religious faith or had made an addition. There was no other evidence of anything else being contrary to Hindu faith.

It is interesting to know how Prabhakara Sastry who was unacquainted with English language proceeded with the translation of Economy of Human Life into Telugu. It was no doubt, a hazardous proceeding which only a seer who could see through the veil of language the ideas that are pulsating in the passage

with the minimum of aid of an intermediary could feel and render the translation appropriately and even improve upon the original pieces. Owing to the irretrievable loss of the rare book it is not possible to make a comparative study meticulously. However, Dr. Ananda Murthy, the editor of the journal, Manimanjari copied some passages pertaining to the introduction from the book available with Theosophical Society library which could be utilised for purposes of illustration atleast. Given below are the English passage and their para-wise rendering in Telugu done by Sastriji.

INTRODUCTION

Bow down your heads unto the dust, o, Ye, inhabitants of the earth, be silent and receive with reverence instruction from on high.

అవతరణిక: మానవులారా! పైనుండి వచ్చు దివ్యబోధములకు దలలు వంచి, చెవులొగ్గి, యడఁకువతో నాలకింపుడు.

Wherever the sun doth shine, wherever the wind doth blow, wherever is an ear to hear, and a mind to conceive, these let the precepts of life be made known, let the maxims of truth be wondered and followed.

సూర్యప్రకాశమెక్కడ కలదో, వాయుప్రచార మెక్కడనున్నదో, వినుటకు వీనులును గ్రహించుటకు బుద్ధియును నెక్కడ పనిచేయునో, అక్కడనెల్ల జీవిత ధర్మములు తెలియఁబడునుగాక! సత్యోపదేశములు సమ్మానింపఁబడునుగాక! ఆచరింపఁబడునుగాక!

All things procced from God. His power is unbounded. His wisdom is for eternity and his goodness endureth for ever.

సర్వమును నీశ్వరునియొద్దనుండి వచ్చుచున్నది. ఆయన శక్తి యపరిమితము. ఆయన జ్ఞానము శాశ్వతము. ఆయన వాత్సల్యము సార్వత్రికము.

He sitteth on his throne in the centre and the breath of his mouth giveth life to the world. He toucheth the stars with his

finger and they run their course rejoicing.

ఆ సర్వేశ్వరుడు జగన్మధ్యమున సామ్రాజ్యాసనాసీనుఁడై యున్నాడు. ఆయన యుచ్ఛ్వాసము ప్రపంచమునకుఁ బ్రాణమిచ్చుచున్నది. ఆయన నఖములు సోకి నక్షత్రములు ప్రజ్వలించుచున్నవి: ప్రచలించుచున్నవి.

On the wings of the wind He walketh abroad and performeth His will through all the regions of unlimited space.

వాయువాహనమెక్కి యాయన యనంతమయిన విశ్వమున వాహ్యాళి వెడలి తన సంకల్పములను సమకూర్చుకొనుచున్నాడు.

Order and grace and bounty spring from his hand.

ఆజ్ఞ, అనుగ్రహము, అందము, ఆయన హస్తమునుండి యవతరించు చున్నవి.

The voice of wisdom speaketh in all his works, but the human understanding comprehendeth it not.

ఆయన కార్యములందెల్ల విజ్ఞానము వెల్లివిరియుచున్నది. కాని మానవబుద్ధి దాని నవగతము చేసికొన లేకున్నది.

The shadow of knowledge passeth over the mind of man as a dream, he seeth as in the dark, he reasoneth and is often deceived.

స్వప్నమువలె జ్ఞానచ్ఛాయ మానవుని మనసుమీఁద నుండి దాఁటి పోవుచున్నది. దానిని మానవుఁడు చీకటిచూపునఁ జూచుచున్నాడు. తర్కించి భ్రమయుచున్నాఁడు.

But the wisdom of God is as the height of heaven; He reasoneth not; His mind is the fountain of Truth.

కాని, యా భగవంతుని విజ్ఞానము దేవలోక ప్రకాశమనఁదగినది. ఆయనకు సందేహవితర్కములు లేవు. ఆయన మనస్సు సత్యమున కాటపట్టు.

Justice and mercy wait before His Throne, benevolence and love enlighten his countenance for ever.

ధర్మము, దయ, ఆయన యాస్థానమున నదనువేచి యుండును. ఔదార్యప్రేమ లాయన ముఖవిలాసములు.

Who is like unto the Lord in glory. Who in power shall contend with the Almighty: hath He any equal in wisdom? Can any in goodness be compared unto him?

కీర్తియందాప్రభువునకు నీడెవ్వరు? శక్తియం దా సర్వశక్తునకు సాటియేది? జ్ఞానమం దా సర్వజ్ఞునకు సమానమెక్కడ? సౌశీల్యమం దాయనకు సరికలదా?

He it is, O man! Who hath created thee; thy station on earth is fixed by His appointment; the powers of thy mind are the gift of his goodness; the wonders of thy frame are the work of His hand.

నరుఁడా! అట్టివాఁడు సుమా నిన్ను సృష్టించినవాఁడు. ఈ లోకమున నీ యునికిని నిర్ణయించినవాఁ డాయనయే సుమా! ఈ మన శక్తులను నీ కనుగ్రహించిన వాఁ డాయనయే సుమా! నీ దేహపు సృష్టి వైచిత్ర్య మాయన చేతిపనియే సుమా!

Hear then His voice, for it is gracious, and he that obeyeth shall establish His soul in Peace.

కాబట్టి యాయన యాజ్ఞాపనముల నాలకింపుము. అవి యపార కరుణాపూరితములు. వాని ననువర్తించితివా నీవు నీ యాత్మకు శాంతి సౌఖ్యములను సమకూర్చుకొందువు.

For a Telugu scholar who did not know English the translation is not only precise but also an improvement over the English version. How did he achieve it? In the foreword to his Telugu translation, Prabhakara Sastry mentioned the modus operandi, as follows:-

"I got the Telugu meanings written by a friend who just then passed his B.A. degree examination. The meanings he had

given were useful only to understand the original text to some extent. Keeping it on hand, I had done the rendering in Telugu afresh with the assistance of my brother Chandrasekhara Sastri (L.M.P.). The translation will conform to the original text. Though there is hazard to some extent in understanding the work as I do not know English consider that it has served the purpose some what of constructing sentences in Telugu to bring out its elegance. I shall now translate it into Sanskrit also."

Sastriji could not carry out his intention to translate 'Economy of Human Life' into Sanskrit.

The translation of Economy of Human Life into Telugu, as seen from the introduction should be deemed as excellent. There are, however, one or two points that may be mentioned here. The word 'bounty' in the sentence 'order and grace and bounty spring from his hand' is taken a beauty and translated into Telugu as such. This is in all probability a typing or manuscript mistake in English. The sentence "He toucheth the stars with his fingers and they run their course rejoicing" has been improved upon and beautifully rendered in Telugu.

Prabhakara Sastri's traslation of "Economy of Human Life" does not read like a translation of a work from a foreign language. It has the stamp of originality of a mighty mind that has taken the opportunity of rendering, a work into Telugu to display the translator's mastery over Telugu and its beauty and elegance of expression that endures for all time. I consider this work as Sastriji's unique contribution to Telugu literature.

It is desirable that the mystery that surruonds the 'Economy of Human Life', which is indeed a precious work should be unravelled. A brief recapitulation of what has been stated in the foregoing paragraphs seems to be nesessary for making some suggestions for this purpose. We have known how this rare book

was in the archives of the Dalai Lama of Tibet, and how at the instance of the Chinese Emperor this was one of the works translated into Chinese language by Cao-Tsou. This was further translated into English by an Englishman residing in China who preferred to remain anonymous at the time he despatched the translations in instalments to either Lord Chesterfield or Lord Derby. It was, however, mentioned that the reasons for his anonymity 'will not subsist for long'. The translator seems to have indicated his intention to publish the entire translation of Co-Tsou's whole journey.

A. Mawaz of Dacca had stated in his letter published in the Statesman (20th August 1963) that excavatoins in Egypt and Jerusalem, carried out some hundred and odd years since, revealed that the original manuscript might have been written by a Pharaoh, and that there is every indication in the work to that effect. Prabhakara Sastry has also stated in his preface to the Telugu translation, (Neeti Nidhi) to the 'Economy of Human Life' that there are references, here and there, in the work to 'Arabia' and 'Egypt'. From the foregoing it would seem there is ample scope for research to probe into this matter which calls for an international endeavour.

If possible, it has to be ascertained whether there is any work extant of this type in Sanskrit (or any other langrage for that matter) in the Library of the Dalai Lama inTibet, if the Library did not get ravaged during the Chinese occupation of Tibet. The next endeavour has to be to get at the Chinese version of the 'Economy of Human Life' by Cao-tsou.

The above two investigations should be feasible since India's relations with China have improved to some extent. All the literature available on the authorship of the work from the point of view of the Chinese scholars has to be collected.

Another interesting matter that requires research is the considered view of A. Mawaz that there is every indication throughout the work that most of it was written by Amenhotep IV Pharaoh of Egypt during the years 1360 to 1350 B.c. or thereafter, or by some of his successors in the school of mysticism which he founded in Egypt. Historians and archaeologists of Egypt should be able to throw light on this aspect.

Finally, we come to the authorship of the English translation, namely, 'The Economy of Human Life. It should not be intractable to know whether there is any translation of Cao-Tsou's works or any work of his journey to Tibet as there is every probability of the anonymous Englishman having accomoplished the task he had set for himself.

All this endeavour has to be undertaken by our embassies in the concerned countries. With a scholar and linguist of the eminence of P.V. Naraimharao as the Minister for External Affairs, it should not be difficult for our Cultural Attaches or the Ambassidors in the respective countries to establish contacts with the Governments concerned and the scholars in those countries to unravel the mystrey that sorrounds the "Economy of Human Life". This enterprise will be in accord with our cultural heritage.

Hyderabad -Veturi Anjaneyulu

21-9-1982

నీతినిధి

ప్రథమభాగము

అవతరణిక

మానవులారా! పైనుండి వచ్చు దివ్యబోధములను దలలు వంచి, చెవులొగ్గి, యడఁకువతో నాలకింపుఁడు.

సూర్యప్రకాశమెక్కడ కలదో, వాయుప్రచారమెక్కడ నున్నదో, వినుటకు వీనులును, గ్రహించుటకు బుద్ధియును నెక్కడ పనిచేయునో, అక్కడనెల్ల జీవిత ధర్మములు తెలియఁబడునుగాక! సత్యోపదేశములు సమ్మానింపబఁడునుగాక! ఆచరింపఁబడునుగాక!

సర్వమును నీశ్వరునియొద్ద నుండి వచ్చుచున్నది. ఆయన శక్తి యపరిమితము. ఆయన జ్ఞానము శాశ్వతము. ఆయన వాత్సల్యము సార్వత్రికము.

ఆ సర్వేశ్వరుఁడు జగన్మధ్యమున సామ్రాజ్యాసనాసీనుఁడై యున్నాఁడు. ఆయన యుచ్ఛ్వాసము ప్రపంచమునకుఁ బ్రాణ మిచ్చుచున్నది. ఆయన నఖములు సోఁకినక్షత్రములు ప్రజ్వలించుచున్నవి; ప్రచలించుచున్నవి.

వాయువాహన మెక్కి యాయన యనంతమయిన విశ్వమున వాహ్యాళి వెడలి తన సంకల్పములను సమకూర్చు కొనుచున్నాఁడు.

ఆజ్ఞ, అనుగ్రహము, అందము, ఆయన హస్తమునుండి యవతరించుచున్నవి.

ఆయన కార్యములందెల్ల విజ్ఞానము వెల్లివిరియుచున్నది. కాని మానవబుద్ధి దాని నవగతము చేసికొన లేకున్నది.

స్వప్నమువలె జ్ఞానచ్ఛాయ మానవుని మనసుమీఁద నుండి దాఁటిపోవుచున్నది. దానిని మానవుఁడు చీకటి చూపునఁ జూచుచున్నాఁడు; తర్కించి భ్రమయు చున్నాఁడు.

కాని యా భగవంతుని విజ్ఞానము దేవలోకప్రకాశ మనఁదగినది, ఆయనకు సందేహవితర్కములు లేవు. ఆయన మనస్సు సత్యమున కాటపట్టు.

ధర్మము, దయ, ఆయన యాస్థానమున నదనువేచి యుండును. ఔదార్యప్రేమ

లాయన ముఖవిలాసములు.

కీర్తియం దా ప్రభునకు నీడెవ్వరు? శక్తియం దా సర్వశక్తునకు సాటియేది? జ్ఞానమం దా సర్వజ్ఞునకు సమానమెక్కడ? సౌశీల్యమం దాయనకు సరి కలదా?

నరుఁడా! అట్టివాఁడు సుమా నిన్ను సృష్టించినవాఁడు! ఈ లోకమున నీ యునికిని నిర్ణయించినవాఁ డాయనయే సుమా! ఈ మనశ్శక్తులను నీ కనుగ్రహించినవాఁ డాయనయే సుమా? నీ దేహపు సృష్టివైచిత్ర్యమాయన చేతిపనియే సుమా!

కాఁబట్టి యాయన యాజ్ఞాపనముల నాలకింపుము. అవి యపారకరుణా పూరితములు.

వాని ననువర్తించితివా నీవు నీ యాత్మకు శాంతి సౌఖ్యములను సమకూర్చుకొందువు.

✳

నీతినిధి

ప్రథమాధ్యాయము

మానవునిధర్మములు

1. పర్యాలోచనము

మానవుఁడా! నీలో నీవే చర్చించుకొని యెందుకై సృష్టింపఁబడితివో యెంచి చూచుకొమ్ము. నీ శక్తులనుగూర్చి యోజించుకొనుము. నీ కోరికలను, జేరికలను దలఁచుకొనుము, అట్లేని నీవు జీవితధర్మముల నెఱుఁగఁగలవు. బ్రదుకుఁ దెరువు గనుఁగొనఁగలవు.

నీవు మాటాడు ప్రతిమాటయును నాఁచి యాఁచి, తూఁచి తూఁచి, చూచి, మఱి యాడుము. అట్లే నీవు చేయు ప్రతికార్యమును నరసి యరసి, యంతరముల నూహించి యూహించి, మఱి యాచరింపుము. అట్లు చేసితివా చెడుగు నీ చెంతకు రాదు. అవమానము నీ యింట నడుగు పెట్టదు. పశ్చాత్తాపము నిన్నుఁబరికింపదు. చింత నీ చెక్కిళ్లపైకిఁ జేరదు.

ఆలోచన లేనివాఁడు తన నాలుక నాఁచి యుంచుకొనఁ జాలఁడు. వాఁడు విచ్చలవిడిగా నోరికి వచ్చినట్లు మాటాడును. మాటాడి యాపైఁ దన మాటల యవ్యక్తతలోఁ జిక్కుకొని చీకాకుపడును.

తాను దలపెట్టు కార్యమువలని ఫలము నాలోచింపక తొందరపడి పనికి దూఁకువాఁడు. కంచె కావల నుండు గుంటను గుర్తింపక కంచెమీఁదుగా దుమికి యా గుంటలోఁ గూలువాని వంటివాఁడగును.

కాన, పర్యాలోచనపు టుపదేశములను బాగుగా వినుము. అవి యధికజ్ఞాన పూరితములు. నిన్నవి సురక్షితమును సూనృతమును నగు చోటికిఁ జేర్పఁగలవు.

2. అణఁకువ

నేనే తెలివిగలవాఁడ నని గర్వించుటకు, మనుజా! నీ వెవ్వఁడవు? నీ ప్రవీణతను గూర్చి నీవేల గర్వించెదవోయి?

జ్ఞానవంతుఁడగుటకు మొదటి మెట్టు నాకేమియుఁ దెలియ దనుకొనుటే సుమా! ఇతరు లీతఁడు తెలివిమాలినవాఁడని యనుకొనకుండుటకు, నీవు ముందుగా నేనే జ్ఞానవంతుఁడ నను దుర్గర్వాపరాధమునకుఁ బ్రాయశ్చిత్తము చేసికొనుము.

సుపరిశుభ్రమయిన వస్త్రము సుందరాంగిని శోభింపఁజేయునట్లు సాధు వర్తనము జ్ఞానము నలంకరించును.

వినీతునివాక్కులు సత్యమునకుఁ జక్కఁదన మిచ్చును. మితభాషిత్వమతనిని దప్పిదములనుండి తప్పించును.

అతఁడు తన తెలివినే నమ్ముకొని యుండఁడు. మిత్రుల యుపదేశములను గూడఁ జక్కఁగాఁ జర్చించి కైకొని తత్ఫలితములను బడయుచుండును.

తన పొగడ్త నాతఁడు వినఁడు; నమ్మడు; తన విజ్ఞతను గనిపట్టుట కాతఁడు కడపటివాఁడు.

మేలిముసుఁగున సౌందర్యము సమధిక మయినట్లు, వినయాచ్ఛాదితములై యాతని గుణములు శోభించును.

కాని, గర్విష్ఠుఁడగు వానిఁ గనుఁగొనుము. వాని పొగరుఁబోతుదనమును బరికింపుము. వాఁడు పటాటోపము గలిగి వీథులందు వెడలును, నలుదెసలు కలయఁజూచును. నలువురుఁ దన్నుఁ జూతురుగాక యని కుతూహలపడును.

గర్వభరితుఁడై తల నెగురవేయుచు బీదలను బ్రేమింపక పయిచూపునఁ జూచును. అతఁడు తన కంటెఁ దక్కువ వాని ననాదరమున నారయును. దీనికిఁ దగినట్టు లాతనికంటె నెక్కువవా రాతని గర్వమును దప్పిదమును, నీచముగాఁ జూతురు. అపహసింతురు.

అతఁ డితరుల సిద్ధాంతములను దృణీకరించును. తన తలఁపులనే నమ్మి కలఁకఁబడును.

దంభములఁదలఁచుకొనుచు నాతఁడు పొంగిపోవుచుండును. తన్నుఁ దాను బొగడుకొనుటలో, నితరులచేఁ బొగడించుకొనుటలోఁ బ్రొద్దుపుచ్చుట కాతఁ

డిచ్ఛగించును. పరుఁడుచేయు ముఖస్తుతి నాతఁడు పరమాదరమునఁ గబళించును. దీనికిఁ బ్రతిగా ముఖస్తుతి చేయువాఁడు వానినే కబళించును.

3. పూనిక

కడచినదినములు గడచినవే కావునను, రానున్న దినములు నీకు రాక పోవచ్చును గావునను, మానవుఁడా! నీవు కడచినదానికై కళవళపడక రానున్న దానికై యంతగా నాశపడక, ప్రస్తుతమును గూర్చియే ప్రయత్నింపఁ దగుదువు.

ఈ క్షణమే నీది. ఉత్తరక్షణము భవిష్యత్కాలగర్భమందున్నది. అది యెట్లగునో నీ కేమియెఱుక?

నీవేదేని చేయ నిశ్చయించుకొంటివా; దానిని శీఘ్రముగాఁజేయుము. తొలిపూటనే ముగియఁ దగినపనిని మలుపూటకు నిలువయుంచకుము.

సోమరితనము, బీదఱికమును, బాధను, బుట్టించును. సత్కార్యపరిశ్రమము సంతోషము నిచ్చును.

శ్రద్ధాబలము కొండఁతల నోడఁగట్టును. పరిశ్రమించు వాని పార్శ్వమున భాగ్యమును, జయమును, నుండును.

ధనము నార్జించువాఁడు, అర్హుఁడై యధికపదముల నందువాఁడు, గౌరవమును గడించువాఁడు, పట్టణమునఁ బ్రఖ్యాతిఁ బడయువాఁడు, నెవ్వఁడనుకొనెదవు? సోమరితనమను శత్రువును దొలఁగఁద్రోచినవాఁడే సుమా! అతఁడు వేకువనే మేలుకొనును. ప్రొద్దుపుచ్చి నిద్దుర పోవును.

ఆలోచనచే బుద్ధికిని, పనిపాటులచే దేహమునకును, బరిశ్రమము కల్పించి యతఁడు తన యారోగ్యమును సంరక్షించుకొనును.

సోమరి, తనకుఁదానే భారముగానుండును. ఆతనికి జీవిత మొక బరువై తలపైఁ దగిలియుండును. ఆతఁడు తాను జేయవలసిన పని నెఱుఁగక యటు నిటుఁదిరుగులాడును. ఆతని దినములు మేఘచ్ఛాయవలె దాఁటిపోవు చుండును. ఆతఁడు తన జ్ఞాపకచిహ్నముగా దేనిని వెనుక నుంచుకొనకయే వెడలిపోవును.

వ్యాయామము లేక యాతని దేహము వ్యాధిగ్రస్తమగును. ఆతఁడు పరిశ్రమింపఁ గోరును గాని బలము లేమిచేఁ గదలఁ జాలఁడు. ఆతని మనస్సంధకారమం దుండును. తలఁపులు కలగపులగములుగా నుండును. జ్ఞానము కలుగఁ గోరును గాని, మనసునకుఁ బని చెప్పఁజాలఁడు.

బాదముపప్పు నాతఁడు తినఁగోరును గాని దానిపెంకును బగులఁగొట్టుటకుఁ బ్రాలుమాలును.

ఆతని యిల్లు చీకిరిబాకిరిగా నుండును. సేవకులు పనిలేక పొగరుమీఱి యుందురు. వినాశాభిముఖుఁడై యాతఁడు పరుగిడుచుండును. అది యాతఁడు కనును, వినును, తగదన తలఁచును, కాని, పూనికయుండదు.

సుడిగాలివలె వినాశము తన్నుఁ జుట్టుకొనుదాఁక, పశ్చాత్తాపము, లజ్జ తనతో శ్మశానమునకు సాగుదాఁక నట్లే యాతఁడుండును.

4. సద్గుణలిప్స

నీ యాత్మకు శ్రేయస్తృష్ణ కలదేని నీ వీనులు సమ్మానస్వరము వినఁగోరునేని, నీవు పుట్టిన మట్టినుండి పైకిలెమ్ము; నీ యుద్దేశముల నున్నత స్థానమున కుద్ధరించుము.

ఇప్పుడాకాశచుంబియై యావరించియున్న వృక్ష మొకప్పుడు విత్తుగా నేలలో నడఁగి యున్నదే సుమా!

నీ కృత్య మేది కలదో దాన నీవే మొదటివాఁడవుగా నుండుటకు యత్నింపుము. సరిగాఁ జక్కఁగాఁ బనిచేయుటలో వేఱొకని మించనీయకుము. కాని, వాని గుణవిశేషములను జూచి యసూయపడకుమా! ఉసూరు మనకుమా! నీ గుణములను బెంపొందించుకొందువుగాక!

గుణములచే నిన్నతిశయించువానిని, అన్యాయ్యము, ననుచితము నగు విధములచే నణఁగఁ ద్రొక్కఁజూడుకుము. ఆతనికంటె గుణాతిశయము గలవాఁడగుటకు యత్నింపుము. అట్లేని జయముచేఁ గాకున్నను నుత్తమతచే నయిన నలంకృతుఁడ వగుదువు.

సన్మార్గమున నితరుల నతిశయింపఁ జూచువాని యాత్మశక్తి తనలోనే పెంపొందును. ఆతఁడు విజయము నాశించి పరుగుపందెము సఱచిన వాఁడు సంతోషముతోఁ బరుగువాఱునట్టు లుత్సాహముతోఁ గృత్యము సాగించును.

అట్టివాఁడడ్డంకు లున్నను దాటిప్రమానువలె నెదిగిపోవును. ఆతఁడు పైకెగిరి యన్నింటికి మీఁద గరుత్మంతుఁ డాకసమునఁ దిరుగువాఱునట్లుండి సూర్య కాంతికయి తన కన్నులు నిలుపును.

మహాపురుషుల పోలికల నాతఁడు రాత్రులందుఁ గలవరించుచుండును, పగళ్లం దట్లు ప్రవర్తింపఁ జూచుచుండును.

ఆతఁడు గొప్ప పన్నుగడలఁ బన్నును, వానిని నెఱవేర్చుటకుఁ బరితోషముతోఁ బ్రయత్నించును. ఆతని పేరు ప్రపంచ మున్నంత దాఁక వ్యాపించును.

ఈర్ష్యాళుని హృదయము కఱకువారి చేఁదుగ్రక్కుచుండును. వాని నాలుక విషము నుమియుచుండును. ప్రక్కవాని ప్రాభవ మాతని స్వాస్థ్యమును జెఱుచును.

అట్టివాఁడు క్రుళ్లుచుఁ గుములుచుఁ దన యింటనే కూర్చుండి కంటఁ దడిపెట్టు చుండును. పరునిమంచి, యాతనిచెఱుపు. ద్వేషము, క్రౌర్యము, నాతని హృద యమును జెఱుచును. ఆతనికి విశ్రాంతిలేదు.

ఆతనికి మంచితనమునపైఁ బ్రేమలేదు; కాన, తన పొరుగు వాఁడును దనవంటి వాఁడే యని తలఁచును.

తన్ను మించినవారి నాతఁడు కుంచించుటకుఁ జింతించును. వారిచేఁతల కన్నిటికిఁ జెడ్డయర్థములు కల్పించును.

వాఁడు తుంటరితనము చూపుటకు మెలఁకువ గలిగియుండును.

ఇతరుల కాతనిపై రోఁత జనించును. సాలీఁడు తన యల్లికచేతనే చంపఁ బడున ట్లాతఁడు తన కుతంత్రముల చేతనే కూల్పఁబడును.

5. దూరాలోచన

దూరాలోచనము కావింపుము. దాని యుపదేశముల నాలకించి హృదయమున నెలకొల్పుకొమ్ము. ఆ యుపదేశములు సర్వసముచితములు. సద్గుణములకవి సాధనములు. మానవజీవితమునకవి మార్గదర్శకములే కాక నియామకములును.

నీ నాలుకకుఁ గళ్లెము కట్టియుంచుము. నీ పెఁదవులకు ముందు రక్ష యుంచుము. అట్లు చేయుదువేని నీ నోటిమాటలు నీ శాంతికి భంగకారులు కాకుండును.

కుంటివానిఁ జూచి వెక్కిరించువాఁడు తా నాఁగక నడచువాఁడుగ నుండఁదగును. ఇతరుల తప్పును దాను వెదకునప్పుడు తన తప్పిదము నితరులు వెదకుటను గూడఁ జూడవలసివచ్చును.

వదరుఁబోతుతనము పశ్చాత్తాపమునకు హేతువగును. మౌనము సర్వార్థసాధకము.

వదరుఁబోతు సంఘమునకు వ్యథ కల్గించును. అతని యతిప్రలాప మితరుల చెవులకుఁ బీడకల్గించును. అతని వదరులవెల్లువ యెదిరి వాని సల్లాపమును ముంచివేయును.

నిన్ను నీవే పొగడుకొనకుము. అది యెదిరివానికి నీపై రోఁత కల్గించును. ఇతరునిఁ దూలనాడకుము. అది నీ కపాయకరము.

ముదుకపరిహాసము మైత్రికి విషము. నాలుక నాఁచుకోలేని వానికిఁ గీడు మూడును.

నీ స్థితికిఁదగిన పరికరములను గూర్చుకొనుము. ఎంత వ్యయింపఁ గలవో అంతను వ్యయింపకుము. బాల్యమున నీవు ముందు జాగ్రత్తకై చేసిన సేకరము వార్ధకమున నీకు సుఖ మీయఁగలదు.

లోభము చెడ్డపనులకు మూలము. మితవ్యయము సద్గుణములకు సంరక్షకము.

నీ పనికొఱకే నీ శ్రద్ధను వినియోగించుము. రాష్ట్రరక్షకు రాజులు గలరు లెమ్ము.

నీ యాటపాట లధికవ్యయములను గూర్చునవిగా నుండరాదు. వానిని బడయుటకై నీవు పడు క్లేశము, తర్వాత వానివలనఁ గలుగు సౌఖ్యము కంటె మీఱిపోరాదు.

సంపదలపెంపు నీ వెనుకముందు చూపును జెఱుపకుండను, కోరికల పెల్లు నీ మితవ్యయమును మ్రింగి వేయకుండను జూచుకొనుము.

ఆవశ్యకములుగాని సుఖవిశేషములను హద్దులేకుండ ననుభవించు చుండువాఁడు కొంతకాలమునకు జీవితావశ్యకములయిన స్థితిగతులు కూడ లేక చీకాకు పడవలసిన వాఁడగును.

ఇతరుల యనుభవములను జూచి నీవు జ్ఞానవంతుఁడవగుము. వారి భంగపాటులను గుర్తించి నీవు భంగములనుండి తప్పించుకొనుము.

పరీక్షించి చూచిగాని పరుని నమ్మకుము. కాని, కారణము లేకయే యపనమ్మకము చెందకుము. అది మిక్కిలి యధర్మము.

నీ వొకని న్యాయవర్తనుఁడని గుర్తించితివేని వానిని నీ హృదయమున ధనభండారమువలె దాఁచియుంచుకొనుము, అమూల్యమయిన యాభరణముగా వాని భావింపుము.

ధనముఁగొని పనిచేయువాని యుపకారాభిమానములపై నొల్లఁబాటు చెందుము. వాఁడు నీకు వలవంటివాఁడు. వాని పన్నుగడనుండి నీవు తప్పించుకొనఁజాలవు.

ఱేపటికి వలయుదానిని, నేఁడే వెచ్చపెట్టకుము. ముందు మెలఁకువపడి సంపాదింపఁ దగిన దానిని, జాగ్రత్తచే నాపఁదగిన దానిని, జెడఁగొట్టుకొనకుము.

అయినను ముందు మెలఁకువ దాల్చుటవలన నమోఘమైన జయము చేకూఱునని విశ్వసింపఁజనదు. ఏలయన రాత్రి కొనితెచ్చు సంగతులను బగలెఱుఁగదు.

తెలివిమాలినవాఁడెప్పుడును భగ్నాశుఁడుగా నుండఁడు. తెలివిగలవాఁ డెప్పుడును కృతార్థుఁడును గాఁజాలఁడు. కాని, తెలివిమాలినవాఁడెన్నఁడునుఁ బూర్తిగా సుఖమనుభవింపఁజాలఁడు. తెలివికలవాఁడును బూర్తిగా దుఃఖ మనుభవింపఁజాలఁడు.

6. స్థైర్యము

అపాయములు, దురదృష్టములు, లేబరములు, విచారములు, సంకటములు కొంచె మించుమించుగా మహిమీఁదఁ బుట్టిన మానవమాత్రులకెల్ల సామాన్యములు.

కాఁబట్టి, యోయి విపన్మయుఁడా! నీ వంతు వచ్చెడు చెడుగులకుఁ దాళి యుండుటకు నీ మనస్సును ఓర్పుతోను ధైర్యముతోను బలపఱుచుకొనుము. ఇది నీవు చేయవలసినపని.

ఒంటె కష్టమును, వేఁడిమిని, ఆకలిని, దాహమును, ఓర్చుకొని యిసుకయెడా రులందెట్లు బరువును మోసికొనిపోయి దరిఁజేర్చునో, అట్లే, స్థైర్యము సకల కష్టములను సహించి మానవుని గట్టెక్కించును.

ఉన్నతాత్ముఁడు దుర్దైవమునకు దుఃఖింపఁడు. ఆతని యాత్మౌన్నత్య మణఁగఁ ద్రొక్కఁబడునది కాదు. ఆతఁడు విధివిలాసముల ప్రకారము సుఖమును జూచుకొనడు. అట్లే విధివికారముల ప్రకారము విహ్వలతను జెందఁడు.

సముద్రపుదరి నుండు కొండగుట్టవలె నాతఁడు, చెదరక బెదరక నిలఁ బడును. అలల దెబ్బలాతనిఁ గలవరపఱుపఁజాలవు.

ఆతఁడు కొండకొప్పువలెఁ దన తలనెత్తికొని యుండును. విధి దుర్విధానము లాతని పాదములకడఁబడును. అపాయ సమయములందాతని స్థైర్యమే యాతనిఁ గాపాడును.

జీవితక్లేశముల నాతఁడు యుద్ధవీరునివలె నెదుర్కొనును. వానినిఁ దొలఁగఁ ద్రొక్కిన జయముఁ జేకొన వచ్చును.

పయిఁబడుచున్న కష్టముల యొత్తిడికి, అడుగున నాతని యోర్మి మెత్తవలె

నుండి దుస్సహతను దొలఁగించును. ఆతని నిశ్చలత యన్నింటిని సహింపఁ గలదు.

పిఱికివాఁడు పిఱికితనముచే నవమానితుఁడగును. బీదఱికమునకుఁ గ్రుంగియుండువాఁడు నీచకృత్యములఁ జొరఁబడును. ఆతఁడు తిట్లకు మొట్లకుఁ బరిచితుఁడగుటచేత నపాయముల నాహ్వానించుకొనువాఁడగును.

గాలితాఁకున ఱెల్లు గడగడలాడునట్లు కీడుసోఁకున వాఁడు గిజగిజలాడును.

కష్టముల కాతఁడు కటకటంపడును; దుఃఖములకుఁ దూలి పోవును; ప్రత్యాశలేక పడిపోవును.

7. సంతుష్టి

నరుఁడా! భూమిపయి నీ యునికి, నీ హృదయము నెఱిఁగి, నీ కోరికల తీరు నెఱిఁగి, దయచేతనే నీ వాంఛితముల నపుడపుడు నిరాకరించుచుండు నా యఖిలనియంతచేతనే యనుగ్రహింపఁ బడినదని మఱువకుము.

అయినను సముచితములయిన వాంఛితములకును, న్యాయములయిన ప్రయత్నములకును, ఫలప్రాప్తి సహజముగానే సంభావ్యమగునట్లాయన దయాళుత్వము దయివాఱుచున్నది!

నీకుఁ గలిగెడి కష్టములు, దుఃఖములు, నెందుండి యేర్పడుచున్నవో యెఱుఁ గుదువా? నీ తప్పిదములనుండియే; నీ గర్వమున నుండియే; నీ కలఁత పాటుననుండియే!

కాఁబట్టి విధివిధానమును గూర్చి వెగటుచెందక నీ హృదయమునే నిలువ రించుకొని సరిచేసికొనుము. నాకు భాగ్యముండెనేని, అధికారముండెనేని, అవకాశముండెనేని, అధికసుఖముల ననుభవింపఁగల్గుదునుగదా యని తలంపకుము. అవి యన్నియు వానికిఁ దగిన సంకటములను గొని తేఁగలవు. ఇది యెఱుఁగుము.

బీదవాఁడు భాగ్యవంతుని విసుఁగులను, విచారములను నెఱుఁగఁడు; అధికారమువలని యవస్థల నారయఁడు; విశ్రాంతివలని వెగడుపాటును విచారింపఁడు; తన కష్టమునే తలంచుకొని వనరును.

పైకి సంతోషిగాఁ గన్పడువానిఁజూచి, నా కా సంతోషము లేకపోయెఁ గదా యని విచారింపకుము. వానిలోని దుఃఖములు నీవే మెఱుఁగుదువు?

కొంచెముతోఁదృప్తిచెందుటే గొప్పజ్ఞానము. భాగ్యమును బెంపొందించు కొనువాఁడు బాధలనుగూడ బెంపొందించుకొనువాఁడగును. మనస్తృప్తి దాఁచిన ముల్లె. కష్టము దానిని గనుఁగొనలేదు.

న్యాయమును, మితభోగమును, దానమును, వినయమును, చెఱుపకుండు నట్లు నీవు చేయఁగల్గుదువేని సంపద నీకు సంకటములను గూర్పఁజాలదు.

ఓయీ! అకలుషమయిన యానందామృతము, మనుష్యమాత్రునకు దొరకదని యెఱుఁగుము.

భగవంతుఁడు సౌశీల్యమను పరుగుపందెమును మానవులకుఁబెట్టినాఁడు. శాశ్వతానందమను సౌధము దాని గమ్యస్థానము. ఆ సౌశీల్యపుఁబరుగులో నెగ్గినఁగాని దానినిఁ బడయరాదు.

8. మితభోగము

ఆరోగ్యమనఁగానేమో, స్వర్గప్రాప్తియనగా నెట్టిదో తెలిసికొనుశక్తి గలవాఁడవై యుందువేని యిహలోకమున నీవు సౌఖ్యముచేరువకుఁ జేరఁగల్గుదువు.

భోజనముకొఱకు మధుమాంస భరితములయిన మాదక పదార్థములను ముందుంచి వాంఛపిశాచి నిన్నారగింపుమని యెన్నఁడు కన్నుగొలుపునో యదియే సుమా నీ కనర్థకాలము. అట్టివేళ నీవు నీ వివేకమును గట్టిగాఁ గాపాడుకొనవలయును. వివేకదూరములయిన తలఁపుల వలపునఁ బడితివేని నీవు చెడితివే!

అవివేకము నీ కగపఱుచు వినోదములు నిన్ను వెఱ్ఱివానిఁగాఁ జేయఁగలవు. మఱియు నవివేకపుభోగము నిన్ననారోగ్యమునకుఁ, గడకు మృత్యువునకుఁ దార్పఁగలదు.

మధుమాంసమయములై దుర్వాంఛలను గొలుపు భోజనభాజనముల వంక కొంకతూరి తిరిగిచూడుము. అక్కడ బంతిగుడుచువారిని బరికింపుము; అక్కడి

యెక్కోలుపులఁ జిక్కులుపడువారి నారయము. వారందఱును జిక్కి చీఁకుతో నుత్సాహములేక యుసూరుమనుచుండ లేదా?

అట్టివారికి సుఖానుభవ కోలాహల మల్పకాలమునకే యస్తమించును. అగచాట్ల కాలమంతలోనే యారంభించును.

అతిభోగము వారి యాఁకలిదప్పులను దప్పుఁద్రోవకుఁ ద్రిప్పి తగ్గించి వైచినది. అది వారికిఁ దొలుత నలవఱిచిన రుచ్యపదార్థము లిప్పుడు నీరసములయినవి. తొలుత వానిని బ్రియముతో నాహారించినవారిప్పుడు వానికే బలియైరి.

అది యసంగతము గాదు. దైవదత్తములగు శక్తులను దుర్వినియోగము చేయువారికొఱ కా దైవమే విధించిన శిక్ష యది.

అంచ నడలతో సంచరించుచున్న యా యించుఁబోఁడి యెవ్వరు?

చెక్కిళ్లపై గులాబిపూవన్నె చెలఁగఁగాఁ, బెదవులందు నుదయరాగ ముప్ప తిల్లఁగాఁ, గన్నులం దణఁకువ యానందము వెలయఁగా నాడుచుఁబాడుచు నరుగుచున్నది?

అమె యారోగ్యాధిదేవత. మితభోగమునకుఁబరిశ్రాంతికి నామె జనించినది. ఆమె సోదరులు ధైర్యము, చుఱుకుదనము గలిగి యక్కకుఁ దగిన యనుజులై యున్నారు.

వారి నరములను జుఱుకుదనము చుట్టువాఱియున్నది. వారి యెముకలందు బలము నెలకొనియున్నది. పగలెల్లవారు పరితోషముతోఁ బరిశ్రమింతురు.

తల్లిదండ్రులు విధించు పనిపాటలు వారి కాఁకలిదప్పులను గలిగించుచున్నవి. అలసట తీరుటకుఁ దగిన యాహారమును వారి యమ్మవారి కిచ్చుచున్నది. కామక్రోధాదులను గండడఁగించుట వారికిఁ గోరిక.

వారి సుఖానుభవములు పరిమితములు. కాఁబట్టి యవి యాటివచ్చును. వారికి విశ్రాంతియు నిద్రయుఁ గొంచెమే కాని యది కలఁకలేక గాఢమై యుండును.

వారి రక్తము నిర్మలమైనది. వారి మనసులు స్వచ్ఛమయినవి. వైద్యులు వారి యిండ్లకు దారియే యెఱుఁగరు.

కాని, కాపురుషులవిషయము వినుము. వారి చెంతకు క్షేమము చేరరాదు. వారి యిండ్లును సురక్షితములుగావు.

ద్రోహగుణమొకఁడు లోపలనుండి గుట్టును బట్టియిచ్చుటచే వారు బయట నుండి వచ్చు బహువిధాపాయములకుఁ బాలగుచుందురు.

వారి యారోగ్యము, బలము, అందము, చాకచక్యము, కామాతురయైన మోహదేవత హృదయమును గలవరపఱచినవి. ఆమె పొదరింటిచాటున నిలఁబడి తన వలపు చూపులచే వారి యనుగ్రహమును వాంఛించుచున్నది. వారిపైఁదన రాగవికారములను విరఁజల్లుచున్నది.

సుకుమారములయిన యవయవములును, సుందరమైన వేషమును గలిగి యామె యితరులను బిలుచుచున్నట్లుండును. ఆమె కన్నులందు స్వేచ్ఛ ఆమె యెదపై రాగవికారముం గుదురుకొనియున్నది. వ్రేళ్లతో సన్నచేయుచున్నట్లును, కన్నులతోఁ బెండ్లియాడుమని వేడుచున్నట్లును నాలుకతో మోసగించుచున్నట్లును నామె యున్నది.

ఆమె వలపుపిలుపులకుఁ గలఁకపడకుము. తీయపలుకులకుఁ జెవు లీయకుము. ఆమె తన చేతుల నీ మీఁదికిఁ జేర్చినదా యినుపగొలుసులచేఁ గలకాలము నిన్నుఁ గట్టివైచినదే. అవమానము, రోగము, కోపము, లోపము, విచారము, పశ్చాత్తాపము నిన్ను వెంబడించును.

సరసములచే సన్నగిల్లి, యమితభోగములచే నాముకలిసి, పాలుమాలికచేఁ బలుచఁబడి, బలము నీ యంగములనుండి పాఱిపోవును. ఆరోగ్యము నీ దేహము దరికిఁ జేరరాదు. భావిజీవితము నీకుఁ దక్కువై చిక్కులతో నుండును.

నీతినిధి

ద్వితీయాధ్యాయము

మనోవికారములు

1. ప్రత్యాశ–నిరాశ

ప్రత్యాశ కన్పఱచు భావిలాభములు అరవిరిమల్లెలవలె నంతలో ననుభవమునకు వచ్చునట్లుండును. నిరాశ తోఁపించు నాపదలు హృదయము నదరఁగొట్టునవియై యుండును.

అయినను నీవు కర్తవ్యముఁ గావించుపట్టునఁ బ్రత్యాశకుఁ బాల్పడి బడల్పడకయు నిరాశకుఁబాల్పడి నివ్వెఱఁగందకయు వర్తిల్లవలెను.

అన్ని సందర్భములందు నీ రెండు దోషములకుఁ బాల్పడక సమచిత్తుఁడవై కార్యసన్నాహము గావింపఁదగుదువు.

సత్పురుషుఁడు చావునకుఁగూడ జంకఁడు. తప్పులేనివాఁడు దేనికి భయపడఁ బనిలేదు.

నీవు సంకల్పించుకార్యములు కొనసాగుటనుగూర్చి తగినంత వఱకు ధైర్యము గల్గియుండుము. కడతేఱుట కష్టసాధ్యమని జంకితివా యపజయ మందితివే.

నీ చిత్తమును రిత్తభయములచేఁ దత్తఱిల్లనీయకుము. మూఢవిశ్వాసములచే బ్రుంగుడు వడనీయకుము.

భయమునుండి కార్యభంగము కలుగుచున్నది. కాఁగలదను ధైర్యముతోఁ గార్యమును నెఱవేర్చుకోవచ్చును.

నిప్పుకోడి భయముచేఁ బరుగెత్తి పరుగెత్తి తలనుమాత్ర మిసుకలో దాఁచుకొని మయిమాటమఱచి యపాయమున కగ్గమగును. పిఱికివాఁడు గూడనట్లే పిఱికిపనులచే నపాయముల కగ్గమగుచుండును.

నీవు దేనిఁగూడ దుస్సాధ్య మనుకొనకుము. అట్లనుకొంటివా యా నిరాశయే దాని నట్టిదానిఁగాఁ జేయును.

పట్టుదలతోఁ బ్రయత్నించువాఁడు కష్టములఁగడచి గట్టెక్కఁగలఁడు.

మూఢవిశ్వాసము లవివేకిహృదయము నవకతవకలకుఁబాల్పఱచును. వానిని వివేకి విగర్హించును.

నీ సంకల్పములందు ముందు వివేకమును వెలయింపుము. ఆ సంకల్పములు ప్రాయికముగా నెఱవేఱఁగలవని యనుకొనఁదగినవై యుండవలెను. అట్లున్ననే నీ ప్రారంభములకు మంచి ఫలితమేర్పడును. నీ హృదయముగూడ నాశాభంగములపాలయి యాయాసితము కాకుండును.

2. సంతోషము–దుఃఖము

నీ హృదయమును బరవశముగాఁ జేయునంత పరితోషమునకును, గుంగించి కుములఁజేయునంత పరితాపమునకును బాల్పడనీయకుము.

అత్యుత్కృష్టమైన యానందము గాని, యతినికృష్టమైన దుఃఖము గాని యీ లోకమునఁ జేకూరదు.

అదిగో! అక్కడ సంతోషకాంత యిల్లున్నది. అది వెలుపలకుఁ గలకలలాడుచుఁ గానవచ్చుచున్నది. ఎడతెగక యక్కడనుండి వినవచ్చుచున్న సంతోషసంభ్రమములయు, విజయోత్సాహములయుఁ, గలకలములచే దానిని దెలిసికొనఁ గలుగుదువు.

ఆ గృహదేవత గుమ్మముముందు నిలఁబడి దారిఁబోవువారినిఁ జేరఁ బిలుచును; నిరంతరముగా నాడును; పాడును; అఱచును; హసించును.జీవిత సౌఖ్యము రుచిచూచుటకు లోనికి రండని యామె వారిని బిలుచును. ఈ సుఖము తన యింటఁదక్క మఱియెక్కడను జిక్కదని యామె చెప్పును.

కాని, నీ వామె గృహద్వారముఁజేరకుము. అక్కడికిఁ దరచుగ రాకపోకలు చేయువారితోనైనఁ జేరకుము.

వారు తాము సంతోషమున జనించితిమని చెప్పుకొందురు; నవ్వుచు సంతోషముతో నున్నట్టు కాన్పింతురు; కాని, వారి చేఁతలందు వెంగలితనమును, దప్పిదమును విస్తరించియున్నవి.

వారు చెట్టతనముతోఁ జెయిచెయిఁ గలపికొని యుందురు. వారి యడుగులు చెడుగునకుఁ ద్రోవచూపును. సర్వవిధముల వారి కపాయము సంభవించును. వినాశగర్తము వారియడుగులక్రింద వివృతద్వారమై యున్నది.

అటు చూడుము! చెట్లనీడచేఁ జీకటిగొనియున్న యా లోయ యందుఁ గనులకుఁ గనుపడకుండ సంతాపకాంత యిల్లున్నది.

ఆమె హృదయము నిట్టూర్పులచేఁ దటతటలాడుచుండును. ఆమె మొగము దుఃఖములో మునిఁగి యుండును. మానవ దుర్దశలనుగూర్చి యామె యెడతెగక వగచుచుండును. మానవుల కోపము, కొంటెతనము, నామె పెదవులపైఁ గుదురుకొనియుండును.

జగమెల్లఁ జెడుగుతో నిండియుండునని యామె తలంపు. ఆమె చూచు వస్తువులందెల్ల వ్యాకులత చిహ్నితమై యుండును.

సొదలు చెప్పుకొనువారి రొదలచే నామె యిల్లు గొల్లుమనుచుండును.

ఆమె ఇంటిదగ్గఱ కేఁగకుము. ఆమె యూపిరిగాలి యంటువ్యాధి వంటిది. అది జీవితోద్యానమందలి పువ్వుఁదీగలను వాడఁగొట్టును. ఫలవృక్షములను బాడుచేయును.

సంతోషకాంత యిల్లు వదలివచ్చు నీ వీ సంతాపకాంత యింటిచాయలకుఁ జనెద వేమో సుమా! పయి రెండింటికి నడుమ నొక నడబాట యున్నది. అది శాంతికాంతానిలయమైన పొదరింటికి నిన్నుఁ గొంపోగలదు. నీ వా బాటను బట్టుము.

క్షేమము, సంతృప్తి, యా శాంతికాంతచెంత నున్నవి. ఆమె సంతోషశాలినియే; కాని, యట్టహాసము లామెదగ్గఱ నుండవు.

జీవితమందలి సుఖదుఃఖముల నామె సమదృష్టితోఁజూచును.

ఉల్లాసకల్లోలములలో నూఁగుచుఁగొందఱును, జింతాచితాగ్నిలో సంతప్తులగుచుఁ గొందఱును గాలము గడపుచుందురు. నీ వక్కడి కరిగెదవేని యున్నత స్థలముననుండి చూచినట్లు వారి తప్పిదములను దుఃఖములను జూడఁగలవు.

3. కోపము

చెడరేఁగి చెట్లను జిందఱవందఱచేయు సుడిగాలివలెను, చుట్టుముట్టి పట్టణములఁబాడుపఱుచు భూకంపమువలెను, మానవునికోపము తన చుట్టుపట్టులఁ జెట్టఱికముచేఁ జెఱిచివైచును.

ఆలోచించుకొని నీ మనోదౌర్బల్యముల నీవు స్మృతియందుంచుకొనుము. అట్లేని నీ వితరుల తప్పిదముల మన్నింపఁ గల్గుదువు.

కోపోద్రేకమున మునిఁగియుండకుము. ఆ మునిగియుండుట యెట్టి దనఁగా, నీ ఱొమ్మునే పొడుచుకొనుటకుఁ గాని, లేక, నీ చనవరిని జంపుటకుఁ గాని కత్తిని బదనుపెట్టుట వంటిది. కొలఁది కోపకారణము లందు మెలఁ కువతో నీ వోర్మి చూపఁగలిగి యుండుము. అట్లు చూపఁగల్గుట నీ వివేకమునకు ఫలము. ఆ కోపకారణములను జ్ఞాపకముననే లేకుండఁ జేసికొనఁ గల్గుదువేని నీ యంతరాత్మ నిన్ను నవగణింపఁజాలదు.

కోపి వివేకమును గోల్పోవుట చూడవా? వివేకమునందున్నపుడె యితరుని కోపమును దార్కాణగఁ జూచుకొనుచుండుము.

ఉద్రేకము కల్గినపుడు నీ వే పనియుఁ జేయక యూరకుండుము. తుఫాను కొట్టుచున్నపుడు సముద్రప్రయాణ మేల చేసెదవు?

అణఁచుకోఁజాలనంత కోపమున కవకాశ మియ్యకుము. అట్టి కోపమును గల్గించు విషయములను విడనాడుము. లేక జాగరూకతతో నుండుము.

అప్రౌఢుఁ డవహేళనముల కాగ్రహించును. ప్రాజ్ఞుఁడు నవ్వుచు వానిని దృణీకరించును. ప్రత్యపకారబుద్ధిని నీ హృదయమునఁ బ్రవేశింపనీయకుము. అది హృదయమును జిదిపివైచును. నొవ్వనాడుట మానుము. మన్నింపఁ జూడుము. ప్రత్యపకారముకై ప్రతీక్షించువాఁడు తనకే యపకారము కల్పించు కొనువాఁడగును.

కుపితుని కోపపువేఁడిని శాంతుని మెల్లఁబలుకులు చల్లనార్చివైచును. శత్రు వప్పుడు మిత్రుఁడగును.

కోపార్హ విషయములు కొలఁదిగనేయుండుట నెఱుఁగుము. అది యెఱిఁ గితివేని తెలివిమాలినవాఁడు తక్క నితరుఁడు కోపింపఁ నీ వెఱుఁగ గల్గుదువు.

కోపము తప్పిదమువలననో అజ్ఞానమువలననో యుప్పతిల్లును. పశ్చాత్తాపమునఁ గాక యది పరిసమాప్తము కాదు. ఇది యెఱిఁగియుండుము. తప్పిదము మడమల మీఁదఁ ద్రొక్కుచుఁ గోపము వెన్నంటి పశ్చాత్తాపము నిలిచి యుండును.

4. కనికరము

వసంతఋతువు భూమిపైఁ బుష్పములను జల్లినట్లు కరుణావిలాసము బీదలపై దీవనలఁ జల్లును. ఒకనిఁ గనికరించువాఁడు తానొకని కనికరమునకుఁ బాత్రము కాఁగల్గును. కనికరము లేనివాఁడు కనికరింపఁబడఁదగఁడు. కటికవాఁడు మేఁకయఱపులు విని కనికరించునా. కష్టములందుఁ గూడఁ గ్రూరాత్ముని మనసు కరగదు. కరుణాళుని కన్నీటిబిందులు గొజ్జఁగిపూవునుండి తొరుగు మంచుతుంపురుల కంటె మధురములు.

బీదలమొఱలు వినరాకుండఁ జెవులు మూసికొనకుము. బీదసాదుల కష్టములఁ జూచుపట్టున నీ హృదయము ఱాయి చేసికొనకుము.

తలిదండ్రులు లేక భర్తలు లేక బాములుపడువారు, బాలురు, విధవలు, మఱియు వృద్ధులు కన్నీరునించుచు నీ సహాయము కోరినపుడు చేదోడయి కూడినంత తోడుపాటొసఁగుము.

కట్టగుడ్డలేక, నిలువ నీడలేక, యెండకుఁ గ్రాఁగుచుఁ, జలికి వణఁకుచు బాటలందుఁ దిరుగు బికారులఁ జూచినప్పుడు దాతృత్వముచే నీ హృదయము విప్పుము. అది నీ కాత్మోన్నత్యముగూడఁ జుమా! అట్టివారి నీ ధర్మపక్షముల క్రిందఁ జేర్చుకొని కాపాడుము.

బీదవాఁడు వ్యాధితుఁడై పడుకమీఁదఁ బడి బాధపడుచున్నప్పుడు, దుర్ దైవోపహతులు కారాగారములఁబడి కష్టపడుచున్నప్పుడు, తల నరసిన మూఁడుకాళ్ల ముదుసళ్లు గుంటలఁ బడిన కనులతో నిన్ను వేఁడుచున్నప్పుడు

వారికిఁ దోడ్పడక వ్యర్థమైన సుఖకోలాహలమున నీవెట్టు కొట్టుకాడఁగలవు?

5. కోరిక, ప్రేమ

చిన్నవాఁడా! విలాసముల వేడుకలందు జాగరూకుఁడవై యుండుము. ఆ వేడుక వెల వెలఁదివంటిది సుమా! వెఱ్ఱి యాశ తన ప్రయత్నములఁ దానే చెడఁగొట్టును. ఆశాతీవ్రత వలని యంధతచే నీవు నాశముమీఁదికి దుముకుదువు. కాఁబట్టి విలాసినుల వలపుల మెలఁపులకు నీ హృదయము నందనీయకుము. మోహపు మోసగింపులకు నీ యాత్మ నప్పగింపకుము.

అట్లుచేయవేని సంతోషవాహినిని సాగించునట్టి యారోగ్యపు టూటపట్టు శీఘ్రముగా వట్టిపోఁగలదు. పసితనముననే నిన్ను ముసలితనము ముట్టుకొనును. నీ జీవితభానుఁ డుదయముతోడనే యస్తమించును.

అయినను సౌశీల్యమును, అణఁకువను, వీడకుండునేని నీ వేడుక విశేష ప్రకాశము గలదై వెలయఁగలదు.

అట్టి వేడుక మల్లెపువ్వుకంటె మనోహరమైనది. తెల్లఁ దామరపూవుకంటె నుల్లాసము గూర్చునది. సత్యము, సారళ్యము నట్టివేడుకతోఁ గూడియుండును. దానిపొందు తేనెకంటెఁ దియ్యనైనది.

ప్రేమమార్దవము నీ హృదయమునఁ బ్రామికొననిమ్ము; దాని పవిత్రత నీ హృదయమున కౌదార్యముఁ గూర్చును. అనుభవములను గ్రహించుటకు హృదయమును మృదువు పఱుచుకొనుము.

⁂

నీతినిధి

తృతీయాధ్యాయము

ఉవిద

అనురాగము ననుఁగుఁ గూఁతురా? వివేక బోధములను వినుము. సూనృతపు టుపదేశములను నీ హృదయమున సూటిగ నాఁటనిమ్ము. అటులయిన నీ మనోవిలాసములు నీ యాకారమునకు నందమిచ్చును. పన్నీటిపూవువంటి నీ సౌందర్యము పరువముదప్పినను, తన మాధుర్యమును నిలుపుకొని యుండును.

నీ వయోవసంతకాలమున, మఱి నీ జీవితోదయకాలమున, పురుషులెప్పుడు నిన్నుఁ గన్ను గొల్పి సంతోషముతోఁ గాంతురో, ప్రకృతి యెప్పుడు వారి చూపులయర్థమును నీ చెవులలోఁ దెలియఁజెప్పునో, అప్పుడు దుర్మార్గమునకు ద్రిప్పఁగలిగినవారి మాటలను జాగ్రత్తతో వినుము. నీ హృదయమును భద్రపఱుచు కొనుము. వారి చాటూక్తులకుఁ జెవి యొగ్గకుము.

పురుషునికి నీవు వివేకవతివైన విహితురాలవుగఁ గల్పింపబడితివని జ్ఞాపకము నందుంచుకొమ్ము. పురుషుని కామమునకు నీవు దాసివి కావు. నీ వీలోకమున మనుటకుఁ బ్రయోజనము, అధమమైన పురుషుని యాశను దీర్చుటయే కాదు. మఱివానికి జీవితక్లేశములందెల్లఁ జేదోడగుటయు, సౌహార్దముచే వానిని సంతోషపఱుచుటయుఁ బ్రియోపచారములచే వాని సేదదేర్చుటయును గూడ; పురుషుని హృదయమును జూఱగొని, సాంగత్య సౌభాగ్యముచే వాని లొంగగొని, వాని వక్షస్స్థలమున కేలికయై వెలయు నా యించుబోణి యెవ్వతె?

అల్లదో! భావమునఁ బవిత్రత గలిగి, చెక్కులందు మక్కువగలిగి, పరువపు మురిపముతో నచ్చటఁ దిరుగుచున్నదే ఆమె!

ఆమె హస్తము పనిని గోరుచున్నది. పనిలేని పర్యటనము నామె యిచ్చగింపదు.

శుభ్రవస్త్రము నామె ధరించును. మితముగ భుజించును. అణఁకువ, నమ్రత, నెమ్మది, ఆమె తల నలంకరించును.

సంగీత మామె నాలుకమీఁద నాట్యమాడుచున్నది. ఆమె పెదవులపై తేనెతీపు తీపారుచున్నది.

ఆమె మాటలందెల్ల నౌచిత్య మున్నది. ఆమె సంభాషణ మందు సత్యమును జల్లఁదనమును గలవు.

అణఁకువయును, నాజ్ఞానువర్తనమును నామె జీవితమందుఁ గాంచిన యుపదేశములు, శాంతిసౌఖ్యము, నామె పడసిన బహుమానములు.

ఆమె యడుగులముందు వివేకము నడచును. సౌశీల్య మామె కుడిచేతి ప్రక్కను గాచియుండును.

ఆమె కన్నులు, ప్రేమను బెద్దఱికమును దెలియఁజేయుచున్నవి. వివేక మామె కనుబొమలమీద విడిసియున్నది. చెడునడతగలవారికి నామె యెదురఁ జేయాడదు. ఆమె సౌశీల్యము భయభక్తులను గలిగించి వారిని బలుకకుండఁ జేయును.

దుష్టులు తన యెడల నకారణనిందను, తన పొరుగువారి యెడల నకారణ స్తుతిని, బ్రకటించుచుండునప్పుడు, సౌశీల్యవతియు, నౌదార్యవతియునగు నా సతి దానిని సరకుగొనక శాంతయై మిన్నకుండును.

ఆమె హృదయము సౌమ్యతకు సదనము. కాన, యితరుల యొద్దఁ జెడుగున్న దని యామె యెప్పుడును సందేహింపదు.

ఆమె నర్ధాంగినిగాఁ బడయువాఁడదృష్టవంతుఁడు. ఆమెను 'దల్లీ!' యని పిల్చు బిడ్డలు కూడ ధన్యులు.

ఆమె యింటిలో నాధిపత్యము వహించును. అక్కడ శాంతి సౌఖ్యములు కలవు. ఆమె వివేకముతో నాజ్ఞాపించును. అందఱు దానిని శిరసావహింతురు.

ఆమె తెల్లవాఱుజాముననే నిద్రలేచును. గృహ కృత్యములను జింతించును. వారివారిని దగిన పనులందు వ్యాపారింపఁజేయును.

కుటుంబమును జక్కపఱుచుకొనుటయం దామెకుఁ గుతూహలము మెండు.

తన విద్యావివేకమును దానికై వినియోగించును. పొదుపు, పొందిక, యామె యింట నగపడును.

ఆమె కార్యకౌశల మామెభర్తకుఁ బ్రాభవమునుగూర్చును. ఆయన యామె గుణగౌరవములను నిశ్చలానందముతో వినును.

ఆమె తన బిడ్డలను జక్కఁదిద్దును, తన మంచితనము నుదాహరణముగఁ గొని వారి మనసులకు ఘనగుణములను మప్పును.

ఆమె నోటిమాట వారి ప్రవర్తనకుఁ బ్రమాణము. ఆమె కనుసన్నలనుబట్టి వారు వర్తింతురు.

పనివాండ్రామెమాట వెంబడిఁ గార్యమునకు బరుగువాఱుదురు. ఆమె చెయిచూపినంత మాత్రముననే కార్యము చేయఁబడును. ఏలనఁగా ప్రేమ ధర్మము వారి హృదయములందుఁ జేరియున్నది. ఆమె ప్రేమమే వారి పాదములకు ఱెక్కలఁ గూర్చును. సంపత్కాలమం దామె యుబ్బి తబ్బిబ్బుగాదు. విపత్కాలమందు విధివికారములకు విహ్వలురాలును గాదు. శాంతముతో వానిని సహించును. సద్బోధనలచే నామె భర్తకష్టములను శమింపఁజేయుటయే కాక, ప్రేమోపచారములచే వానియం దాయనకు మాధుర్యమును జూపును. తన హృదయము నామె హృదయమందిడి యతడూఱటఁ జెందును.

ఆమె నర్ధాంగినిగాఁ బడయువాఁ డదృష్టవంతుడు. ఆమెను "దల్లీ' యని పిల్చు బిడ్డలు ధన్యులు.

❊ ❊

నీతినిధి

చతుర్థాధ్యాయము

రక్తసంబంధము

1. పెనిమిటి

దార పరిగ్రహముచేసి నీవు దైవాజ్ఞను శిరసావహింపుము. పెండ్లియాడి జనసంఘమునకు విశ్వాస్యుఁడవయిన స్వధర్మతత్పరుఁడవు కమ్ము. తొందరపడి పెండ్లిసంబంధమును గుదుర్చుకొనకుము. జాగ్రత్తతోఁ బరీక్షించి పరిణయమగుము. భావికాల సౌఖ్యానుభవము నీ విపుడు చేసిన భార్యాపరిగ్రహమును బట్టి యుండును.

వస్త్రములను ఆభరణములను ధరించుటయందే కాలమును వ్యయపఱుచు చుండునేని, తన యందమునకుఁ దానే మురియుచుండునేని, ఆత్మస్తుతి యందాసక్తి గలిగియుండునేని, వెకలి నవ్వునవ్వుచుండునేని వెడమాటలాడు చుండు నేని,– పుట్టినింటన యుండక తన యడుగుల నిరుగు పొరుగుటిండ్లకుఁ దార్చుచుండునేని, పరపురుషుల మీఁదికిఁ జూడ్కులఁ బరపుచుండునేని, యెంత యందగత్తెయైనను, అట్టియంగన నుండి నీ కన్నుంగవను బెడద్రిప్పి కొనుము. ఆమె త్రోవకు నీ యడుగులఁ బోవనీయకుము. ఆమె వలపువలలోఁ జిక్కకుండ నీ యాత్మనుఁ దొలఁగఁ జూచుకొమ్ము.

చిత్తశుద్ధియు, సౌహార్దమును, సముచిత సమ్మానమును, నీకు నచ్చిన సుందరా కారమును గలిగిన సుదతిని బెండ్లియాడుము. ఆమెయే నీకు నాప్తురాలుగను, ఆ జీవితము నిన్ననువర్తించు నర్ధాంగిగను నుండదగినది.

అట్టి స్త్రీని సురలోకమునుండి యనుగ్రహింపఁబడిన వరముగ నెన్నుకొమ్ము. ప్రియవర్తనచే నీ వామె హృదయమునఁ బ్రేమను బెంపొందింపుము.

ఆమె నీ గృహమునకు యజమానురాలు. కావున నీ పరిచారకు లామెకు లోపడియుండునట్లు నీ వామెను గౌరవించుము.

అకారణముగా నామె యభిరుచుల నడ్డగింపకుము. నీ కష్టములం దామెకుఁ

బాలు గలదు, సుఖములందును బాలుపెట్టుము.

ఒప్పిదముతో నామె తప్పిదములను జెప్పి చక్కఁబఱచుము. క్రౌర్యముచే నామెను లోపఱుచుకొనఁగడంగకుము.

నీ రహస్యముల నామె హృదయమున నమ్మికతో దాఁచుకొనుము. ఆమె నీ కొసఁగు హితము మనఃపూర్వకమయినది. దానిచే నీవు మోసగింపఁబడవు.

ఏకపత్నీవ్రతుఁడవై యుండుము. ఆమె కెప్పుడును విశ్వాసఘాతము చేయకుము. ఏలనఁగా నామె నీ బిడ్డలకుఁ దల్లి.

బాధయు వ్యాధియు నామెను బడల్పఱుచుచుండునప్పుడు జాలిచే దానిని శమింపఁజేయుము. ప్రేమను, కనికరమును జూపు నీ చూపు ఆమె దుఃఖమును దగ్గించును, బాధను దొలఁగించును. పదుగురు వైద్యుల కంటె నెక్కువ ప్రయోజనకారి యగును.

స్త్రీత్వపు మృదుత్వమును దలపోయుము. ఆమె సుకుమారదేహమును జూడుము. ఆమె లోపములను దారుణముగా మందలింపకుము. అప్పుడు నీ తప్పిదములను దలఁపునకుఁ దెచ్చుకొనుము.

2. తండ్రి

తండ్రిగానుండు నీవు నీ ప్రాపుననున్న వారిఁగూర్చి నీ బాధ్యతను గుర్తింపుము. నీవు పుట్టించిన జీవిని నీవే పోషింపవలయును జుమా?

నీ బిడ్డఁడు నీకు మేలునో కీడునో చేయువాఁడగుట, సంఘమునఁ బ్రయోజకుఁ డుగనో యప్రయోజకుఁడుగనో యగుట, నీ చేత నున్నది.

బాల్యముననే వానికి బుద్ధి గరపుము. వాని హృదయమును సూక్తి వర్షముచేఁ బదనుపఱుపుము.

వాని యభిరుచుల తీరును గుర్తింపుము. పసితనముననే యొప్పైన త్రోవకు వానిని ద్రిప్పుము. చెడునడవడి వాని వయస్సుతో వర్ధిల్ల కుండునట్లు చూడుము.

అట్లు చూచితివా వాఁడు కొండమీఁది దేవదారు వృక్షమువలె గొప్ప పెంపు గాంచును.

కొఱగాని కొడుకు తండ్రికిఁ గళంకము. సచ్చరిత్రుఁడు కులవృద్ధులకు గౌరవముఁ గూర్చును.

పొలము నీదియే. దానిని బలపరుపక చెడగొట్టకుము. నీవు విత్తిన దానినే పండించు కొనఁగలవు.

వానికి విధేయతను గరపుము; నిన్ను సుఖపఱుపఁగలఁడు. వానికి నణఁకువ నుపదేశింపుము; అవమానితుఁడు కాకుండఁగలఁడు.

వానికిఁ గృతజ్ఞతను బోధింపుము; లాభము పొందఁ గలఁడు. వానికి ధర్మముపదేశింపుము; ప్రేమపాత్రము కాఁగలఁడు.

వానికి మితభోగ మలవఱుపుము; ఆరోగ్యవంతుఁడై యుండగలఁడు. వానికి వివేకము నెఱిఁగింపుము; అదృష్టశాలి కాఁగలడు.

వానికి న్యాయముఁ దెలుపుము; లోకములో నాదరముఁ బడయఁగలఁడు. వానికి నిష్కాపట్యము నేర్పుము; అంతరాత్మచే నవజ్ఞాతుఁడు గాకుండఁ గలఁడు.

వానికి శ్రద్ధను బోధింపుము; ధనవంతుఁడు కాఁగలఁడు. వానికిఁ బరోపకారచింత బలపఱుపుము. ఉదారహృదయుఁడు కాఁగలఁడు.

వానికి శాస్త్రజ్ఞానము సమకూర్పుము; జీవితఫలము చెందఁగలఁడు. వానికి నధ్యాత్మతత్త్వము నవగతము చేయుము; మరణదుఃఖమును మాయించుకొనఁ గలఁడు.

3. పుత్రుడు

మనుష్యుఁడు దైవసృష్టములగు ప్రాణికోట్లనుండి జ్ఞానమును సంపాదించుకొనఁదగును. దాని మనసున నెలకొల్పుకొనఁదగును.

కుమారా! ఎడారికిఁ బొమ్ము. పోయి యక్కడ గానవచ్చు కొంగను జూడుము. దానిని నీ హృదయముతో మాటాడనిమ్ము. తన ఱెక్కల మీఁద నది ముదుసలి తండ్రిని మోసికొనిపోయి సురక్షితమగు చోటికిఁ జేర్చి యాహారమునిడును.

తండ్రి నీకుఁ బ్రాణదాత. కాన, యాయనకు గృతజ్ఞుఁడవై యుండుము. నిన్నుఁగని పెంచినదిగాన తల్లియెడను గృతజ్ఞుఁడ వగుము.

తండ్రినోటిమాటలను వినుము. అవి నీ మేలుకొఱకే చెప్పఁబడును. ఆయన చేయు సుబోధములకుఁ జెవియొగ్గుము. అవి యాయనకు నీ యెడలఁగల ప్రేమనుండి వెడలుచున్నవి. నీ మేలుకొఱ కాతఁడు మెలఁకువ గల్గియుండెను. నీ సుఖముకయి పాటుపడెను. కావున, నాయన వయసును సమ్మానింపుము. ఆయన వార్ధకమును వంచనముల పాలు కానీయకుము.

శిశుత్వమునాఁటి చేతఁగాని తనమును మఱవకుము. పెంకె తనముతోఁ గూడిన నీ పిన్నతనమును మఱవకుము. పెద్దలయి పేదపడిన నీ తల్లి దండ్రులను జులుకనసేయక సత్కరించుము. జీవితావసాన సమయమున వారికి సేవచేయుము. అట్లుచేసితివా వారు సుఖముగను, శాంతముగను మృతిఁ జెందుదురు. నీ బిడ్డలు నిన్నుదాహరణముగాఁ గొని నీ యెడల భక్తి నెఱపుదురు.

అన్నదమ్ములు

మీ రొక్క తండ్రిబిడ్డలు. ఆయన మీకుఁగావలసినదంతయు నిచ్చియున్నాఁడు. మీ రొకతల్లిపాలు త్రాగితిరి. అనురాగబంధము నిన్ను నీ యన్నదమ్ములతోఁ గలయ గూర్చుఁగాక! అప్పుడు నీ పితృగృహమున శాంతిసౌఖ్యములు సంవసింపఁగలవు.

నీవు లోకమం దన్నదమ్ములతో వేర్పడిన పిదపఁ గూడ ప్రేమమును ఏకీభావమును గల్పించు గర్భసంబంధమును జ్ఞప్తియం దుంచుకొనుము, నీ రక్తసంబంధులను వదలి పరులను బరిగ్రహింపకుము.

నీ సోదరుఁడు సంకటమం దున్నప్పుడు సాహాయ్యముచేయుము. నీ సోదరి కష్టమం దుండెనేని విడనాడకుము. అట్లు చేసితివేని నీ తండ్రి సంపత్తి యాయన కుటుంబమున కంతకుఁ బరిపోషమును గూర్చును. ఆయనకు మీ యందుండెడి ప్రేమ మీరు పరస్పరము ప్రేమించుకొనుటచేఁ గొనసాగుచుండును.

నీతినిధి

పంచమాధ్యాయము

మనుష్యులలో దైవికములయిన తారతమ్యములు

1. జ్ఞానవంతులు - జ్ఞానహీనులు

జ్ఞానభాగ్యము దైవాయత్తము. దాని నెవరెవ రెంతెంత పొందఁదగుదురో దైవము వారి వారి కంతంత యందిచ్చును.

ఆయన నీకు జ్ఞానము నొసఁగినాఁడా? విజ్ఞానమొసఁగి నీ మనసునకు వెలుఁగును గలిగించినాఁడా? ఒసఁగెనేని యజ్ఞానులు జ్ఞానవంతులగుటకు నీవు దానిని వినియోగించుము. మఱియు నీ యభివృద్ధి కొఱకే దానిని జ్ఞానవంతులకడఁగూడ వినియోగించుము.

మిడిమిడిజ్ఞానమున కున్న దడబిడలు, ఉత్తమ జ్ఞానమున కుండవు. జ్ఞానవంతుఁడు పలుమారు సందేహించుచుండును; తన్ను సంస్కరించు కొనుచుండును. మూర్ఖత్వముచే నజ్ఞాని తన కోడికి మూడుకాళ్లనును; సందేహింపఁడు. తన తెలివిలేమి నాతఁ డెఱుగఁజాలఁడుగాని తక్కిన విషయములన్నియుఁ జక్కఁగా నెఱిఁగితి ననుకొనును.

దుర్వివేకుల గర్వము దుర్వారమును, దుస్సహమును. అతి ప్రలాపమజ్ఞానము వలని యపచారము. అవివేకుల యతి ప్రలాపమును సహించి కనికరించుట జ్ఞానమువలని సత్కృత్యము.

గర్వముచే నుబ్బిపోకుము. చాతుర్య మెక్కువని జంబము లాడకుము, అసలయిన మానవజ్ఞానమంతయు నంధకారమందే యున్నది. తప్పులతోనే నిండియున్నది.

జ్ఞానవంతుఁడు తన తప్పిదములను దలఁచుకొని తలవంచుకొనుచున్నాఁడు. తన పనులు తనకుఁ దృప్తిగొల్పునవిగాఁ నుండుటకై యాతఁడు మిక్కిలి చిక్కులుపడును. బుద్ధిహీనుఁడు తన మనసను పడియను జూచుకొనుచు దానిలో నుండి రిత్తతలంపులను నత్తలనెత్తి ముత్తెములని యెదిరివారికిఁ

జూపును. చూపి. తనకుఁ దగిన చెలికాండ్రు చేయు స్తుతులకుఁ బొంగిపోవు చుండును.

పనికిమాలిన పనులందుఁ దన ప్రవీణతను జూపుకొనుచుఁ బ్రగల్భము లాడు చుండును. అవివేక మెక్కడ నవమానము గూర్చునో అక్కడ నాతని మతి మొక్కపోవును. అవమానము, ఆశాభంగము, వాని కష్టము గడించు లాభములు.

జ్ఞానవంతుఁడు తన మనసును జ్ఞాన వ్యవసాయముచేఁ బదనుపఱచును.

విద్యలను వృద్ధిచేసికొనుట కాతఁడు వేడ్కపడును. పరులకుఁ దనవలనఁ గలుగు ప్రయోజనము లాతనికిఁ బరువుమరియాదలను, ప్రాభవమును గూర్చును.

సౌశీల్యము సంపాదించుటందు వానికిఁ జాతుర్యము మెండు. తన జీవితమును బరిశోధించుకొనుటయే యాతని కానందకరమయిన శాస్త్రాభ్యాసము.

2. భాగ్యవంతులు, దరిద్రులు

ధనమును, దానిని జక్కఁగా వ్యయపఱచుటకుఁ దగిన మనసును, దైవ మెవనికి దయచేయునో వాఁడు భద్రములఁబడసి ప్రఖ్యాతుఁడగును.

వాఁడు తన భాగ్యమును సంతోషముతోఁ జూచును. ఏలనఁ బరులకు మేలుసేయుట కది పనికివచ్చును.

ఆర్తుల నరసి యాతఁడు రక్షించును. బలవంతులు బలహీనులను బాధింపకుండు నట్లాతఁడు పరికింపఁగలఁడు.

దయనీయులను వెదకి వారికొఱఁతల నెఱిఁగి, వివేకముతో నిరాడంబరముగ నాతఁడు వారికి సహాయపడును.

తెలివికి, యోగ్యతకు దోహదమొసఁగి యాతఁడు ప్రాజ్ఞుల బహూకరించును. ప్రతిభాశాలుల నతఁడు తఱచుగాఁ బ్రోత్సాహపఱచును.

లోకోపకారక మయిన ప్రతికార్యమును నాతఁడు పరిపోషించును.

ఆతఁడు గొప్పకార్యములంజేయును. ఆతనిచే దేశము భాగ్యవంతమగును. పలువు రాతని యొద్ద నియుక్తులై పనులు చేయుచునేయుందురు.

క్రొత్తయెత్తుల నాతఁడెత్తుచుండును. కళలు, విద్యలు నాతని ప్రాపున వెలయు చుండును.

తన యనుభవమునకు దాఁటియున్నసంపద నాతఁడు దరిద్రులసొమ్మని తలఁచును. అట్లే దాని వినియోగించును.

ఆతని యుపకారబుద్ధి నాతని యదృష్ట మడ్డగింపదు. కాన యాతఁడు తన భాగ్యముచేఁ బరితోషమునే పడయును. ఆతని యానంద మనిందితము.

సంపదను దన యింటిలో గంపలతో నింపుకొని దానిచేఁ దానే సుఖపడఁ జూచువాఁడు శోకముచేఁ జీకునుగాక.

బీదలు చెమటయోడ్చి చేసెడుసేవను గుర్తింపక వారి కడుపుగొట్టి గడింపఁ జూచువాఁడు దుఃఖముచేఁ ద్రుంగునుగాక!

లుబ్ధుఁడు ఱాతిగుండెవాఁడై యితరుల నడఁగఁ ద్రొక్కుచుఁ దాను వర్ధిల్లును. సహోదరుని కష్టముల కాతఁడు జాలిగొనఁడు. అనదల కన్నీరు వానికిఁ బన్నీరు. వితంతువుల పరిదేవనము వానికి సంగీతకము.

డబ్బుపిచ్చిచే వాని హృదయము దిబ్బిడగొని యుండును. కష్టముగాని దుఃఖముగాని వాని హృదయమును గరఁగింపఁజాలవు.

అయినను దురాశాదోషము వానిని బీడించుచునే యుండును. ఆసాసల కల వరములు, పలవరింతలు, నతఁడితరులకుఁ గలిగించు నిక్కట్టులకుఁ దగినట్టు కసిదీర్చుకొనుచునే యుండును.

వాని హృదయ పరితాపముముందఱ నిప్పచ్చరపువాని చప్పరింత లొక లెక్కలోనివి గావు.

ఇది యెఱిఁగి బీదవాఁడు తనకుఁదాను శాంతి సంతోషములను సమకూర్చు కొనఁదగును. అట్లనుటకుఁ గారణము లింకను గలవు.

బీదవాఁడు తన గంజిమెదుకులను ద్రాగుటకు శాంతముతోఁ గూర్చుండును. ఆతని యాకుముందు ముఖస్తుతిపరులు, సర్వగ్రాహులు చుట్టియుండరు.

తన ప్రోపు నాసించి బాధపడువా రెవ్వరు నాతని కుండరు. కావున నాతఁడు కలవరము చెందఁడు. పలువుర పరిదేవనము లాతని చెవుల బాధింపవు.

భాగ్యవంతులు తిను పంచభక్ష్యపరమాన్నాదులు లేవు గాన వ్యాధులు గూడ నాతని బాధింపఁజాలవు.

ఆతని యాహార మాతనికి రుచ్యముగాదా! ఆతని శీతలోదక మాతనికి దప్పి దీర్చి తృప్తిగొల్పునదిగాదా! ఆ శీతలోదకము ధనవంతులు త్రాగు పానీయములకంటెఁ బ్రశస్తమయినది.

వాని కాయకష్టము వాని యారోగ్యమును గాపాడుచున్నది.

హంసతూలికాతల్పములందు శయనించు సోమరు లెన్నఁడును గని యెఱుఁ గని నిద్ర నాతఁడు సుఖముగా నిమిషములోఁ గనఁగలఁడు.

ఆశల నాతఁడణఁగఁ ద్రొక్కును. తృప్తి, శాంతము, వాని హృదయమునకు ధనము, ఘనత, కూర్పలేని హాయి నొడఁగూర్చును.

భాగ్యవంతుఁడు తన భాగ్యమును జూచుకొని గర్వింప నక్కఱలేదు, దరిద్రుఁడు తన దారిద్ర్యమును దలఁచుకొని పలవింప నక్కఱలేదు. సహజముగనే దైవము వారికేదో సౌఖ్యము నిచ్చును.

3. యజమానులు, సేవకులు

దాస్యమునుగూర్చి మానవుఁడా! క్లేశపడకుము. అది దైవవిధి. దాని వలనఁ జాలలాభము లున్నవి. జీవితక్లేశములు చింతలు నీ కది లేకుండఁజేయును.

సేవకునకుఁ బ్రతిష్ఠగూర్చునది స్వామిభక్తి. విధేయతయు వినమ్రతయు దాని సుగుణములు.

కావున నీవు యజమానుని యాజ్ఞల కణఁగియుండుము. ఆతఁడు నిన్ను దూషించినపుడు దురుసుగా బదులు చెప్పకుము. మాటాడకుంటివా దాని నాతఁడు మఱవఁజాలఁడు.

ఆయనకు లాభముగూర్చుపనులను భద్రముగఁ జూచుచుండుము. ఆయన నీ యెడ నమ్మకము గలిగియుండెనని విశ్వసించియుండుము.

నీ కాలము కష్టము నాయనవి. నీ కాయన వానికై సొమ్మునిచ్చుచున్నాఁడు. కావున వాని విషయమున నీ వాయనను మోసగింపకుము. యజమానుఁడా! సేవకుఁడు నమ్మినవాఁడుగా నుండవలెనని కోరుదువేని నీవు వానిని నమ్మి న్యాయముతో నుండుము. వాఁడు విధేయుఁడుగ నుండవలెనని కోరుదువేని నీవు వానికి నుచితమైన యాజ్ఞల నొసఁగుము.

సేవకునియందుఁగూడ మానవశక్తులన్నియు నున్నవి. కాఠిన్యముచే భయము కలిగింపవచ్చునుగాని వాని ప్రేమను బడయరాదు.

నిందించునపుడు నిందతో దయను గలపుము. అధికారించునపు డధికారముతో న్యాయమును గలపుము. అట్లుచేసితివేని నీ యుపదేశములు వానికి హృద్యములగును.

కృతజ్ఞతవలన వాఁడు నీకు శ్రద్ధతో సేవచేయును. ప్రేమవలన వాఁడు నీకు సంతోషముతో విధేయతను జూపును. వాని శ్రద్ధకు, విధేయతకుఁ, దగిన బహుమానము నీవు తప్పక చూపవలెను.

4. రాజు, ప్రజలు

నీతో సమానులయిన మనుజులే నీకు రాజాధికారమిచ్చిరి. వారే నిన్ను రాజుగ నెన్నుకొనిరి. అట్టివాఁడా! స్వర్గమునకు సమ్మతుఁడయినట్టి వాఁడా! ప్రజలు నీ యెడ నమ్మకము పెట్టుటకుఁ గల భావములు నీకున్న మర్యాదకంటెను నౌన్నత్యముకంటెను, నున్నతములైనవని నమ్ముము.

రాజపట్టధారివై నీ వొక సింహాసనమునఁ గూర్చున్నావు. రాజతేజముఁ దెలుపు కిరీటము నీ తలపై నెలకొనియున్నది. అధికారదండము నీ హస్తమందున్నది. ఇవి యెల్ల నీ కొఱకుఁ గాదు. నీ ప్రాభవము కొఱకుఁ గాదు. నీ రాజ్యము యొక్క ప్రాభవము కొఱ కీయఁబడినవి.

రాజునకుఁగీర్తి యేమనఁగాఁ దన ప్రజలసౌహార్దమే. ఆయన యధికారము, రాజ్యము, ప్రజల హృదయములమీఁద నున్నది.

మహనీయుఁడగు నృపునిమనస్సు ఆతని యున్నతస్థితికిఁ దగినంత యున్నతముగా నుండును. గొప్పవిషయములఁ నాతఁడు తలపోయుచుండును.

తన రాజ్యమందుండు విద్వాంసుల నాతఁడు చేరఁబిలుచును. చనవుతో వారితో సంభాషించును. వారి యభిప్రాయముల నాదరించును.

ఆతఁడు తన ప్రజల మెలఁకువతోఁ జూచి వారి శక్తులఁ గనిపెట్టివారి యోగ్యతలకుఁ దగినట్టు పనిపెట్టును.

ఆతని న్యాయాధికారులు న్యాయముగలిగి యుందురు. మంత్రులు ప్రాజ్ఞులై యుందురు. ఆయన హృదయమునకుఁ బ్రియమగు వాఁడాయనను మోసగింపఁడు.

విద్యలన్న నాతఁడు వేడుకపడును. వానిని వృద్ధిపఱచును. చదివినవారన్నను జ్ఞానవంతులన్నను నాతఁడు సంతోషించును. ఒకరి నొకరు మీఱవలె నన్నకోరిక నాయన వారికిఁ గలుగునట్లు చేయును. ఆయన పరిపాలన ప్రఖ్యాతి వారి పరిశ్రమవలనఁ బెంపొందుచుండును.

వాణిజ్యము పెంపొందించు సాహులను, పైరుపంటలను జక్కఁగా సాగించు కర్షకులను, చిత్రసృష్టిని గావించు చిత్రకారులను, ప్రతిభా వ్యాపారమును జూపు పండితులను నాతఁడు దయతో నాదరించును. బహుళముగా బహూకరించును.

ప్రజల సుఖనివాసముకొఱకై యాతఁడు గ్రామములఁ గట్టించును. వ్యాపారము కొఱకు గొప్పయోడలను , నవియుండుటకుఁ దగినరేవులను, కృషిసౌభాగ్యము కొఱకుఁ గాలువలను నాతఁడు కల్పించును. ఆయన ప్రజలు భాగ్యవంతులగుదురు. దానిచే నాయన రాజ్యము ప్రబలమగును.

జ్ఞానముతోను న్యాయముతోను నాతఁడు శాసనముల జరుపును. ఆతని ప్రజలు తమ శ్రమమునకుఁ దగిన ఫలమును సులభముగాఁ బడయుదురు. శాసనముల ప్రకారము నడచుకొనుటయందు వారికి సౌఖ్యమున్నది.

ఆయన తీర్పులందు ధర్మము, దయ, దయివాఱుచుండును. దుష్టులను శిక్షించుటయం దాతఁడు పక్షపాతము లేక పట్టుదల గలిగియుండును.

ఆతడు ప్రజలమొఱ లాలకించును. వారిని గష్టపెట్టువారి చేతుల నాతఁడు కట్టిపెట్టును. కాన యాతనిప్రజలాతని భక్తితోను బ్రేమతోను జూతురు. తమ సౌఖ్యానుభవమున కాతఁడే సంరక్షకుఁడని వారు విశ్వసింతురు. ప్రజలాతనియెడఁ జూపుప్రేమ ప్రజలయెడ నాతని గాఢానురాగము గలిగించు నదిగా నుండును. ప్రజాసౌఖ్యము కొఱకాతడుఁ జాగ్రత్తగలిగియుండును.

ఆయనకు విరోధమును బ్రజ లెప్పుడును దలంపరు. విరోధుల కుతంత్రము లెప్పుడును నాతని కపకారము చేయఁజాలవు. కంచుగోడవలెఁ బ్రజలాతనిఁ గాపాడుచుందురు.

ప్రజారంజకుఁడుగాని రాజుసేనలు గాలికిఁ గొట్టుకొనిపోవు పొట్టువలెఁ బనిపట్టినప్పుడు పాఱిపోవుదురు.

శాంతిసౌఖ్యములు సత్ప్రభుని ప్రజలం దుండును. కీర్తియు బలమును నాతని సింహాసనముఁ జెందియుండును.

నీతినిధి

షష్ఠాధ్యాయము

సాంఘిక ధర్మములు

1. ఉపకారబుద్ధి

ఈప్సితములనుగూర్చి యెంచునపుడును, గొఱంతలను గూర్చి చింతించు నపుడును, నరుఁడా! నీకు బుద్ధినిచ్చి, భాషనేర్పి, మానవసంఘమునఁ బరస్పరము నిచ్చిపుచ్చుకొను సంబంధము గల్పించి, మంచుచున్న మహాత్ముని మంచితనమును మెచ్చుకొనుము.

ఆహారము, వస్త్రము, సుఖనివాసము, అపాయాపాకరణము, సంసార సంతోషము, ఇవియెల్ల నీ కితరుల తోడ్పాటువల్లఁ గలుగును. అవి సంఘమునఁ దప్ప మఱి యితరత్ర నీకు జతపడవు.

కాఁబట్టి నీకు మనుష్యులందఱు మిత్రులుగా నుండుట మంచిది. కావున నీ వితరులతో మంచియు మైత్రియుఁ గలిగియుండుము.

గులాబిపూవు స్వాభావికముగనే సౌగంధ్యము గల్గియుండునట్లు సత్పురుషుని హృదయ మెప్పుడును సత్కార్యతత్పరముగా నుండును.

ఆతడు శాంతిని, సౌఖ్యమును దా ననుభవింపఁగలఁడు. పొరుగువాని యానంద మును నభివృద్ధిని జూచి మెచ్చుకోఁగలఁడు.

దూషణములకాతఁడు చెవియొగ్గఁడు. పరుల తప్పిదములును దైన్యములును నాతనికి బాధగలిగించును.

మంచిచేయుట యాతనికి హితము. దానికై యాతఁడు కాలమును గారణమున వెదకుచుండును. ఇతరుని బాధను బాపుటచే నాతఁడు తన బాధను బాపికొనును.

తన మనసు పెద్దదగుటచే నాతఁడు తన కోరికలం దందఱసౌఖ్యమును జూచును.

2. న్యాయము

సంఘశాంతి న్యాయముపై నాధారపడియున్నది. ఒక్కొక్క మనుష్యునికిని శాంతి, వాని వాని వాంఛలఁబట్టియున్నది. కాఁబట్టి నీ కోరికల మితి మీఱనీయకుము. పొరుగువాని వస్తువులఁ గోరకుము. వాని వస్తువుల నీవు తాఁకఁగూడనంత పవిత్రముగ దర్శింపుము.

ఉద్రేకములకుఁ బాల్పడికాని, యొరుల మాయలఁ బడికాని యితరుని హింసింపను జెయి యెత్తకుము.

అన్యు నవమానింపకుము. చెడ్డసాక్ష్యము చెప్పకుము. వాని సేవకుఁడు వాని వంచించునట్లుగాని విడనాడునట్లుగాని చెప్పి చేయింపకుము. వాని ప్రాణేశ్వరిని బాపకృత్యములందుఁ బడఁద్రోవకుము.

నిష్పక్షపాతమును, న్యాయ్యమును, నగు నడవడి గలిగి యుండుము. నీ బాధ్యతను జక్కగా గుర్తించియుండుము. నమ్మిన వానిని మోసగింపకుము. దైవము ముందర దొంగతనము ద్రోహముకంటెఁ దక్కువచెడుగుగా నగు నని యెఱుఁగుము.

బీదలను బాధింపకుము. కూలివానికూలి నియ్యక వేధింపకుము.

లాభముకొఱకు దేనినేని యమ్మునపుడు నీ యంతరాత్మ నడిగి నీ లాభమున కొకమితి తెలిసికొని తృప్తిచెందుము. కొనువాఁడు తెలియని వాఁడైనచో నది సందుగాఁ జూచుకొని నీవు చాల లాభము పొందఁజూడకుము.

ఈయవలసినయప్పుల నిచ్చివేయుము. ఏలన ఋణదాత నీ మర్యాదను విశ్వసించెను. అట్టివానికి న్యాయ్యముగా నియ్యవలసినది యియ్యక పోవుట తప్పు. తుచ్ఛము.

తుద కిది వినుము. ఓ సంఘసంబంధీ! నీ హృదయమును బరీక్షించు కొనుము. మఱుపును దొలఁగఁద్రోలుము. జ్ఞప్తిని జక్కఁబిలువుము. పయి విషయము లందు బరాకుఁ జెందుదువేని నీ వవమానితుఁడ వగుదువు.

3. త్యాగము

హృదయమున నౌదార్యబీజముల వెదవెట్టినవాఁడు సుఖమందును. ఆ బీజములు మొలకెత్తి త్యాగము ప్రేమయను ఫలములను బండును.

ఆతని హృదయ మనెడి యూటపట్టునుండి సౌజన్య ప్రవాహ మెప్పుడును బ్రజాక్షేమమునకై పాఱుచుండును.

బీదలకుఁ గష్టకాలమున నాతఁడు సాహాయ్యము సల్పును. సర్వక్షేమమున కాతఁడు సంతసించును.

పొరుగువాని నాతఁడు నిందింపఁడు. ఈర్ష్యాద్వేషముల నొదవించు వినికిళ్ల నాతఁడు విశ్వసింపఁడు.

మనుష్యులు చేయు కీళ్ల నాతఁడు మన్నించును. వానిని దన మనస్సున నిలుపుకొనఁడు. ప్రత్యపకారచింతయుఁ బగయు నుండుటకు వాని హృదయమునఁదావుండదు.

అపకారి కాతఁడు ప్రత్యపకారము చేయఁడు. విరోధిని జూచి యాతఁడు రోఁతగొనఁడు. వాని యకృత్యములకు మైత్రితో మంచి గఱపును.

పరుల యిక్కట్టులకు జాలిగొని యాతఁడు వానిఁ బాపఁబూనును. ఆతఁడు కోపిష్ఠులకోపమును దగ్గించును. వారి తగవులఁ దీర్చును. ఇరుగుపొరుగుల శాంతిని సౌజన్యమును వృద్ధిపఱచును. వాని పేరు ప్రఖ్యాతమై బహుమానముతో నుచ్చరింపఁబడుచుండును.

4. కృతజ్ఞత

నది తొలుతఁ దనకు నీ రొసఁగిన సముద్రమునకే తన నీటిపెల్లును బంపునట్లు కృతజ్ఞునిచిత్త ముపకారికిఁ బ్రత్యుపకారము చేయుటకొఱకే ప్రయత్నము చేయుచుండును. ఉపకారి నాతఁడు ప్రేమతోను గౌరవముతోను జూచును.

ప్రత్యుపకారము చేయుటకు శక్యము కాదేని యుపకారమును జ్ఞాపక మందుంచుకొనును. మరణముదాఁక దాని మఱవకుండును.

ధర్మాత్మునిచేయి భూమిపయిఁ బూవులను బండ్లను బైరులను వెలయించు నీటి మబ్బువంటిది. కృతఘ్నుని హృదయము వర్షోదకము నెల్ల దిగమ్రింగి తనలోనే యడఁచుకొని నిష్ఫల మొనర్చు నిసుక యెడారివంటిది.

మేలును మఱవకుము. దానిని దాఁచిపెట్టకుము. గర్వితులవలన నుపకారము పొందకుము. స్వార్థపరాయణులతోను నత్యాశాపరులతోను సంబంధము గలిగించు కొనకుము.

5. నిష్కాపట్యము

సత్యదేవత సౌందర్యమునకు వలచి యామెపై మనసు నిలిపిన మానవుఁడా! నీ వామెపై స్థిరబుద్ధి నుంచుము. ఆమెను విడనాడకుము. నిశ్చలమయిన సౌశీల్యగౌరవముచే నీ వలంకృతుఁడ వగుదువు.

కపటములేని వాని పలుకులు భావమునంటి యుండును. వానికి హృదయ మందున్నదే నాలుకమీఁదను నుండును. మోసమునకు వాని మాటలందుఁ జోటుండదు.

అనృతమున కాతఁడు లజ్జించును. నిజమునం దాతని కన్ను నిలిచి యుండును. మాయలమారితనమునకు నైచ్యమునకు నాతడు రోఁతపడును.

ఆతఁడెప్పుడును గలవరము చెందఁడు. వాస్తవమాడుట కాతఁడు ధైర్యము గలిగియుండును. బొంకుటకు మాత్రము భయపడును.

ఆతఁడు నైచ్యమునకుఁ గాపట్యమునకు మిక్కిలి దూరమందున్నాఁడు. దూరదృష్టితోను జాగరూకతతోను నాతఁడు పెదవులఁ గదలించును. న్యాయమును బరిశీలించి వివేకముతో మాటాడును.

మైత్రితో మాటాడును. ఒద్దికతోఁ దప్పుదిద్దును. మాట యిచ్చెనేని మఱుమాట లేక దాని నెఱవేర్చును.

కాని కపటాత్ముని హృదయము చాటుచేయఁబడి యుండును. వాని పల్కులకు సత్యపువన్నె చమురఁబడి యుండును. వంచనమే వాని పని.

వాఁడు దుఃఖమున నవ్వును. సంతోషమున నేడ్చును. వాని మాటల కర్థముండదు.

ఎలుకవలె నాతఁడుచీకటిలోఁజెర్లాడుచు సురక్షితుఁడనని భ్రమించుచుండును. కాని యాతఁడు తన కెఱుకలేకుండఁ దన తప్పులచేతనే వెలికిఁ దేఁబడు చుండును.

అంతఁ దన దోషకాలుష్యము మొగానఁ దగిలియుండును గాన నలుగురు గుర్తింపఁగాఁ దల గ్రోఁకికొనును.

జీవితకాలమంతయు నాతఁడు నిత్యనిర్బంధమునఁ గడపును. ఆతని నాల్కకును హృదయమునకును సంబంధముండదు.

సచ్చరిత్రుని నడవడి నాతఁడభినయించును. మోసగింపు టెత్తులచే నుప్పొంగుచుఁ దనలోఁదాను గాఢాలింగన సౌఖ్యము ననుభవించుచుండును.

నేను క్షేమముగ నున్నానని నీవు తలఁచునపుడును, నీ క్రుళ్లు వెల్లడియై నీవు వెంగిలివైనప్పుడును, జ్ఞానవంతులు నిన్నుఁజూచి నవ్వుదురు.

నీతినిధి

సప్తమాధ్యాయము

మతము

కారణకారణము, సర్వస్రష్ట, సర్వశక్తుఁడు, ఆద్యంతరహితుఁడు, అగోచరుఁడు, భగవానుఁడొక్కఁడే కలఁడు.

సూర్యుఁడు దైవప్రతిబింబముగా నున్నాఁడు. ఆతఁడు తన ప్రకాశముచే నీ లోకమునకెల్ల వెలుఁగును గలిగించుచున్నాఁడు. ఆయన వేఁడిమి భూమిపైఁ గల వస్తువులకెల్లఁ బ్రాణమిచ్చును. సూర్యుఁడు భగవానుని పనివాఁడని యెఱిఁగి ప్రశంసింపుము. ఆరాధింపకుము.

సర్వోత్కృష్టుఁడును సర్వజ్ఞుఁడును సర్వోపకారియు నగు నా యేకేశ్వరునకే యారాధనము తగును.

ఆయనయే తన చేతితో నాకాశము నలంకరించినాఁడు. తన వ్రేళ్లతో నక్షత్ర మార్గముల నాయనయే యేర్పఱిచినాఁడు.

లోక మెల్ల దద్దఱిల్లునట్లు భూమిని వడఁకించువాఁడును బిడుగులఁబడ మోఁది దుర్మార్గుల నడిఁకించువాఁడును నాయనయే. సముద్రమును బంధించినవాఁడు, గాలి నరికట్టినవాఁడును నాయనయే.

లోకములెల్లఁ బుట్టించువాఁడును గిట్టించువాఁడును నాయనయే.

సర్వశక్తుఁడైన యాయీశ్వరుని భక్తితోఁ బ్రార్థింపుము. ఆయనకుఁ గోపము వచ్చునట్లు వర్తింపకుము. అట్లయిన నీ వడఁగారుదువు.

ఆయనకార్యము లన్నింటిమీఁద నాయన దూరదృష్టికలదు. అనంతమయిన విజ్ఞానముతో నాయన లోకమును బ్రచలింపఁజేయుచుఁ బరిపాలించు చున్నాఁడు.

మన భవిష్యద్రహస్యము లాయనదృష్టికి బట్టబయలుగా నుండును. ఆయన దూరదృష్టికిఁ దెలియక తటాలన జరుగున దేదియు నుండదు.

ఆయన యుద్బోధము లతిగూఢములు. ఆయన విజ్ఞాన మిట్టిదని నీవు వివేకింపఁజాలవు.

కావున నీశ్వర విజ్ఞానమునకు భయభక్తులు గలిగియుండుము. ఆయన యుపదేశములకు విధేయుఁడవై లొంగి వర్తింపుము. భగవానుఁడు దయాళువు. ఆయన లోకములను దయతో సృజించియున్నాఁడు.

ఆకాశముఁజూడుము. ఆయన ప్రకాశము గానవచ్చును. భూమివంకఁ జూడుము. ఆయన దయ దయివాఱుచుండును. కొండలును సెలయేళ్లును నాయనను బ్రశంసించుచున్నవి. పొలములు, నదులు, అడవులు నాయన కీర్తిని గీర్తించుచున్నవి.

మనుష్యుఁడా! ఆయన నిన్ను మాత్ర మితర జీవరాసులనుండి వేఱు పఱిచి వానికంటె నధికదశయం దుంచినాఁడు.

నీ శ్రేష్ఠతను గాపాడుకొనుటకు నీకు నాలోచనము నిచ్చియున్నాఁడు. సంఘమునందుఁ బెంపొందుటకు నీకు భాషాజ్ఞానము నిచ్చియున్నాఁడు. నీ మనసునకు ధ్యానశక్తిని, వివేచనాశక్తిని, అనుకరింపరాని తన పవిత్ర గుణములను బ్రేమించుశక్తిని, ఇచ్చియున్నాఁడు.

నీవు నెఱవేర్పవలసిన దైవవిధులు నీ స్థితిగతులకుఁ దగినట్లుండున ట్లాయన కల్పించినాఁడు. కావున నీవు వానిని నెఱవేర్చెదవేని సౌఖ్యమందఁగలవు.

ఆయన కారుణ్యమును గీర్తింపుము. నిశ్చలముగా ధ్యానింపుము. నీ హృదయమునఁ గృతజ్ఞతను సంతృప్తిని దయివార్చుకొనుము. నీ కార్యములవలన నాయన యాజ్ఞలమీఁద నీకున్నభక్తిని వెల్లడించుకొనుము.

భగవంతుఁడు న్యాయముతోను సత్యముతోను లోకమును రక్షించు చున్నాఁడు. ఆయన యాజ్ఞల నుల్లంఘించిన వారిని శిక్షింపఁడా?

మనుజా! శిక్షించుటకు జాగై నందుచే దైవశక్తి తగ్గిన దనుకొనకుము. నీ యకృత్యముల నాయన యంగీకరించు ననుకొనకుము. ప్రతిహృదయము నాయన కన్నుదూరి చూడఁగలదు.

అదియెల్ల నాయన స్మృతియందుండును. మనుష్యులను గాని వారి పదవులను గాని యాయన మన్నింపఁడు.

ఈ జీవితము ముగిసిన పిదప గొప్పవారు కొద్దివారు, భాగ్యవంతులు నిర్భాగ్యులు, జ్ఞానవంతులు, జ్ఞానహీనులు, వారు వారొనర్చిన కార్యములకుఁ దగినట్టు న్యాయ్యమైన ప్రతిఫలమును దైవనిర్దేశమువలనఁ బడయఁగలరు.

అత్తఱి దుర్మార్గులు తత్తఱిల్లుదురు. సన్మార్గులు సంతోషింతురు.

కావున నీవు నీ జీవితకాలమున భగవదాజ్ఞకు భయపడుచు నాయన నీ కేర్పఱిచిన సన్మార్గమున సంచరింపుము.

వివేకము నిన్ను వెలపించునుగాక. నిబంధనము నిన్ను నియమించునుగాక. న్యాయము నిన్ను సన్మార్గమున నడపునుగాక. దయ నిన్నుఁ గరఁగించునుగాక.. భగవంతునిపైఁ గృతజ్ఞత నిన్ను భక్తిపరుఁగాఁ జేయునుగాక!

ఇహమున నిన్నివి సుఖమునకుఁ దార్చి పరమున శాశ్వతానందమును బడయఁ జేయును.

ఇదియే మానవజీవితవిధానము.

ప్రథమభాగము ముగిసెను.

నీతినిధి

ద్వితీయభాగము

నీతినిధి

ద్వితీయభాగము

ప్రథమాధ్యాయము

మానవ సామాన్యవిషయములు

1.మానవదేహము, దాని నిర్మాణమును

అల్పబుద్ధివి, అల్పబలుఁడవు నగు నరుఁడా! అడఁకువ గలిగియుండుము. అనంతమయిన విజ్ఞానము నందఁగోరితివేని నీ యెదుటఁ గానవచ్చు దివ్యశక్తులఁ దెలిసికొనఁ దలఁచితి వేని ముందు నీ దేహమును గూర్చి యాలోచించుకొనుము. వెఱపును వింతను గొల్పునట్టు నీవు సృష్టింపఁబడితివి. ఇట్టు సృష్టించిన సృష్టికర్తను నీవు భయభక్తులతోఁ బ్రస్తుతింపుము. ఆయన యెదురఁ గృతజ్ఞతను సంతోషమును దెలుపుకొనుము.

జంతుకోటిలో నెల్ల నిట్టనిలుచువాఁడవుగా నీ వేల సృష్టింపఁబడితివో యెఱిఁగితివా? భగవంతుని పనులఁజూచుటకుఁ జుమా! చూచుటెందు కందువా? అచ్చెరువు చెందుటకు; అది యెందు కందువా? ఆయన నారాధించుటకు.

ఎఱుక నీలోమాత్రమే యేర్పడనేల? అది నీ కెక్కడనుండి యొదవినది? ఆలోచనశక్తి మాంసమందు లేదు. వివేచనశక్తి యెముకలందు లేదు. పురుగులు తన్నుఁ బరిగొనునని సింహ మెఱుఁగదు. యజమానుఁడు తన్నుఁ జంపుటకు సాఁకుచున్నాఁడని మేఁక యెఱుఁగదు.

నీవు చూడఁగల్గిన వానికంటె నింకేదో యొకటి నీలోఁ గలదు. నీ యింద్రియ ములకు గోచరముగాని దింకేదో నీలో నుండి నీ భౌతిక శరీరమునకుఁ బ్రజ్ఞను గల్పించుచున్నది. అది యేదో యెఱుఁగుము.

అది నిన్ను వదలిన పిదప నీ యొడలు వట్టిదిగా నట్టె యుండును. కాన యది నీ మేనిలోని భాగము గాదు. అది భౌతికము కాదు గాన శాశ్వతమయినది. వ్యాపారించుటయందు దానికి స్వాతంత్ర్యమున్నది. కావున నది తన చేయు పనుల కన్నిటికిని దానే యుత్తరవాది యగుచున్నది.

గాడిద తనపండ్లతోఁ బచ్చికను గొఱుకఁగలదు. కాని, దానికి నాహారపు టుపయోగ మవగత మగునా?

వెన్నెముక నీకున్నట్లు మొసలికిని వంకరలేకయేయున్నను నది నీవలె నిలువఁ బడి యుండఁగలదా?

వానివలె నిన్నుఁగూడ నీశ్వరుఁడే సృష్టించెను. కాని వాని నన్నింటిని సృష్టించిన వెనుకఁ జుమా నిన్ను సృష్టించెను;

వానికంటె నుత్కృష్టతయు, వానిపై నధికారమును, నా యీశ్వరుఁడు నీకను గ్రహించియున్నాఁడు. మఱియు స్వయముగా నెఱుఁగఁదగునట్టు నీకు జ్ఞాన సముచ్చయము నిచ్చియున్నాఁడు.

ఆ యీశ్వరుని సృష్టికంతకు శిరోభూషణమైన నిన్ను నీవ యెఱిఁగి కొనుము.

దైవత్వమునకును జడత్వమునకును నడుమ నుండి నీవా రెంటిని గెడగూర్చు వాఁడ వగుచున్నావు. దేవాంశము నీయందుఁ గొంతయుండుట తెలిసికొనుము. నీ ఘనతను నీవు జ్ఞప్తియందుంచుకొనుము. నైచ్యమందును దౌష్ట్యమందును నడుగిడ సాహసింపకుము.

పాపతోఁకను భయముగొల్పిన వారెవ్వరో, గుఱ్ఱము గొంతుకను హేషితముల నెనయించిన వారెవ్వరో, యెఱుఁగుదువా? పామును గాలరాచి పరిమార్పఁ గల తెలివి నీకు వెలయించినవాఁడును, నీ యుపయోగము కొఱకే గుఱ్ఱమును మాలిమి చేయఁగల కుశలతను నీకుఁ గూర్చినవాఁడును, అయిన యా యీశ్వరుఁడే.

2. ఇంద్రియముల యుపయోగములు

ఆదిసృష్టి యని దేహమునుగూర్చి నీ వభిమానింపకుము. జీవస్థానమని హృదయమునుగూర్చియు నీ వెక్కువగా ముదంపడకుము. ఇంటిగోడలకంటె నింటికంటె నింటి యజమానుఁ డెక్కువవాఁడు సుమా!

వెదవెట్టుటకుముందు సేద్యగాఁడు భూమిని బదను పఱుచుకొనవలయును. కంచుపోఁతకముందు కంచరి కొలిమిని నెలకొలుపుకొన వలయును.

భగవంతుఁడు “మీతరఁగ లీవైపునకుఁ దరలవలయును. ఇంతకంటె నెత్తున కవి యెగిసిపడరాదు” అని సముద్రముల శాసించినట్లు నీ యాత్మ నీ శరీర వికారమును శాసించి, దారిఁజూపి, దాని పొగరును దిగఁద్రొక్కునుగాక!

అవయవములకెల్ల నాత్మనియామకము. ఆ యాత్మనిదేశములను నీ యవయవము లనువర్తింపవలెను. ప్రభువుతోఁ బ్రజలు తిరుగఁబడఁ గూడదుగదా!

నీ మేను భూమివంటిది. నీ యెముక లా యుర్విని మోచియుండు పర్వతముల వంటివి.

సముద్రపునీరే భూమినిబడి చెలమల నూరి యేళ్లఁబాఱి మరల సముద్రము చేరినట్లు ప్రాణము నీ హృదయమునుండి వెలికిఁ బ్రవహించి మరల హృదయమునకే యేఁగుచున్నది.

పయిరెండును వానిగమనము నెప్పుడును సాగించుకొనుచునే యుండును గదా! ఈ రెంటిని సృష్టించినవాఁడు భగవానుఁడే.

నీ ముక్కు సుగంధగ్రహణమునకు ద్వారముగదా! నీ నోరు రుచి గ్రహణమునకు ద్వారముగదా! అయినను సుగంధముల నెప్పుడును జూచుచుండిన వైరస్య మొదవును. రుచుల నెప్పుడును గొనుచునేయున్న నది కలిగించు నాఁకలి యాగిపోవును.

నీ కన్నులు నీకుఁగాపున్న కావలివాండ్రుగదా! అయినను నవి తప్పును నొప్పును గనుఁగొనుటలోఁ దఱచుగాఁ దప్పిబోవుచుండును.

నీ యాత్మను నియమములందు నిలుపుకొనుము. నీ మనస్సును దాని మంచికొఱకుఁ గాచియుండుట నేర్పుము. అట్లుండిన నీ మనస్సునకు మంత్రులగు నీ కన్నులు నీకు సత్యమును నివేదించునవిగ నుండును.

ఈ చేయి యొక చిత్రసృష్టికాదా? ప్రపంచమున దాని వంటిదే దైనఁగలదా? అది నీ కేల యీయఁబడినదో యెఱుఁగుదువా? నీ సహోదరులకు సహాయము చేయుటకు.

సృజింపఁబడిన జీవకోటులలో నెల్ల సిగ్గిలు స్వభావము నీకే యేల యనుగ్రహింపఁ బడినది? ప్రపంచము నీ యవమానమును నీ ముఖమునఁ గనిపట్టును. కాన నీ వవమానకరములగు కార్యములఁ జేయఁగూడదు.

భయము, నిర్వ్రీడ, నీ ముఖవికాసమును భగ్నపఱుచును. అపరాధము నీ యందఁ జేరనీయకుము. అప్పుడు భయము నీ కణఁగియుండును. నిర్వ్రీడ మగతనమునకుఁ దగినదిగాదు.

కలలయందు ఛాయాశరీరములు నీతో మాత్రమే యేల మాటాడును? వానిని మన్ననతోఁ జూడుము. ఏల యనఁగాఁ గలలు భగవత్ప్రసాదితములు.

మనుష్యుఁడా! నీవు మాత్రమే మాటాడఁగలవు. ఈ శక్తికి నీవు వింతపడవలెను. దీని నీ కనుగ్రహించిన మహనీయుని కర్హమైన యభినందనముల నర్పింపుము. నీ బిడ్డలకు బుద్ధిగఱపి వారికి భక్తిమార్గము నెఱిఁగించు నా మహనీయు నారాధింపుము.

3. మనుజునియాత్మ, దానియారంభము, దాని చేష్టితములు

మనుజా! నీ బాహ్యశరీరమునకుఁ బ్రసాదింపఁబడిన వరములు సుమా, ఆరోగ్యము, బలము, అవయవముల యానురూప్యము ననునవి! వీనిలో నారోగ్యము పేరెన్నఁ దగినది.

దేహమున కారోగ్యమెట్టిదో ఆత్మకు సౌశీల్య మట్టిది.

ఆత్మ యొకటి కలదనుట నీకుఁ దెలిసిన విషయములలో నెల్ల విస్పష్టముగాఁ దెలిసిన విషయము. కావున దానియెడ సాధుభావముగల్గి కృతజ్ఞుఁడవై యుండుము. పూర్తిగాఁ దానిని దెలిసికొనుటకై పోరాటములు పడకుము. దాని నట్లు మానవబుద్ధి తెలిసికొనఁజాలదు.

ఆలోచించుట, అర్థముచేసికొనుట, వివేకించుట, సంకల్పించుట, ఆత్మయనుకొన కుము, అవియెల్ల దాని చేష్టితములు; కనుక నవి దాని ముఖ్యాంశములు కావు.

నీవు నిందితుఁడ వగుదువు. దాని నాకాశము నంటింపకుము. నీ వెగిరిపడు వాఁడవు కారాదు. మఱియు దానిని బశువృత్తికిని దించి నీచ పఱపకుము.

అర్థజ్ఞానములేని గాడిదవలె గుఱ్ఱమువలె నీవగుట తగదు. దాని శక్తులచే దాని వెదకుము. దాని సద్గుణములచే దాని గుర్తింపుము. అవి నీ తలవెండ్రు కల కంటె నెక్కువగా నున్నవి. ఆకసముననుండు నక్షత్రములుగూడ లెక్కలో వీనికిఁ దక్కువే.

అరేబియా దేశీయులవలె నాత్మయొక్కటే మనుష్యులందఱియందును బంచి పెట్టఁబడియున్నదని యెంచకుము.

ఐజిప్టుదేశీయులవలె నొక మనుష్యునకే యనేకాత్మలున్నవనియు నెన్నకుము. నీకు హృదయ మెట్లొక్కటిగానున్నదో అట్లే యాత్మకూడ నొక్కటియేయని నమ్ముము.

సూర్యుఁడు బంకమట్టిని గట్టిపఱచును. మరల నాతఁడే మైనమును గరఁగఁ జేయును. ఈరెంటి నొక్కఁడే యెట్లు చేయుచున్నాఁడో అట్లే యాత్మయు విరుద్ధ కృత్యములను జరుపుచున్నది.

చీకటి తనచుట్టుఁ గ్రమ్మినను జంద్రుఁడు తన సత్ప్రకాశమును సంరక్షించుకొను నట్లు బుద్ధిహీనుని హృదయమందుఁగూడ నాత్మ వినిర్మలముగనే వెలుఁ గుచుండును.

ఆత్మకుఁ జావులేదు; మార్పులేదు. ఎల్లయెడల నది యేకమై యుండును. ఆరోగ్యము తన యందముఁ జూపుటకు దానిని బిలుచును. జ్ఞానమనెడు తైలముతో దాని ముఖమును దత్పరత యభ్యంజనము చేయును.

అది నీవు పోయిన పిమ్మటఁగూడ జీవించినను నీవు పుట్టుటకుఁ బూర్వము కూడఁ గలదని యనుకొనకుము. నీ దేహముతో నదియు సృష్టింపఁబడినది. నీ ప్రేగులతో నదియుఁ బెరిగినది.

న్యాయము, మంచిగుణములతో గొప్పఁజేసి దాని నీకీయలేదు. కరుణ, దానిని జెడుగులతో వికారపఱిచి నీ కీయలేదు. అవి యన్నియు నీవి. వానికన్నింటికి నీ వుత్తరవాదివి.

చావు నిన్నుఁ బరీక్షింపఁబడకుండఁ గావఁగలదని యెంచకుము. దుర్వర్తన నిన్నుఁ బరీక్షనుండి తొలఁగించు నని తలఁపకుము.

నీకుఁ దెలియనిదాననుండి నిన్నుఁ గల్పించినవాఁడు మరల నీకుఁదెలియని దానిలోఁ నిన్ను గలపఁజాలఁడా?

కోడి నడిరేయిని దెలిసికొనుచుండలేదా? తెలిసికొని నీకు వేకువను దెలుపుటకు గొంతెత్తి కూయుచుండ లేదా? కుక్క తన యజమానుని యడుగులను దెలిసి కొనుచుండలేదా? గాయపడినమేఁక యా గాయమును మాన్పఁగల యోషధి కడకుఁ బరుగిడుచుండలేదా? కాని యవి కడతేఱినప్పుడు వాని యాత్మకూడ వానితో మట్టిలోఁ గలియును. నీ యాత్మమాత్రమే నిలిచియుండును.

ఆ జంతువుల కిచ్చియుండు గ్రహణశక్తులఁజూచి నీ గ్రహణ శక్తులకన్నఁ గొన్ని మిన్నగాఁ జుఱుకుగా నున్నవని విన్నఁబోవకుము. అట్టి శక్తులు కలిగి యుండుటలోఁ గాదు ఘనత; మఱి వాని నెఱిఁగియు నుపయోగించుకొనుటలో నున్నది. అది నీవు గ్రహింపుము.

నీకు దుప్పికిఁబోలె దూరధ్వనివిను వీను లున్నను, గ్రద్దకుఁ బోలె సర్వమును దూరిచూచు కన్ను లున్నను, జాగిలమునకుఁబోలె మూచూచి పసిపట్టఁ గలిగిన ముక్కు న్నను, కొండముచ్చునకుఁ బోలె మేలిరుచుల గుర్తింపఁగల నాలుక యున్నను, తాఁబేటికిఁబోలె సూక్ష్మస్పర్శజ్ఞానము గల తనువున్నను, వివేకించు తెలివిలేకుండెనేని వీనితో నీ కేమి ప్రయోజన ముండును? అవి యన్నియు నంతరించునవే.

వానిలో వేనికైన మాటాడ శక్తిగలదా? వానిలో నేదైన నీతో 'అందువలన నట్లుచేసితిని' అని చెప్పఁగలదా?

జ్ఞానవంతులపెదవులు, స్వర్ణభాండారపుఁ దలుపులవంటివి. అవి తెఱవఁ బడిన తోడనే యనర్ఘవస్తువులు ముం దగపడును.

వెండిపాదులలో బంగారుచెట్ల మర్పఁబడినట్లు, జ్ఞానపూరితములగు వాక్కులు ఉచితకాలములుం దుచ్చరింపఁబడును.

నీ యాత్మనుగూర్చి తగినంతగా నీవు తలఁచుకొనఁగలవా? దానిని మితిమీఱు నంతగా నీవు మెచ్చుకొనఁగలవా? అది నీకెవరిచే నీయఁబడెనో వారి ప్రతిబింబము.

దాని ఘనత నెప్పుడును జ్ఞప్తియం దుంచుకొనుము. ఎంత గొప్ప తెలివి నీకు సొంతము చేయఁబడినదో యెఱిఁగి యుండుము.

మంచి జేయునదే చెడుగునుగూడఁ జేయవచ్చును. కాన దానిని మంచి ప్రక్కకే యుంచుటకై జాగ్రత్తగొని యుండుము.

గుంపులో నున్నచో దానినిఁగోల్పోవుదునని యనుకొనకుము. అరలో దాని నణఁచి యుంచఁగల్గుదునని తలఁపకుము. పనిచేయుట దానికిఁ బరమానందము. పనినుండి దాని మానిపింపఁ గాదు.

దాని చలనము శాశ్వతము. దాని ప్రయత్నములు సర్వతోముఖములు, దాని చాకచకి యాఁక గొల్వరానిది. అంతరిక్షమున నున్నదానిఁగూడఁ దాని కన్ను కనుఁగొనఁగలదు. విషయవిచారమున కది వేడుకవడును.

జలాపేక్షగలవాఁడు మండుచుండు నిసుకపట్టులందుఁగూడ విసువక నీటికై వెదకులాడునట్టు జ్ఞానతృష్ణగొన్న యాత్మయు జ్ఞానమునకై గజిబిజి పడుచుండును.

ఏచియుండునది గాన దానిఁ గాచియుండుము. విచ్చలవిడిగాఁ బోవునది గాన దాని బిగ్గఁబట్టియుండుము. దౌర్జన్యము గలదిగాన దాని నార్జవమందఁ జేయుము. అది యుదకముకంటె నొదిగియుండునది; మైనము కంటె మార్పఁ దగినది; గాలికంటె వీలుపడునది. దాని కానవెట్టున దేదియు లేదా?

వివేకహీనునిలోనియాత్మ పిచ్చివాని చేతిలోని కత్తివంటిది. అది సత్యముకొఱకు వెదకులాడును. ఆ సత్యమును గనుఁగొనుటకు దానికి సాధనములు తర్కము, అనుభవమును; కాని యివి బలహీనములు, నిలుకడ లేనివి; నమ్మకము చాలనివి; ఇఁక నది సత్యము నెట్టు లెఱుఁగఁ గల్గును?

జనసామాన్యమునకు సమ్మతమైనంతమాత్రాన నేదిగాని సత్యమైనది కాఁజాలదు. ఏలన, జనసామాన్యము చాలఁగా మతిలేనిదై యుండును.

నీవు నిన్నుఁ దెలిసికొనుట, నిన్ను సృజించినవానిఁ దెలిసికొనుట, ఆయనను

బూజింపవలసియున్నావనియుఁ దెలిసికొనుట- ఇవి యన్నియు నావశ్యకములయినవని స్పష్టముగా నీకు గోచరించెనుగాదా? మనుష్యుఁ డింత కంటె నిశ్చయముగాఁ దెలిసికోఁదగినది మఱేమున్నది? చూడుము.

4. మానవుని జీవితకాలము, దాని ప్రయోజనములు.

చక్రవాకమునకుఁ దెల్లవాఱుట యెట్టిదో గ్రుడ్లగూబకుఁ బ్రొద్దుగ్రుంకుట యెట్టిదో, తేనెటీఁగకుఁ దేనె యెట్టిదో మనుష్య హృదయమునకుఁ బ్రాణ మట్టిది.

ప్రకాశమానమైనను నది మిఱుమిట్లు గొల్పదు. అస్పష్టమైనను నది యసంతుష్టిని గొల్పదు. మధురమైనను నది వెక్కసము గాదు. కాని దాని సత్యమైన యుపయోగమును గుర్తించినవా రెవ్వరు?

జీవితమునెట్లు గౌరవింపవలెనో తెలిసికొని యట్లు గారవింపుము. అట్లుచేసితివా నీవు జ్ఞానశిఖరము దరి నుందువు. మతిమాలినవాండ్రు వోలె జీవితముకంటె నెక్కువ విలువ గల దిఁక నేదియుఁ లేదని తలంపకుము. పండితమన్యులువోలె జీవితమును దృణీకరింపవలెనని కూడఁ దలంపకుము. దానిని నీ కొఱకు మాత్రమే ప్రేమింపకుము. ప్రధానముగా నితరులకుఁ జేయు హితము కొఱకు దానిఁ బ్రేమింపుము.

దాని నీవు బంగారమునకుఁ గొనఁజాలవు. మాణిక్యములకు నది లేని లక్షణముల నీవు కొనఁజాలవు. వచ్చుచున్న క్షణముల నన్నింటిని నీవు సౌశీల్యముతో సాగఁజేయుము. 'పుట్టకుండినఁజాల మేలయియుండెడి' దని తలంపకుము. పుట్టిన నే నిఁక శీఘ్రముగఁ జచ్చుట మేలని తలపోయకుము. సృష్టికర్తనుగూర్చి 'నేను లేకుండినఁ జెడుగనునది యుండునా' యని పనవకుము.

మంచి నీ శక్తియం దున్నది. దాని నీ వార్జించుకొన లేకుండుటే చెడుగగును. నీవట్లు నిజముగాఁ బ్రశ్నింతువేని, అదిగో, ఆలోచించిచూడు అది నీ యవ్యక్తత నెఱిఁగించుచున్నది.

ఎఱను మ్రింగునపు డందు గాలము గలదని తెలిసియున్నచోఁ జేప దానిఁ జేరఁబోవునా? వల తన యెదుట నుండు టెఱిఁగిన సింహమందుఁ జిక్కునా? పాంచభౌతికమగు దేహముతో నాత్మకూడఁబంచత్వము గాంచు నేని మానవుఁడు మనఁగోరఁడు. కరుణానిధియగు నీశ్వరుఁడు మనుష్యుని సృజించికూడ నుండఁడు. కావున నీవు పిమ్మటఁ గూడ బ్రతుకుదువని తెలిసి కొనుము.

తాను జూచుటకుఁబూర్వమే పంజరమున బంధింపఁబడినపక్షి పంజరపుఁ గంతలందుఁ దనమేని మాంసభాగమును జొప్పించి తప్పించుకొనఁ గొట్టికొనుట యెంత వృథాయాసమో, నీవును నీ వుండు స్థితి నుండి తప్పించు కొనఁజూచు టంతవృథాయాసమే యగును. నీ కాస్థితి విధికృతమని యెఱుఁ గుము. దానితోఁ దని వందుము.

దాని మార్గము లొకవేళ వికృతము లయినను బాధకములు గావు. అన్నిటిని నీవు తిన్నఁగా దిద్దుకొనుము. అణుమాత్రమైనను జెడుగెప్పు డగపడెనో అప్పుడే గొప్పయపాయము రానున్నదని యనుమానింపుము. గడ్డియే పడుక యయినచో నీవు కడు సుఖముగ నిద్రింతువు. గొజ్జఁగిపూవుల సెజ్జ యయ్యేనేని కంటకములున్నవి. కడు జాగ్రత్తతో నుండవలెను జుమా!

మంచిచావు చెడ్డబ్రతుకుకంటె మేలు; కాన యెంత గాలము నీవు జీవింపవలెనో యంతగాలము బ్రదుకఁ బ్రయత్నించుము. కాని, యెన్నాళ్లు బ్రదుకఁగలనని నీ వెన్నుకొనెదవో యన్నాళ్లును బ్రదుకవలయునని యాయాసపడకుము.

చావక నీవు జీవించియుండుట యితరుల కెక్కువ ప్రయోజనకరమైనచోఁ బ్రాణములను బరిరక్షించుకొనుట నీకుఁ బ్రధాన కర్తవ్యము.

బుద్ధిహీనులతోపాటు నాకు జీవితకాలము చాలదని గోలు పెట్టకుము; నీ కా కాలముతోపాటు కష్టములు గూడఁ దగ్గియే యున్నవని తలఁచి చూచుకొనుము.

నీ జీవితకాలముననుండి పనికిమాలినపట్టులను దీసి వేసి చూడుము. ఏమి మిగిలియున్నదో యెన్నుము. శైశవమును దీసివేయుము. రెండవ శైశవ మనఁదగిన వార్ధకమును దీసివేయుము. నిద్రవేళలను దీసివేయుము.

ఆలోచనము లేకుండఁ గడపు తడవులను దీసివేయుము. వ్యాధులతో నుండునవస్థలఁ దీసివేయుము. పూర్ణాయుష్య వంతుఁడవేయగుదువను కొనుము. అయినను నీవు నిజముగ నిఁక నక్కఱకువచ్చు ఋతువుల నెన్నింటి లెక్కింపఁగలవు?

నీకుఁ బ్రాణమును వరముగ దానముచేసిన దాత దాని నింకను నెక్కువ వరముగఁ జేయుటకై జీవితకాలమును దక్కువ చేసియున్నాఁడు. ఎక్కువ కాలము జీవించియుండ వలయునని కోరెదవేని అది దేనికి? ఎక్కువ దుష్కార్యములఁ జేయుటకా? నీ యాయుఃప్రమాణమును దగ్గించినవాఁడు నీ వాకొలఁదికాలమునఁ జేయు సత్కార్యముల ఫలమును జూచి సంతృప్తిని జెందఁడా?

దుఃఖమయుఁడా? ఏ కోర్కితో నోయి, నీవు నీ యాయుఃపరిమాణమును మించి యధికకాలము జీవింపఁ గోరునది? ఊపిరి విడుచుటకా?సాపాటు చేయుటకా? లేక ప్రపంచమును బరికించుటకా? ఇవి యన్నియు నీవు పలుమాఱు చేసినవే కావా? ఆడినయాటయె యాడుట, పాడినపాటయె పాడుట విసుగును గొల్పదా? చేసిన దానినే మరలఁ జేయుచుండుట రోఁతగాదా?

సౌశీల్యమందు జ్ఞానమందు నభివృద్ధి నందఁగోరుదువా? అయ్యో! నీ వేమి యందఁగలవు? అందించువా రెవరు? నీ కున్న కొంచెమును గూడఁ గొఱకురాకుండఁ జేసికొనుచుందువు. కాన భగవంతుఁడింకను గొప్పగా జీవిత మీయలే దని గునియకుము.

జ్ఞానలోపము నకుఁ బరితపింపవలదు. అది నీతో శ్మశానమునఁ జల్లనాఱవలసినదే. ఇహమున సద్వర్తనము గల్గియుండుము. పరమున జ్ఞానాధిక్యమును బడయఁ గల్గుదువు.

కాకిని జూచి "నాకంటె నేడురెట్లెక్కువకాలము నీ వేల జీవింపవలయు?" ననియుఁ లేడిని జూచి "బహుపురుషాంతరములదాఁక నీ వేల బ్రదుక వలయు?" ననియు నడుగకుము. జీవితమును దుర్వినియోగ పఱుచుటలో

నీతో వీనికిఁ బోలికి గలదా? అవి నీవలె దుండగములఁ జేయునా? క్రూరతగలవా? కృతఘ్నములా? ఇటు వినుము. అపరాధములేని జీవిక, కాపట్యములేని నడవడి, చిరజీవితమునకుఁ దెరువులని పయివాని యొద్దనుండి నేర్చుకొనుము.

పయి జంతువులకంటె బాగుగా జీవితమును గడపఁగలవా? అట్లేని యల్పజీవితమే చాలును.

తన నిరంకుశత్వము నిమిషమైనను నెగ్గదని యెఱిఁగియుండియు లోకము నెల్ల లోఁకువగాఁ జేసికొని మణఁచిపట్ట నుద్రేకించుచుండు మానవుఁడు చావే లేని యెడల నిఁక నేమిచేయ సాహసింపఁడు?

నీకుఁ గావలసినంత జీవితకాలమున్నది. కాని, నీవు దాని గణిపంవు. మానవుఁడా! నీకు జీవితకాలము తక్కువగా లేదు. నీవు దాని విచ్చలవిడిగా వెచ్చ పెట్టుదువు. నీకావశ్యకమయిన దానికంటె నధికముగానున్న ట్లాకాలమును దూరాలోచనలేక పారఁబోసికొందువు. చివర కదియెల్ల సేకరమై నాకు రాలేదని శోకింతువు.

భాగ్యవంతునిఁజేయునది సక్రమమైన, మితమైన వ్యయముగాని, సంప దతిశయముగాదు.

జ్ఞానవంతుఁడు చిన్ననాఁడె జీవితవిశేషమున కుపక్రమించును. అజ్ఞానుఁ డెప్పుడు నారంభించుచునే యుండును.

అంతమున భాగ్య మనుభవింతు ననుకొని ప్రారంభముననే ధనము కొఱకు బాధపడకుము. ప్రస్తుతము ననుభవింపనివాఁడు తనకుఁ గల దానినెల్లఁ దొలఁగఁ ద్రోసికొనువాఁడగును. సైనికునకు దానిరాక దెలియరాకమునుపే తూఁపుహృదమున దూరిపోవునట్లు జనునకుఁ దన బ్రదుకు తెలియరాక మునుపే మృత్యువు వచ్చి ముట్టికొనును.

మనుష్యుఁడింకను జీవితము నే మని కోరవలెను? ఊపిరి పీల్చుటేమని కోరవలెను?

అది తప్పిదములస్థానము గాదా! దురుద్రేకముల పరంపర గాదా! అన్ని ప్రక్కలను లంకెలుగొనియున్న చెడుగుల గుంపును వెంబడించుట కాదా! అది యారంభమున నజ్ఞానాత్మకము. నడుమను గష్టఘటితము. తుదను దుఃఖమయము.

ఒక యల మఱియొక యలను ద్రోసికొనుచు వచ్చి యందుఁ జేరునట్లు మానవజీవితమున నొకచెడుగు మఱియొక చెడుగును వెన్నడించి యెక్కువగు చుండును. మహత్తైన వర్తమానము కించిత్తైన గతమును మ్రింగివేయును. మన దిగుళ్లు తఱచుగా వాస్తవములయిన చెడుగులగును. మన యాసాసలు దఱచుగా నసంభావ్యము లగును.

నశ్వరులట్లు ఏ నిమిషమేమో యని దిగులంది నొగులుచు, శాశ్వతులట్లు ఆసాసలఁబడి గాసి చెందుచు బుద్ధిహీను లుందురు.

జీవితమందు మనతో నే భాగమెక్కువగా నుండఁగోరఁదగును? బాల్యమా? యౌవనమా? యౌవనమును గోరి దుడుకుఁదనమును, జెడునడతను, దుస్సాహసమును బ్రేమింతమా? లేక ముదుసలితనమా యధికముగాఁ గోరఁ దగినది? ముదుసలితనమును గోరి వ్యాధులఁ బ్రేమింతువా?

నరసినవెంద్రుకలు మరియాదఁ దెచ్చునని, వార్ధకము గౌరవము నిచ్చునని, కొందఱందరు. అటుకాదు సౌశీల్యమే వయస్సంపదకు వన్నెఁదెచ్చును. అదిలేని వయస్సు ముఖమున కధికముగా నాత్మమీఁదఁగూడ ముడుతలను దెచ్చును.

దుండగముల నేవగించునని ముదుసలితన మాదరింపఁ బడుచున్నదా? దుష్కృత్యములను, భోగవాంఛలను వయస్సేవగించుట కాక దుష్కృత్యములు భోగవాంఛయు వయస్సునే యేవగించుట యగునప్పు డీ యూహ యెట్లు యుక్త మగును?

యౌవనమున సౌశీల్యము గలిగియుండుము. వార్ధకమున గారవింపఁ బడుదువు.

నీతినిధి

ద్వితీయాధ్యాయము

మనుష్యుని మనోవికారములు వాని దోషములు

1. గర్వము

మానవుని హృదయమునఁ జాంచల్యము చాల హెచ్చుగా నున్నది. ఉచ్ఛృంఖలత దానిని దన వేడుకచొప్పున నాడించును. నిరాశ దానిని సుదూరము గొంపోవును. భయము “సర్వస్వతంత్రమై యిక్కడ బలసియున్నా” నని యనును. కాని గర్వ మీ యన్నింటికంటె ఘనమై యుండును.

మనుష్యస్థితికిఁ గలుగు కష్టములఁ జూచి దుఃఖింపకుము. అంతకంటె, దాని తప్పిదములఁ జూచి నవ్వుటమంచిది. గర్వోద్రిక్తునిచేతులలో జీవిత మనునది స్వప్నచ్ఛాయవలె సాగిపోవును.

మానవులలో నెంతేని మన్ననగన్నవాఁడు గానిమ్ము, వీరుఁడు గానిమ్ము, ఎవ్వఁ డయినను వాఁ డీ గర్వపుబుద్బుదము గాక మఱెవ్వఁడు?

జనసామాన్యము చంచల ప్రకృతిగలది; కృతజ్ఞతలేనిది, జ్ఞానవంతుఁడజ్ఞానుల కొఱకేల హానినందవలెను?

ఇప్పటిపనులయెడ జాగ్రత్తమాని గొప్పదనమందినప్పుడు చేయవలసిన పనుల చొప్పును గూర్చి యోజించువాఁడు ఇతరులకుఁ దన యాహారమునిచ్చి ముచ్చ ముడిఁగి యింట నుండువాని వంటివాఁడగును.

ఇప్పటిదశలో నీకుఁ దగిన చొప్పున నడుచుకొనుము. గొప్పదశవచ్చినప్పుడు మెప్పుఁబడయఁ గల్గుదువు.

గర్వమునుమించి కన్నుగప్పునదియు, డెందమును బొందలోఁ బడఁద్రోయు నదియు వేఱొకటి లేదు. నీవు నిన్నుఁజూచుకొనకున్నపు డితరులు నిన్నుఁ బూర్తిగా గుర్తింతురు.

తావిలేని పూవులబూకరింపుతోఁ గొఱమాలినగొప్పఁ దనమున బూరుగు

చెట్టున్నట్టు, యోగ్యతలేని భాగ్యముతోఁ బేర్మిలేని పెద్దఱికమునఁ గొందఱుందురు.

గర్వితుని హృదయము తృప్తినొందినట్లు కనుపడుచున్నను బాధనొందును. సంతోషముకంటె వానికి సంకటమే యెక్కువ.

వాని గజిబిజిపాటు వాని చితితోఁ జల్లారదు. తనయునికిని మించి యాతఁడూహలఁబాఱించును. తన యనంతరము త న్నితరులు పొగడుటకుఁ దా నప్పుడితరులఁ బొగడును. కాని తొలుత వాని కాసగొల్పినవాఁడు తుదకు మోసము చేయును.

తాను చనిపోయినపిమ్మటఁ దన్నుగూర్చి లోకులుచేయు పొగడ్తను వినఁ గుతూహలపడువాఁడు, తన యాత్మకుఁ గలవరము కలుగకుండుటకై తన యనంతరము స్వచ్ఛమైన వైధవ్యధర్మమునే సాగింపుమని భార్యను బలవంత పఱచువానివంటివాఁడు.

బ్రదికినంతకాలము నీవు ధర్మపథమును దప్పకుము. దానిఁగూర్చి యితరు లేమనుకొన్నను నీవు లక్ష్యపెట్టకుము. ప్రశంసాపాత్రము కాఁదగిన ప్రవర్తనతో నీవు పరితృప్తిఁ జెందుము. నీ వెనుకవచ్చు వా రాప్రశంసను విని పరితోషింతురు.

తాను సంతోషభరితుఁడుగ సాక్షాత్కరించి వారిని వీరిని దన స్థితినారయఁ గోరువాఁ డెట్టివాఁడనఁగా, తన రంగు దానెఱుంగని సీతాకోకచిలుకవంటి వాఁడు. తన మంచి వాసనఁ దానెఱుంగని మల్లెపూవువంటివాఁడు.

అట్టివాఁడు కన్నెత్తి యెవ్వరును గనుఁగొనరేని, ప్రపంచమున కంతకును బ్రవ్యక్తము గావేని నా స్వర్ణవస్త్రాభరణము లెందుకు? భాగ్యభరితములయిన నా భాండాగారము లెందు కనుకొనును; ఇస్సీ! ఇది సరికాదు. నీవు నీ భాగ్యమును బడుగువాండ్ర కిడుము. నీ యాహారము నాఁకలిగొన్నవాండ్ర కర్పింపుము. అట్లుచేసితివా నీవు పొగడ్తను బొందుదువు. దానికి నేను దగిన వాఁడననికూడఁ దెలిసికొందువు.

చెల్లఁదగని మాటలతో నెల్లవారిని ముఖస్తుతిచేయఁ బూనెదవేల? ఎదిరి

వాఁడు నిన్నిట్లే మరలఁ బ్రస్తుతించిన యెడల నేవపుట్టుట నీ వెఱుఁగుదువు. అనృత మాడుచున్నాఁడ నని యెఱిఁగియు వాఁడు నీ సంతోషమునకై యట్లు సాగించును. మనఃపూర్వకముగ నీవు మాటాడుము. అట్లేని నీవు హితోపదేశముల నందుకొందువు.

అవలిప్తుఁడగువాఁడాత్మస్తుతియం దానందము గలిగి యుండును. కాని యితరులు తన్నుఁ గూర్చి తాఁ జేసికొను ప్రశంసల విననొల్లరని యెఱుఁ గఁడు.

ప్రశంస్యమయినది తానేదైనఁ జేసియుండిన, శ్లాఘ్యమైనది తానేదైనఁ గలిగి యుండిన, నాతఁడు దాని వెల్లడించుకొనుటకు వేడుక పడుచుండును. దానిఁ దానితరులు ప్రశంసించుచుండ విని గర్వించుచుండును. అట్టి వాని కోరిక తన్నుఁ దానే యోడించుకొనును.

అదిగో వాఁ డాపనిఁజేసినాఁడు; అదిగో వాని కా యాధిక్య మున్నది. అని యన్యులెవరు ననరు. కాని చూడు; వాఁడు దానిఁ గూర్చి యెంత గర్వియై యున్నాఁడో అని మాత్ర మనుకొందురు.

మానవుని హృదయము ఏకకాలమం దనేక విషయములపై కేఁగఁజాలదు. దాంభికవిషయములం దెవఁడు తన యాత్మను నిలుపుకొనునో వాఁడు తాత్త్విక విషయములను దలఁగఁ ద్రోసికొనును. దప్పిదీర్చు నూటబుగ్గలను దాఁటి యాతఁ డెండమావులకై యేఁగుచుండును.

2. చాంచల్యము

మనుజుఁడా! ప్రకృతి నిన్నుఁ జంచలత్వమునఁ బడఁ ద్రోచుచున్నది. కాఁబట్టి నీ వట్లుపడిపోకుండ నిలువరించుకొనుచుండుము.

జనని గర్భముననుండియే నీకుఁ జపలత కల్గినది. జనకుని హృదయమున నుండియేఁ నీకుఁ జాంచల్య మలవడినది. ఇఁక నెట్లు నీవు నిశ్చలుఁడవుగా నిలువఁగల్గుదువు?

నీకుఁ దనువునిచ్చినవారే దౌర్బల్యముఁ గూడ నిచ్చిరి. కాని నీకాత్మ నిచ్చిన

వాఁడు నిశ్చలసంకల్పమను నస్త్రమును గూడ నిచ్చినాఁడు. కాన దాని నీవుపయోగించు కొనుము. జ్ఞానవంతుఁడ వగుదువు. జ్ఞానివైతివా సౌఖ్యమందగలవు.

సమర్థుఁడు తన సామర్థ్యమును బ్రకటించుకొనుటలో జాగ్రత్త గలిగియుండ వలెను. ఏలయన, నా సామర్థ్య మెల్లప్పుడు స్వప్రయత్నముచే సమకూఱునది గాదు.

సాధారణముగా నా సామర్థ్యమునకుఁ బ్రేరకమేదో వెలుపటనుండి వెలయు చుండును గదా! మఱియు నది యనిశ్చితములనుండి జనించును గాదా! హఠాత్సంభవములనుండి యావిర్భవించుచుండును గాదా! ఇంక నితరముల నాశ్రయించి యేర్పడుచుండును గాదా? కావున సామర్థ్య శ్లాఘదైవికములగు పై వానికిఁ జెందఁదగినది.

కార్యములకు నీవు కడంగునప్పు డనిశ్చయమును నీ యండ నుండనీయకుము. వానిని నిర్వహించుటలో నిశ్చలతను బూనుము. అప్పుడు స్వభావములోని సంకటములు రెండు నీచే జయింపఁబడిన వగును.

పరస్పరవిరుద్ధము లయిన పనులఁ బ్రవర్తించుటకంటె మనస్సునకు దూషిత మేమున్నది? దృఢమగు బుద్ధికంటె నీ దోషము నణఁచునదేది? చంచలుఁడు తన మాఱుపాట్లను గమనించును గాని దాని కారణమును గనుఁగొనఁ జాలఁడు. తన నుండి తాను దలఁగిపోవుటను దెలిసికొనును గాని కారణమును గనుఁగొనఁజాలఁడు. న్యాయ్యములైన కార్యము లందు నీవు నైశ్చల్యము గలిగియుండుము. అప్పుడు జనులు నిన్నుఁ దప్పక నమ్ముదురు.

నీలో నీవు కర్తవ్యములఁ గూర్చి ధర్మనిర్ణయము కావించుకొనుము. నిర్ణయించు కొన్న ప్రకార మాకార్యముల నెఱవేర్పఁబూనుము. సముచితములయిన వని నీవు ముందుగా సంకల్పించుకొన్న కార్యములయెడ నించుకైనను జాంచల్యముఁ బూనకుము.

అట్లు చేసితివేని నీ యింద్రియములు నీకు లోపడియుండును. స్థిరచిత్తత నీ లోని మంచిని స్థిరపఱుచును. అది దురదృష్టమును నీ యింటనుండి గెంటి

వైచును. కలవరము, కార్యభంగము నీ గృహద్వారముఁ జేరవు.

అన్యునియెడ దోషమును నీ వనుమానింపకుము; చూచి నిశ్చయింపుము. నిశ్చయించిన దాని మరల మఱవకుము. శత్రుఁడయి యున్నవాఁడు మిత్రుఁ డుగా మాఱుట యసాధారణము. ఏలన, తన తప్పిదము నొప్పికొని త్రిప్పుకొను వాఁడెక్కడనో ఒక్కఁడుండును.

జీవితవిధానమునఁ గొన్ని సిద్ధాంతముల నేర్పఱుచుకొనని వాని కార్యములు చక్కఁగా గట్టెక్కుట యెట్లు? సహేతుకము కాని దేదియు సముచితముగ నుండదు.

చంచలుని యాత్మకు శాంతిలేదు. వానితోఁ గూడియుండు వాఁడుగూడ సుఖి కాఁబోఁడు.

వాని బ్రతుకుఁదెరు వొడుదుడుకై యుండును. వాని సంకల్పములు కొంకిరి బింకిరిగా నుండును. వాని హృదయము గాలివోలె నిటునటు మాఱుచుండును.

నిన్ను వాఁడు నేఁడు ప్రేమించును; ఱేపు ద్వేషించును. అదేమో? నేఁడేల ప్రేమించెనో ఱేపేల ద్వేషించునో వాఁడే యెఱుఁగఁడు. నేఁడు నీ మీఁద నిరంకుశాధికారము నెఱపును. ఱేపు నీకు దాసాను దాసుఁడుగ నుండును. అదియేమో? నిర్వాహశక్తి లేకున్నను గర్వముననుండు వాఁడు తనకు లోపడని వానికి దాసుఁడగుచుండును.

నేఁడు సమృద్ధితో నుండును. ఱేపు కడుపునిండఁ దినుటకే కష్టపడును. మితిదప్పి వర్తించువాని గతి యిట్టిదియే కదా!

పై క్షణమున రంగుమాఱి పచ్చికరంగుఁ రానుండఁగా, నూసరవిల్లి నల్లనిదని యెవ రనఁగలరు?

ఉత్తరక్షణమున నునికిమాఱి దుఃఖమంద నుండఁగా జపలుఁడిప్పుడు సంతోషి యని యెవరనఁగలరు?

అట్టివాని జీవితము స్వప్నచ్ఛాయవంటిదే కదా! వాఁడు ప్రొద్దుట సుఖముగా నిద్దుర లేచును. మధ్యాహ్నమున బాధతో మఱుగును. ఈ గడియలో నాతఁ

డొక దైవము. మఱుగడియలోఁ బురుగుకంటెను దక్కువవాఁడు. వాఁడొక క్షణము నవ్వును; మఱుక్షణమే యేడ్చును. ఇపుడు ప్రీతిచెందును. ఇంచుక సేపటికే రోఁతచెందును. మఱి కొంత సేపటికిఁ బ్రీతియగునో రోఁతయగునో యెఱుఁగఁడు.

సౌఖ్యముగాని దుఃఖముగాని వాని యందు స్థానము గలిగి యుండదు. ఉత్కృష్టతకుఁగాని నికృష్టతకుఁగాని వాని యం దర్హతలేదు. నవ్వునకుఁగాని, దుఃఖమునకుఁగాని వానికడఁ గారణము లేదు. కాన యవి యేవియు నాతని యెడ నిలుకడ గలిగియుండవు.

చపలమనస్కులసౌఖ్య మిసుకనేలపై మట్టము మీఁదఁ గట్టిన సౌధము వంటిది. గట్టిగా గాలివీచినచో దాని పునాదులు కొట్టుకొనిపోవును. ఇఁక నది యిడిసిపోవు ననుటలో నేమివింత!

తెకతెంపులేక తిన్ననై యున్న యా దారిలో నెదురై యేతెంచు గొప్ప యాకార మదియేమి? తలతో నాకసమును బాదములతో భూమిని బట్టియున్న యా రూపమెవ్వనిది?

ఆతని కనుబొమలమీఁద రాజప్రాభవమున్నది. ఆతని ఠీవియందు నైశ్చల్య మున్నది. ఆతని హృదయమున శాంత మున్నది.

దారిలో నాటంకము లున్నను నాతఁడు వాని వంకనైనఁ జూడఁడు. భూమ్యాకాశము లేకమై యాతని నడ్డగించినను నాతఁడు నడచును.

కొండలుగూడ నాతని ద్రొక్కిడికిఁ గ్రుంగిపోవును. కడలి నీరుగూడ నాతని యడుగుల క్రింద నాఱిపోవును.

పెద్దపులి యాతని మార్గమునడ్డగించినను నది వ్యర్థమగును. చిఱుత పులి మచ్చులు వానిని వెఱిపింపఁజాలవు.

ఆయుధపాణులయిన సైనికుల నడుమనుండి యాతఁడు నిబ్బరముతో నేఁగును. అపాయభయముల నాతఁడు పాయఁద్రోచును.

తుపానులు వాన భుజములఁదాఁకి హోరు మనును. కాని, వానిఁ గదలింపఁ

జాలవు. ఉఱుము లాతని తలచెంత నూరకమ్రోఁగును. మెఱుము లాతని ముఖకాంతిని గనుపఱుచుటకే యుపయోగపడును.

వానిపేరేమి? స్థితప్రజ్ఞుఁడు.

ఆతఁడు భూమిపై నెంతదూరము నుండియేని యేతెంచును. తన యెదుట సుదూరముననున్న సుఖమును జూచును. ఆతనికన్ను లోకాతీతమైన తన స్థిర స్థానమును దిలకించును.

అక్కడి కాతఁడు చక్కఁగా నడచును. ధీరతతో దానిఁ జేరుకొనును. నిత్యముగా నచ్చట నెలకొనును.

మనుజుఁడా! న్యాయ్యములైన విషయములందు నీ హృదయమును నాఁటుకొనఁజేయుము. పిమ్మట మార్పు లేకుండుటే మానవునకు మహనీయమయిన పొగడ్తయని తెలిసికొనుము.

3. దౌర్బల్యము

కొలంతలకుఁ బుట్టిన కుఱ్ఱఁడా! నరుడా! గర్వివి, చంచలుఁడవు నయిన నీవు దుర్బలుఁడవుగాక మఱెట్లుండఁ గలవు. చాంచల్యము దౌర్బల్యముతో సంబంధము గలది కాదా? దౌర్బల్యములేక గర్వముండఁ గలదా? ఒక దాని వలన యపాయములను దప్పించుకొంటివేని తక్కిన వాని వలని యపాయములను దప్పించుకొనఁగలవు.

నీవు దేనిలో మిక్కిలి దుర్బలుఁడవై యుంటివో యెఱుఁగుదువా? దేనిలో నేను మిక్కిలి బలిష్ఠుఁడను, మొనగాఁడను, ననుకొనుచు మురియుచున్నాఁడవో దానిలో; మఱియు, నీకున్నవస్తువుల నుంచుకొనుటలో, నీ చెంతనున్న మంచిని జెల్లించుకొనుటలో:–

నీ యాశలు కూడ దుర్బలములేకావా? నీవు కోరునదేదో అదియేని నీ వెఱుఁగుదువా? నీవు మిక్కిలి చిక్కులుపడి దేనికై దేవుళ్లాడెదవో అది చేకూఱినపై నీకుఁ దృప్తి యుండదు చూడు!

నీ యెదుటనుండు సంతోషము దాని రుచి నేల కోలుపోవును? ఉన్న సుఖము

కన్న రానున్న సుఖ మెక్కువరుచి గలదిగా నేల తోఁపవలెనో యెఱుఁగుము. ఉన్న సుఖములోని మేలు నీకు విసుగు గలిగించినది గావునను, రానున్న సుఖములోని కీడు నీకుఁ దెలియరాలేదు గావునను నట్లగుచున్నది.

సంతృప్తి నందియుండుటే గొప్ప సౌఖ్యమని తెలిసికొనుము.

నీ యంత నీవు నీకు వలసినది చేకూర్చుకోఁ గల్గినను సృష్టికర్త నీ వడుగఁ గల్గినదాని నంతను ననుగ్రహించినను సౌఖ్యము నీ సన్నిధిని నిలుచునా?

అయ్యో! నీ దౌర్బల్యము దాని కడ్డదగులుచున్నది. నీ చాంచల్యము దాని నిషేధించుచున్నది.

పరివర్తనమే నీకు సౌఖ్యస్థానీయముగా నున్నది కాని, స్థిరముగా నుండునదే స్థిరసౌఖ్యమును గూర్పఁగల్గును.

పోయిన తర్వాతఁ బొగులుదువు. ఉన్నప్పుడు వానినిఁ దిన్నఁగాఁ జూడవు.

పోయినదానికంటె నిప్పుడు వచ్చినది హెచ్చుసౌఖ్యము నీయదు. ఎందుకు దీనిఁ గోరితినా యని నీలో నీవే కుందుదువు. నీవు తప్పుచేయని చొప్పేదో దానిని జూడు.

కోరికలఁ గోరుటలోఁ గాక నీ కడ మఱియెందైన లోపము చూపట్టు చున్నదా? చూపట్టుచున్నది. ఇంకను ప్రాప్యములయిన విషయములు కలిగి యుండుటలోను, ప్రాప్తములయినచో వాని ననుభవించుటలోను,- మన మనుభవించుటవలన వస్తువులు వాని మంచిని గోల్పోవును.

ప్రపంచమున స్వాభావికముగా మధురములై యుండు వస్తువులు మన యనుభవమునఁ జేదుగా మాఱుచుండును. మన యానందమున నుండి బాధపుట్టును, మన సుఖమున నుండి దుఃఖము పుట్టును.

సుఖానుభవమున మితి గలిగియుండుము. అది నీ యొద్దఁ గుదురుకొని యుండును. నీ సంతోషము సద్ధేతుకముగా నుండనిమ్ము. అట్లున్న యెడల దాని యంతమునకుఁ జింతకానరాదు.

మోహోల్లాసములలో నిట్టూర్పులును గలసియుండును. కడపటి కా యుల్లాసములు నిన్ను సంతాపమునకు దుఃఖమునకుఁ బాల్పఱిచి చల్లారును.

ఎక్కువమక్కువపడి నీ వే వస్తువును సంపాదించితివో అదియే కొంతకు వెక్కసమై వికారముఁ బుట్టించును. అది నీ కొదవినపిదప విసుగు జనించును.

నీ మెప్పులో గౌరవముగూడఁ జొప్పింపుము. నీ స్నేహములో మోహమును గూడఁ గలుపుము. అట్లు చేసితివేని యంతమున నత్యాశ్చర్యకరమైన తృప్తినందె దవు.

భగవంతుఁడు చెడుగులేని మంచిని నీ కీయలేదు. కాని, యా చెడుగును దొలఁగించుటకుఁ దగు పరికరములఁగూడఁ బ్రసాదించియున్నాఁడు.

సంతోషము సంతాపరహితముగా లేనట్టే సంతాపము గూడ సంతోష రహితముగా లేదు.

సంతోషసంతాపములు విరుద్ధధర్మము లయినను కలసియే యున్నవి. దుఃఖమే మనకుఁ బలుమాఱు పరితోషము నిచ్చును. అపరిమితానందము తఱచుగాఁ గన్నీటితోఁ గలసియుండును.

బుద్ధిహీనుని చేతిలోనుండు సద్వస్తువులు వాని చెఱుపునకే తిరుగవచ్చును. జ్ఞానవంతులు చెడుగులోనుండి మంచికి మార్గములఁ గనుఁగొందురు. మనుష్యుఁడా! నీ స్వభావము మిక్కిలి ససిలేనిదై దుర్బలమై యున్నది. కావున నీవు సంపూర్ణముగా మంచితనముతోఁగాని సంపూర్ణముగాఁ జెడ్డతనముతోఁ గాని యుండఁజాలకున్నాఁడవు. సంపూర్ణముగాఁ జెడ్డవాఁడవు కాలేనందుకు సంతోషింపుము. సంప్రాప్తమయిన మంచికి సంతోషింపుము.

మంచి గుణములు వేర్వేఱు సమయములందు వేర్వేఱుగా సందర్భించు చుండును.

అసాధ్యములను సాధించుటకై యత్నింపకుము. అవి యెల్ల నే నందలేనయితి నని వందుఱకుము.

ఏకకాలమందే ధనవంతుని దాతృత్వమును దరిద్రుని తృప్తిని నీవంద గల్గుదువా?

వైధవ్యపు విశుద్ధిని జూపలేదని నీ ధర్మపత్నిని రోయఁజూతువా?

సత్యము ఒక్కటే. సంశయములు నీవు కలిగించుకొన్నవి. మంచి గుణములను గల్పించినవాఁడు. వాని యుత్కృష్టతను గూర్చి యెఱుకనుగూడ నీలోఁ బాదుకొల్పినాఁడు, నీ యంతరాత్మ యాజ్ఞాపించినట్లు నీవు చేసెదవేని పర్యవసాన మెప్పుడును బాగైయుండును.

4 జ్ఞానము చాలమి

అందమైనది, అపేక్షింపఁదగినది, మనుష్యుఁడు పొందఁ దగినవానిలోఁ బొగడఁదగినది యేది? అది జ్ఞానమే కదా! అయినను, ఆ జ్ఞానమును బొందు వారెవ్వరు?

రాజనీతి నిపుణుఁడు తన కది కలదనును. రాజు తద్విషయమునఁ బొగడ్త తనకుఁ జెల్లుననును. కాని వాని యేలుబడిలో నున్నవాఁడు తన యేలిక కది కలదని యనుకొనుచున్నాఁడా?

మానవునకుఁ జెడు గావశ్యకము గాదు. ఉండెనేని దాని నుపేక్షించుటయు మంచిదిగాదు. కాని, న్యాయము చూచి చూడనట్టుండుట వలన నెన్ని చెడుగులు నడచుచుండుట లేదు? రాజసభ శాసించుటచేఁ జెడుగులెన్నో చేయఁ బడుచున్నవి గదా!

పాలకుఁడా! నీవు జనసంఘము నాజ్ఞాపింపవలసినవాఁడవు. బుద్ధిగలిగి యుండుము. నీ యనుజ్ఞపై జరిగిన యకృత్య మొకటి, దండ్యులు పదుగురు నీచే దండితులు కాక తప్పించుకొనుట కంటె, చెడ్డదని యెఱుఁగుము.

నీ ప్రజలు బహుసంఖ్యాకు లయినప్పుడు, నీ సంతాన మభివృద్ధి చెందినప్పుడు వారి నపకార మెఱుఁగని యన్యప్రజలను జంపుటకుఁ బంపుచున్నావు కదా!

నీ కోరికకు గుఱియైన వస్తువు నీ వేవురుబిడ్డల జీవితముల నపేక్షించునదై నను నర్పించి దాని నందుకొందువు కావా! నిన్ను సృష్టించినవాఁడే వారిని గూడ సృష్టించె నన్న విషయమును నీవు విస్మరించుచున్నాఁడవు. నీ రక్తమెంత విలువ గలదో వారి రక్తము నంతవిలువగలదే యని నీ వారయ కున్నాఁ

డవు.

అ ప్రమాదమగు ధర్మాచరణ మసాధ్య మందువా?

అట్లంటివేని నీ మాటయే నిజముగా నిన్ను ఖండించుచున్నది.

దోషి యగువాఁడు తన తప్పు నొప్పుకొనుటకుఁగాను నీవు మాయ మాటలతో వానిపై మచ్చచల్లుచున్నాఁడవు. ఆతని యెడ నీ వపరాధివి కావా? నిన్ను వాఁడు శిక్షింపఁజాలఁడు గాన నీ తప్పిదము గొప్పది కాకపోవునా?

అనుమానముచే నొకనిపై దోష మారోపించి శిక్షించుచున్న నీవు తప్పులేనివారిఁ గూడ దండించుచుండవచ్చునన్న వెఱపును మదిలో నిలుపుకొన సాహసించె దవా?

వాని దండనవలన నీ కోరిక తీఱినదా? వాఁడపరాధము నంగీకరించుటచే నీ యాత్మ యానంద మందినదా?

నీ పఱుచుబాధ, చేసినతప్పు నొప్పుకొనునంత తేలికగాఁ, జేయనితప్పును గూడఁ నొప్పుకొనునట్లు వానిని వ్యధపఱుచును! నీవు పఱుచుబాధ నిర్దోషు లను దమ నిర్దోషిత్వమునుగూర్చి చింతించువారినిగాఁ జేయుచున్నది.

కారణములేకుండ శిక్షింపరాదని నీవు కారణముకొఱకై శిక్షకంటె హెచ్చుగా వానిని హింసించుచున్నాఁడవు. దోషము నొప్పించుటకుఁ చేయు ప్రయత్నములో నిర్దోషిని నీవు నాశమందించు చున్నాఁడవు.

సత్యము నేర్పఱింపఁజాలని గ్రుడ్డిమొగమా! భగవంతుఁడు నిన్ను నీ రాచ నడవడికి బదులు పలుకుమన్నప్పుడు నిర్దోషినొకని బాధించుటకంటె దోషులఁ బదివేవురను వదలి పుచ్చుట మేలని యెఱుఁగఁ గల్గుదువు.

నీవు న్యాయమును నిలువరింప నేరనివాఁడవై యుందువేని సత్యజ్ఞానము నెట్లు సంపాదింపఁగల్గుదువు?

సూర్యరశ్మి గ్రుడ్లగూబను గ్రుడ్డిదానిఁగాఁ జేయునట్లు సత్యదేవత తేజము నీ వామెసన్నిధి కేఁగునప్పుడు నీ కన్నులకు మిఱుమిట్లు గొల్పును.

ఆమె సింహాసనము నధిష్ఠింపఁగోరుదువేని తొల్త నామె పాదపీఠమునకుఁ బ్రణమిల్లుము. ఆమెను దెలిసికొనఁ గోరితివేని తొలుత నీ యజ్ఞానమును దెలిసికొనుము.

ఆణిముత్తెములు, నాణెములు, వజ్రములు, రవ్వలు నామె సింహాసనము చెంతనుండు చెత్తచెదారములు. నిబ్బరముతో నామె కొలువుగోరుము.

ఆమె కొలువుకూటము నెంతో పరిశ్రమించి నడచినఁగాని పడయరాదు. తత్పరతయను మార్గదర్శకుఁడు నీ కామె దర్శనముఁ గూర్పఁగలఁడు.

బడల్పడి నీ వాబాటను నడుమ విడనాడకుము. కడచన్న పిదప నీ కష్టమెల్ల నుల్లాసకరమేయగును.

సత్యము ద్వేషమును బుట్టించును గాన దాని నేను విడుతును గాకయని నీలో నీవనుకొనకుము. మిథ్యమిత్రులను సమకూర్చును గాన దానినే నాదరింతును గాక యని కూడ ననుకొనకుము.

సత్యముచే నేర్పడ్డవిరోధులు మోసముచే నేర్పడ్డ స్నేహితులకంటె నెక్కువవారు కారా?

స్వాభావికముగా మనుష్యుఁడు సత్యమును గోరును. కాని యది తన యెదుట నున్నప్పుడు గుర్తింపఁజాలఁడు. బలాత్కారమున నది యెదుర్కొన్నప్పుడు దానిపైఁ గినుకఁ బూనును. అది సత్యము దోషము గాదు. మానవుని దౌర్బల్యము దాని తేజమును నిబ్బరింపఁజాలదు.

నీ యసమర్థత నింతకంటె స్పష్టముగాఁ జూచెదవా? నీ విశ్వాసముల విషయమున నిన్ను నీవ చూచుకొనుము. మతనియమము లెందు కొఱకేర్పడి నవి? నీ లోపములఁ జూపుటకు; భగవంతుని వలన నీకు మేలు కలుగఁ గలదని తెలుపుటకు. అంతేకాదా?

నీవు మృత్యుల్యుఁడవని నీ కది తెలుపుటలేదా? పశ్చాత్తాపము నరయుము. అది దౌర్బల్యముపై నాధారపడినదికాదా.

నీవు ఒట్టుపెట్టుకొన్నప్పుడు, మోసగింపనని శపథముచేసినప్పుడు, చూడుము; అది నీ ముఖముపై నవమానము నావరింపఁ జేయుచున్నది. వానిఁగొన్న వాని ముఖమును గూడ నవమాన పఱుచుచున్నది. న్యాయ్యవర్తన మలవఱుచు కొనుము. అప్పుడు పశ్చాత్తాపమునకుఁ బాల్పడవు.

సత్యవర్తనము సాగింపుము. అప్పుడు ఒట్లనావశ్యకములగును. పొరఁబాటు లెవ్వరికిని గలుగకతప్పవు. కొలఁది పొరఁబాట్లకు నేనేల పాల్పడవలెనని గొప్ప తప్పిదము గూలకుము.

తన తప్పుల నోపికతో వినువాఁ డితరులను ధైర్యముతో మందలించును.

సహేతుకముగా నడ్డుపలుకువాఁ డోటమికల్గనేని దాని నిబ్బరముతో నొందఁ గలఁడు.

ని న్నెవరయినను సంశయముతోఁ జూతురేని నిర్భయముగా వారికి బదులు పలుకుము.

తప్పుచేసినవానిఁగాక సంశయము మఱెవ్వరిని జంకించును.

మృదుహృదయుఁడు ప్రార్థనములచే మెత్తఁబడును; శఠ హృదయుఁడు ప్రార్థనములచే మఱింత హఠముఁ బూనును.

నీ యందుఁగల యజ్ఞానము నిన్నితరులు చెప్ప దాని వినిపించును. అట్లు కాకున్నను, న్యాయము జరుగుటకు నీవితరులు చెప్పుదాని నోర్మితో వినవలయును.

5. దౌర్భాగ్యము

మంచియందుఁ జాలనితనముతో, బేలఁదనముతో, సౌఖ్యమందుఁ జాంచల్యముతో, దౌర్బల్యముతో వర్తించు మానవుఁడా! నీ వొక విషయమున మాత్రము, సమర్థుఁడవు, స్థిరుఁడవునై యున్నాఁడవు. అదేది యనఁగా దౌర్భాగ్యము.

అది నీ జీవిత లక్షణము. అది నీ స్వభావపు విశేషధర్మము. నీవు లేక యది

యుండదు. చూడుము దానికి నీ కామక్రోధమదమాత్సర్యాదులే జనన కారణము.

వీని నీ కిచ్చినవాఁడు వీనిని లోఁగొనుటకు నీకు బుద్ధిని గూడ నిచ్చియు న్నాఁడు.

బుద్ధినుపయోగింపుము. వాని నణగఁ ద్రొక్కివేయఁగల్గుదువు.

నీకీ ప్రపంచమునందుఁ బ్రవేశ మవమానముతోఁ గూడినది కాదా? నీకు వినాశనము మానవీయము కాదా?

మానవులు మరణసాధనములను, బంగారుతోను, మణులతోను, అలంకరించి, నగలకంటె నెక్కువగా నుదుపులపై ధరింతురు.

మనుష్యునిఁబుట్టించువాని కెట్టి గౌరవమును లేదు. పదుగురఁ జంపు వానికిఁ బ్రఖ్యాతికలదు.

అయినను నిది తప్పిదమని నీవెఱుఁగవలయును. పరిపాటి సత్యగౌరవమును జంపఁజాలదు. న్యాయము నొకమనుజుని యభిప్రాయము నాశపఱుపఁ జాలదు. గౌరవము, అవమానము, సరియగు స్థానములందు స్థాపితములు గాకున్నవి.

మనుష్యుడు కలుగుట కొకటే మార్గము కలదు. కాని వాని వినాశనమున కనేకమార్గము లున్నవి.

మనుష్యనకుఁబుట్టుక నిచ్చినవానికిఁ బొగడ్త, గౌరము కలుగదుగాని, పలువుర మనుష్యులఁ జంపినవానికి జయములు, రాజ్యములు, పారితోషికముగాఁ బ్రాప్తములగును.

నిజమునకు, ఎందఱు బిడ్డలుందురో అన్ని సుఖములున్నవి. ఒకని ప్రాణములఁ దీసినవాఁడు తన ప్రాణములవల్ల సుఖింపఁజాలఁడు.

కొడుకు పుట్టినందుకుఁ గోపించి తండ్రి చచ్చినందుకుఁ దనియునట్టి వాఁడు రక్కసిగాఁడనిపించుకోఁడా?

మనుష్యనకుఁజెడుగు కావలసినంతగలదు. దానిఁగూర్చి దుఃఖించువాఁడింకను

దానిఁ ద్రవ్వితండము గావించు కొనుచున్నాఁడు.

మానవునకుఁగల దోషములలోనికెల్ల దుఃఖము గొప్ప దోషము. నీవు చాల దుఃఖ మనుభవించుటకుఁ బుట్టియున్నాఁడవు. ఆ దుఃఖమును దుర్బుద్ధిచే నీవు పెంపొందించుకొనకుము.

దుఃఖము నీకు నిత్యము. అది నిన్నెప్పుడు నంటియుండును. సంతోషము నీకు నైమిత్తికము. అది నీ యొద్ది కపుడప్పుడు వచ్చును. వివేచన శక్తిని బాగుగా నీవు వినియోగించితివేని దుఃఖము తొలఁగిపోవును. బుద్ధిగలవాఁ డవై యుందువేని సంతోషము నిన్ను దర్శించి చాలఁగాలము నీ సన్నిధి నుండును.

నీ మేనిలోని ప్రతిభాగమును దుఃఖమునకుఁ ద్రోవలైయున్నవి. కాని యానంద మార్గములు మాత్రమల్పములై యిరుకై యున్నవి.

సౌఖ్యములపు డప్పుడొక్కటొక్కటిగానే సంపాదింపఁ దగినవగును. దుఃఖము లొకప్పుడే దొంతరలు దొంతరలుగాఁ ద్రోసికొనివచ్చును.

తాటియాకుమంటతగులఁబడఁగానే పోయినట్లు సంతోష ప్రకాశముగూడఁ జక్కఁగాఁజూడకమునుపే చల్లారును.

దుఃఖము పలుమాఱువచ్చును. సంతోషము సకృత్తుగావచ్చును. కష్టము తనంతటఁ దానేవచ్చును. ఆనందము కొనితెచ్చుకోవలసినది. దుఃఖము తోడులేనిది. ఆనందము దుఃఖముతో దంటినది.

మంచియారోగ్యము కొంచెపుజబ్బంత స్పష్టముగా మనకు గోచరముగానట్లు గొప్పసంతోషము కొద్ది దుఃఖముకంటెఁ దక్కువగా మనలఁదాకును.

మనము బాధను బ్రేమింతుము. సంతోషమును దఱుచుగా జాఱవిడుతుము. ప్రయత్నించి దానిని బదయుదుమేని ప్రయత్నించునప్పటి శ్రమము, పడసిన తర్వాతి సౌఖ్యమును మించి యుండును.

వివేచన మనుజుని పని. తన స్థితినిగూర్చి తెలిసికొనుట మనుజునకుఁ బ్రధానధర్మము. కాని సంతోష కోలాహలమున మనుజుఁడు దనను దాను

దలంచుకొనం జాలకుండును. ఈశ్వరుండు మనకు కరుణతోనే దుఃఖమును గల్పించియున్నాండు.

రానున్న చెడుగును మానవుండు ముందుగానే తలపోయును. కడచి పోయిన తర్వాత దానిని జ్ఞప్తియందుంచుకొనును. దుఃఖమును గూర్చి యాలోచన దుఃఖముకంటె నెక్కువ బాధగలిగించునని యాతండాలోచింపండు.

కలిగిన పిమ్మటనే కష్టమునుగూర్చి చింతింపుము. అంతకు ముందు దానిం గూర్చి యాలోచింపకుము. అట్లుచేసితివేని బాధాధిక్యముననుండి నీవు బయల్పడుదువు.

ఎడరు రాకముందే యేడ్చువాండు, ఏడ్వందగినంతకంటె నెక్కువగా నేడ్చును. ఏమనంగా వాండేడ్చున కిష్టపడువాండు.

కత్తిని దన మీంది కెత్తినంగాని దుప్పి దుఃఖింపదు.

చావువచ్చుచున్న భయముచే మనుష్యుండు దానిని సమీపించుచున్నాండు. చావుకంటె జావుభయమే యెక్కువ బాధకము.

నీవు చేయు కార్యముల కెల్లప్పుడును బ్రత్యుత్తర మిచ్చుటకు సంసిద్ధుండవై యుండుము. ముందుగా విచారమున ముంపకుండ వచ్చెడు చావు మంచి చావు.

6. వివేకము

వివేకమును, బూనికిని, మహౌదార్యముతో భగవంతుండు మనుష్యునకిచ్చి నాండు. వానిని దుర్వినియోగము పాలుచేయనివాండు సుఖపడును.

పర్వతము పయినుండి దొరలివచ్చు ప్రవాహము తనతోం గొట్టుకొనివచ్చు దాని నంతను నాశముచేయునట్లు ప్రజాసామాన్యపుటభిప్రాయము విచారణము లేకుండం దనకు లొంగియుండువాని వివేకమును ముంచి వైచును.

నీవు నిర్మలహృదయముతో సత్యమని గ్రహించునది సత్యాభాసము కాకుండు నట్లు జాగ్రత్తతో నుండుము.

కంటికి నచ్చినమాత్రముననే నీవు తఱచుగా దేనినేని మెచ్చుకొనుచుందువు. జాగ్రత్తతో నుండుము. కనువేందుఱు గొనకుము. నీలో నీవే యోజించుకొని నిశ్చయించు కొనుము. నీ తప్పునకే నీవు బదులు చెప్పవలసిన వాండవు.

కార్యఫలము దాని యుక్తాయుక్తతలను వ్యక్తపఱచునని యనకుము. మానవుండు దైవికములకు లోనై యున్నాండు.

ఇతరుని యభిప్రాయము నీ యభిప్రాయమునకు భిన్నమైయున్నచో దానిని ద్వేషింపకుము. ఇరువురును బొరంబడి యుండంగూడదా?

బిరుదుబింకము లున్నంత మాత్రాన నొకనిం బొగడి అవి లేనంత మాత్రాన వేఱొకనిం దెగడుదువా? ఎవ్వండో యట కొమ్మునుబట్టి నీటిలో నున్న గొడ్డు తీరును గుర్తించెనట! మఱియు ముకుంద్రాటిని బట్టి లొట్టెపిట్ట గుణమును గుర్తించెనట!

విరోధిని జంపినప్పుడు కసితీర్చుకొంటినని తలంపకుము. వానిని దూరమునకుం ద్రోచితివి. వానికి శాంతిం జేకూర్చితివి, అపాయముచేయు విధానముల నన్నింటిని నీ వలన నుండి నీవ తీసి వైచుకొంటివి.

నీకుం గల దానిని దృణీకరించుకొని యితరునికిం గలదానిని ఘనముగాం గౌరవించుట సరికాదు. గుణవంతునియొద్దనున్న వస్తు వెక్కువ విలువగల దగును.

నీకు లోపడియున్న దన్న కారణమున నీ భార్యను నీచముగాం జూడకుము. తక్కువగా నెవతెను బ్రేమింతువో దానిని బెండ్లాడు మనువాని మాటను దృణీ కరింపుము. నీ సౌశీల్యమునెడం గల్గు నమ్మకము చేతనే యాపె నీకు లోపడెను. ఎక్కువగా నిన్నామె యెంచి నందుకుం దక్కువగా నీ వామెను దలంతువా?

పెండ్లివేళ నీవు న్యాయ్యమైన ప్రేమముతోం జూచి వరించి యుందువేని, యటుపై నీవామె నొకప్పుడనాదరముతోం జూచినను నామెను గోల్పోవుట నీకు శోకమును గూర్చును. తనకు భార్యగా నున్నంత మాత్రముననే కాంతను గుణవంతురాలని తలంచువాండు నీ కంటె హెచ్చుగా జ్ఞానము గలవాండు గాకున్నను సౌఖ్యముగలవాండగును.

నీ మిత్రుఁడు పొందిన నష్టమును వాఁడు కార్చుకన్నీటిని బట్టి లెక్కింపకుము. గొప్ప దుఃఖములను గన్నీరు మొదలగునవి కన్పఱుపఁజాలవు.

ఆడంబరముతోను బ్రోఁతతోను ఆచరింపఁబడు కార్యమును హెచ్చుగా నెన్నకుము. గొప్పవాఁడు గొప్పపనులను జేయుచుండును గాని యా చేఁతలలో బ్రోఁతలు మొరపములు నుండవు.

కీర్తి వినువానికి వింతగొల్పును. కాని యది కలవానికిఁ గడు ముదము గూర్చును.

మంచికార్యమొకఁడు చేయునప్పుడు దానికిఁ జెడ్డకారణముల నారయకుము. వాని హృదయమెట్టిదో నీ వెఱుఁగఁ జాలవు. దీనిచే నీ హృదయ మసూయా పూరితమని లోకమునకు వెల్లడియగును.

కాపట్యమునఁ దప్పిదమే కాని యెక్కువ దౌర్మార్గ్యము గానరాదు. సత్యవంతుఁడుగా నటించు టెంతసులువో సత్యవంతుఁడుగా నుండుటంత సులువు.

అపకారికిఁ బ్రత్యపకారము చేయటకుఁగాక యుపకారికిఁ బ్రత్యుపకారము చేయుటకే నీ వెక్కువగా సంసిద్ధుఁడవై యుండుము. అట్లుంటివేని కీళ్లగాక నీకు మేళ్లే మిక్కిలిగాఁగల్గును.

ద్వేషించుటకుఁగాక ప్రేమించుటకే నీవు సిద్ధపడియుండుము. అట్లుంటివేని శత్రులుగాక నీకు మిత్రులే మిక్కిలిగాఁ గల్గుదురు. శ్లాఘించుటకు నీవు సంసిద్ధుఁడవై యుండుము. ఆక్షేపించుటలో నాఁగి యాఁగి మెలఁగుము. అట్లు మెలఁగితివేని నీ సౌశీల్యము శ్లాఘ్యమగును. నీ చెడ్డతనమును గుర్తించుటలోశత్రువులు గ్రుడ్డివాండ్రగుదురు.

నీ వేదైన సత్కార్యము సల్పుదువేని దానిని వారును వీరును మెత్తురన్న కారణముచేఁ గాక సత్కార్యమన్న కారణముచేతనే సల్పుము.

నీ వేదైన దోషముననుండి తొలఁగిపోఁ జూతువేని దాననుండి వారును వీరును దూరుదురన్న కారణముచేఁగాక దోషమన్న కారణముచేతనే తొలఁగిపొమ్ము.

సత్యము మీఁది ప్రేమముచేతనే సత్యవంతుఁడవుగా నుండుము. అట్లేని నీ

వెల్లప్పుడు నట్లే యుండఁగలవు. ఇతర కారణములచే సత్యమును బాటించువాఁడిటు నటుఁ జలించుచుండును.

జ్ఞానహీనుని మెప్పుకంటె జ్ఞానవంతుని దెప్పు నీకు గోరఁదగినది. జ్ఞానవంతుఁడు నీవు త్రిప్పుకొందు వనియే నీ తప్పును దెప్పును, జ్ఞానహీనుఁడు తన్నుఁ బోలినవాఁడవని నిన్ను మెచ్చుకొనును.

అర్హతలేని పనిలో నడుగిడకుము. ఏలనఁగా నందధిక నైపుణ్యము గల వాఁడు నిన్నవమానించును.

ఎఱుకచాలనిదాని నొకనికిఁ గఱపఁ బోవకుము. అది యెఱిఁగి నిన్ను వాఁడవహేళనము చేయును.

నిన్ను బాధించినవానితో నెయ్యము చేయకుము. బాధపడినవాఁడు దానిని బాటింపకుండిననేమి? బాధపఱిచిన వాఁడెప్పుడును బాడుబుద్ధితోనే యుండును.

నీ వెవనినైన మిత్రునిగాఁ గూరుచుకొనఁ గోరెదవేని వానిమీఁద నెక్కువ భారము మోపకుము. భారము వానిని నీ యొద్దనుండి దూరీకరించును.

కొంచెము లాభముఁగోరితివా చెల్మి చెడవచ్చును. చాలఁగా లాభము గోరితివా శాత్రవమే రావచ్చును.

అయినను గృతఘ్నత మనుష్యభావమున లేదు. కోపముగూడ మనుష్య స్వభావమున మాపరానిదిగానుండదు. కాని మానవుఁడు తాను దీర్పఁ జాలనంత ప్రత్యుపకార స్థితిని స్మరింపనొల్లఁడు. తన వలన బాధపొందిన వారి యెదుటఁ దాను నిల్వ నొల్లఁడు. సిగ్గిలును.

పరుని మేలును జూచి పరితాపపడకుము. అహితునియాపదను జూచి యానందింపకుము. అట్లేని నీ వలె నితరులును బ్రవర్తించిన నీ కెట్లుండునో చూచుకొమ్ము.

అందఱ దయను నీవు పొందఁగోరెదవా? అందఱకు నీ యౌదార్యమందు నట్లుండనిమ్ము. అందఱదయను నీవు పొందుట కింతకంటె వేఱుపుంత లేదు.

ఒకవేళ నందఱదయను నీ వందఁజాలకపోయినను నందుట కర్హుఁడ నను సంతోషమున నుందువు.

7. అహంకారము

అహంకారము, నైచ్యము, విరుద్ధధర్మములట్లగపడుచున్నవి. అయినను మను జుఁడు ప్రతికూలముల ననుకూలపఱుపఁగలఁడు. జీవకోట్లలో నెల్ల మాన వుఁడే యహంకారి. అభవ్యుఁడు.

అహంకారము వివేకమునకు విరోధి. అది తప్పిదమునకు దాదివంటిది. దానికి మనుజునిలోని వివేచనాశక్తి యానుకూల్యముతో నుండును.

తన్నుఁగూర్చి యెక్కువగాఁగాని యితరునిఁగూర్చి తక్కువగాఁగాని తలఁపనివాఁ డెవ్వఁడు?

సృష్టికర్తగూడ మన యహంకారముననుండి తప్పి చనఁజాలఁడు. ఇఁక మనలో నౌకరి కొకర మెట్లు తప్పించుకొని యుండఁగలము.

మూఢభక్తి యెందులనుండి పుట్టుచున్నది? అసత్యమైన యారాధన మెందుల నుండి యేర్పడుచున్నది? మనకుఁ దెలిసికో నలవిగానిదానిఁగూర్చి చర్చించుట, అర్థముగాని దానిఁగూర్చి యర్థముచేసికో యత్నించుట, యనువాని యందు నుండి; మనోబలము మనకుఁ దక్కువగానున్నది. ఆ యున్న దానిని గూడ మనము సక్కఁగా సక్రమముగా నుపయోగించుకొనము.

ఈశ్వరునిమహనీయతను గనుఁగొనుటకు మన మెగురవలసినంత యెత్తుగా నెగురుటలేదు. మనము భగవద్విలాసములందు భయభక్తి ప్రేమ నిమగ్నులమై యుండునపుడు మనభావములకుఁ దగినంత బలము నిచ్చుటలేదు. అవి చక్కఁగా నెగురుటకుఁ దగిన ఱెక్కలఁ గట్టుటలేదు.

పాలకునిపనులకు విరుద్ధముగా గుసగుసలాడుటకుఁ గూడ భయపడువాఁడు పరమేశ్వరుని విధానములపై నేరమి మోపుటకు భయపడఁడు. ఆ మహా మహిముని మహనీయత మఱపునఁ దగులుటచే నాయన తీర్పులనే తాను మార్పఁజూచును.

తన రాజుపేరును దీరు దప్పి చెప్పుటకు ధైర్యము చాలనివాఁడు అఖిల లోకనాయకుని నొక యబద్ధమునకు సాక్షివై రమ్మని పిలుచుటకుఁ దలఁకఁడు.

న్యాయాధికారి యాజ్ఞకుఁ గిక్కురు మనకుండ లోఁగువాఁడు సర్వేశ్వరుని యాజ్ఞతో స్పర్థించును. ఆ సర్వేశ్వరుని నభ్యర్థనములచే లోపఱుచుకొన యత్నించును. వాగ్దానములచే వశపఱుచుకొనఁ జూచును. అంతేకాదు. మఱి తన మాట వినకపోయినచో మటమట లాడుటకుఁ గూడఁ బ్రయత్నించును.

మనుష్యుఁడా! నీ వెన్నోపాపములఁ జేయుచుంటివే! ఏల శిక్షింపఁబడకు న్నాఁడవో యెఱుఁగుదువా? ఈ కర్మఫలము గుడుచుట కిది కాదు సమయము.

ఉఱుములు గలిగించువానిని జక్కఁదిద్దుటకై, యుఱుములతోఁబోరాటము సల్పువాని పోలిక నుండకుము. బాధించునుగదాయని యీ భగవంతుని ప్రార్థనములందుఁ దూఱకుము. ఈ విషయమున నీ పిచ్చితనము నీ తలమీఁ దనే యున్నది. నీ పాపము నిన్నేకాని మఱెవ్వరిని బాధింపదు.

భగవంతునకుఁ దానిష్టుఁడనని భావించుమనుష్యుఁడు కృతజ్ఞతా బుద్ధిని జూపుట కేల ప్రాల్మాలవలెను. అట్టి భావన గలవాని కకృతజ్ఞత యెట్లన్వితమగును.

అఖండమైన యీ విశ్వమున మనుష్యుఁడొక యణుమాత్రము. అట్టివాఁడు తనకోసమె సృష్టియెల్ల నేర్పడినదనుకొనును. ప్రపంచమంతయును దన బాగుకోసమే ప్రవర్తిల్లుచున్న దనుకొనును.

నీటిలోని ప్రతిబింబములు వృక్షములు పట్టణములు నభోమండలము ఇత్యాదులెల్లఁ దన సంతోషార్థము సంచరించుచున్నవని బుద్ధిహీనుఁడు తలఁ చును. స్వాభావికముగా బ్రపంచము సాగుచుండగాఁ నదియెల్లఁ దన ముదమునకే యని మూర్ఖుఁడనుకొనును.

వెచ్చనకై సూర్యకిరణముల వేఁడుచు వాఁడు సూర్యుఁడు తనకై సృష్టింపఁబడె ననుకొనును. చల్లఁగా రాత్రివేళ చంద్రమండలమును దిలకించుచుఁ దన సంతోషమునకె చంద్రుఁడు సృష్టింపఁబడెనని వాఁడనుకొనును.

పొగరుచే మతిఁబోఁగొట్టుకొన్నవాఁడా! పగలఁబడకుము. అడఁకువ గలిగి యుండుము. ప్రపంచ ప్రవర్తనమునకు నీవేకాదు ప్రయోజనము. ఇది యెఱుఁగుము. ఋతువుల గతి నీ కోసమే నెగడలేదు;

మనుష్యజాతియే లేకపోయినఁ బ్రపంచమున నే మార్పును గలుగదు. సరియే కాని, నీవు ప్రపంచమునఁ బ్రసాదింపఁబడిన వారిలోఁ గోటాన కోట్లలో నొక్కఁడవు.

నిన్ను నీవ మిన్ను ముట్టించకొనకుము. అదిగో నీకు మీఁద దేవతలున్నారు. నీ తోడ భూమిమీఁద నివసించు నితర జీవులు నీకంటెఁ దక్కువవని తృణీకరింపకుము.

ఆ జీవులును నీ వలెనే దేవునిచే సృజింపఁబడెను.

దైవానుగ్రహముచే సౌఖ్యమందుచున్న నీవు, కావలెనని దైవము చేతనే సృజింపఁబడిన జీవులను గష్టపెట్టుటకుఁ గడంకవహించెదవా? ఆ కష్టములు నీకుఁ గలుగకుండ జాగ్రత్తతో నుండుము.

నీ వలెనే యవియు దైవమును గొలుచుచున్నవి. వానికి వానికిఁదగిన వర్తనముల నా యీశ్వరుఁడేర్పఱిచి యున్నాఁడు. వానిని రక్షించుభార మా యీశ్వరునిపై నున్నది. దానిని నీవు దప్పింతువా?

నీ వివేకమును లోకవివేకముపై కెక్కింపకుము. నీ యుద్దేశముతోఁ నేకీభవింపని వానినిఁ దప్పుతలఁపు వానినిగాఁ దలంపకుము;

ఇతరులకు నిదమిత్థమని యేదియేని యేర్పరింప నీ కెవ్వరధికారమిచ్చిరి? ప్రపంచముననుండి ప్రశస్తముల నెత్తుకొన్న వారెవ్వరు?

ఇప్పుడు ప్రశస్తములుగా నెన్నఁబడుచున్నవెన్నో పూర్వము పనికి మాలినవిగాఁ బరిత్యజింపఁబడెను. నేఁడు మానితములగుచున్నవి ఱేపవమానితములు గావచ్చును. దేనిని గూర్చి మనుజుఁడు స్థిరుఁడుగా నుండఁగలడు?

నీకుఁ దెలిసినంత వఱకు మంచిని జేయుము. సుఖపడుదువు. సౌశీల్యమే యీ లోకమున నీకు సంపాదింపఁ దగినది.

మన కెఱుఁగరానిదానిలో యుక్తాయుక్తత లొక విధముగానే యుండును.

ఇది యుక్త మిది యయుక్తమని యేర్పరించునది మన యహంకారమే తక్క నన్య మేది?

మన గ్రహణశక్తిని మీఱియున్న దానిని దేలికగా నమ్ముదుము. మన మెఱుఁగుదుమని యితరు లెన్నుటకై యెఱుఁగనిదానియందుఁ గూడ నమ్మక మున్నట్లు నటింతుము. ఇది పొరఁబాటును, బొగరును గాదా?

ఇదమిత్థమని గ్రుద్దిచెప్పఁబూను వాఁడెవ్వఁడో, ముక్కపట్టుతోఁ దన యభిప్రాయమునే చిక్కఁబట్టుకొని యుండువా డెవ్వఁడో యెఱుఁగుదువా? మతిమాలినవాఁడు. వాఁ డహంకారముగూడఁ గలిగి యుండును.

ప్రతి మనుష్యుఁడును దన యభిప్రాయమును బాలించుకొనుట కిష్టపడుచుండును. అహంకార భరితుఁడు మఱియు నందులకై కష్టపడును. వాఁడు తన యభినివేశమునఁ దన యాత్మను వంచించు కొనుటతోఁ దనివి నందక యితరులనుగూడఁ దన త్రోవకుఁ దెచ్చుకొనుటకు నిర్బంధించును.

సత్యము స్థాపితమగుట కేండ్లును బూండ్లును బట్టవు. దేనినేని నమ్మువారు పలువురు తమ నమ్మకములందు స్థిరతలేని వారై యుందురు.

తర్కము, తారతమ్యము లేర్పఱుపఁ జాలనప్పుడు వేర్వేఱు మానవాభిప్రాయములు సమబలముగలవి గానే యుండును.

నీతినిధి

తృతీయాధ్యాయము

స్వపరానర్థకములగు వ్యామోహములు

1. దురాశ

భాగ్యము మిక్కిలిగా బాధపడి ప్రయత్నించి పడయ వలసినంతయావశ్యకత గలదిగాదు కాన దానికై మనస్సునఁ గలవరపాటు తగదు.

మనుష్యునకుఁ మంచియును దానిని బొందఁగోరుటయు, దానిని బొందుటవలని సౌఖ్యమును నతని మనసులోనే యున్నవి. వానిని నీచ జనులను జూచి నేర్చుకొనఁదగదు. ప్రతివిషయమునుపయోగమును దానే పరీక్షించి చూచుకొనఁదగును. అప్పుడాతనిని దురాశయంటదు.

మితిమీఱిన ధనాపేక్షహృదయగతమైన విషమువంటిది. అది యంతర్గతమైన మంచి నంతను జెఱిచివైచును. ఆ విషములోఁ జేరినతోడనే సౌశీల్యము, న్యాయచింత, ప్రేమ, చచ్చిపోవును.

దురాశావిష్టుఁడు బంగారమునకుఁ దన బిడ్డల నమ్మును. తన తలిదండ్రులు చచ్చుచున్ననుగూడ వాఁడు ధనపుఁబెట్టె తలుపు తెఱవవెనుకాడును. ఆత్మసౌఖ్యమును గూడ నాతఁ డాసింపఁడు. ఆత్మసౌఖ్యమును బడయఁగోరియు నాతఁ డసౌఖ్యము నందును.

ధనము సంపాదించి దానిచే నిఁకముందు సౌఖ్యమందుదునని తలఁచి ధనార్జనార్థమై శాంతిసౌఖ్యములను గోల్పోవువాఁడు గృహము నలంకరింపవలె నని యలంకార సామగ్రిని గొనుటకుగా నింటి నమ్ముకొను వాని వంటివాఁ డగును.

దురాశావిష్టుని హృదయము నీరసించియుండును. భాగ్యమే మనుష్యునకుఁ బ్రధానముగా నపేక్షింపఁ దగినదియని తలంపనివాఁడు భాగ్యము కొఱకయి యితర ప్రయోజనముల నుజ్జగింపఁడు.

దారిద్ర్యము తనకు మహానర్థమని తలఁపనివాఁడు దానిని దొలఁగించుకొనుట కయి యనర్థాంతరముల నన్వేషింపఁడు. మతిమాలినవాఁడా! సౌశీల్యము

భాగ్యముకంటెఁ జాల మేలయినదికాదా! దారిద్ర్యముకంటెఁ బాపము నీచమయినది కాదా! ఆవశ్యకముల నార్జించుకొను శక్తి ప్రతిమనుష్యుని యందు నున్నది. ఇది యెఱిఁగి యింతతోఁ దృప్తి చెందియుండుము. ఆవశ్యకములకంటె నెక్కువ యపేక్షించువాఁడు, దుఃఖము లందుచుండఁగా నీవు నవ్వుచుండవచ్చును.

చూడరాని దని స్వాభావికముగా బంగార మెక్కడనో భూమిలోఁ బూడిచిపెట్టఁ బడియున్నది. వెండిమాత్రము పాదములకుఁ దగులునట్లు భూమి పయితట్టు ననే పెట్టఁబడి యున్నది. ఇట్లుండుట నీకు బంగారమును గూర్చి పర్యాలోచించు టయుఁ దగదని తెల్పుచున్నదిగదా!

దురాశ వేలకొలఁది దరిద్రులను భూమిలో బ్రుంగించును. వాండ్రు కఱకుగుండె గల యజమానుని కొఱకని భూమిని ద్రవ్వుదురు. అట్లు భూమి ద్రవ్వి బంగారుఁ గొని తెచ్చుట, వాండ్రను మఱింత బాధితులనుగాఁ జేయును. వాండ్ర నది యా జీవితము దాస్యమందే యణఁగఁద్రొక్కును.

బంగారు గనులుగల భూభాగము గొడ్డువోయి యుండును. భూమిలో నెచట బంగారమున్నదో అచ్చటి పై తట్టునఁ బచ్చికయు మొలవదు.

ఆ స్థలమునఁ బచ్చిక మొలవనట్లే, పైరుపచ్చలు కానరానట్లే, ఫలవృక్షములు లతలు వెలయనట్లే, భాగ్యమునే నిండించుకొనుచు దానినే పరికించుకొనుచు నుండువాని హృదయమునఁగూడ మంచితనము పుట్టదు. పెఱుగదు.

జ్ఞానవంతులకు ధనము సేవకుని వంటిది. మఱియు నది బుద్ధిహీనునికిఁ గ్రూరప్రభువు వంటిది.

దురాశావిష్టుఁడు భాగ్యమునకు సేవకుఁడు. అంతేకాని భాగ్యము వాని సేవ కుపయోగింపదు. వ్యాధితునికి జ్వరమువలె నాతనికి భాగ్యముండును. వాని నది కాల్చి ప్రేల్చి బాధించుచుండును. చచ్చువఱకు నట్లే సంకట పఱుచును. భాగ్య మెందఱ సౌశీల్యమును బాడుచేయుచుండుట లేదు! మంచికది యెందయినఁ దోడ్పడుచున్నదా?

అది మనుష్యాధముల దగ్గఱ నెక్కువగా నెలకొని యున్నది. ఎందుకోయి! దానిని జెంది ఘనత గాంతునను కొందువు?

విజ్ఞానసంపన్నులు పలువు రల్ప భాగ్యులేయగుట నీ వారయవా? భాగ్యము కంటె జ్ఞానము సౌఖ్యదాయకముగాదా! పలువురు నీచులు మిక్కిలి భాగ్యవంతులుగా నుండుట నెఱుఁగవా? వారి యవసానదశ యసందర్భముగా నుండుటలేదా?

బీదఱికము తన కనేకవస్తువులు కావలయుననును. దురాశ తన కేదియు వలదనును.

దురాశావిష్టుఁడెవరికిని నుపయోగపడఁడు. కాని వాఁడు తనకుఁ దానున్నంత క్రూరముగా నితరుల కుండఁడు.

భాగ్యము గల్గియుండుటకుఁ బాటుపడుము. ఔదార్యముతో దానిని వ్యయపఱుపుము.

ఇతరులకుఁ దాను సౌఖ్యము కలుగఁజేయునప్పుడు కాంచునంత సౌఖ్యమును మనుష్యుఁడిఁక నెప్పుడును గాంచఁ జాలఁడు.

2. మితిమీఱుట

ధనమును గూడఁబెట్టుటకంటె నెక్కువ తప్పిద మేమనఁగా దానిని బనికిమాలిన పనులకు వెచ్చపెట్టుట.

తన యావశ్యకములకుఁబైగా విచ్చలవిడిగా ధనమును వెచ్చపెట్టువాఁడు బీదవాని కర్హమయిన యధికారము నపహరించినవాఁడగును.

దుర్వ్యయముచేయువాఁడు సత్కార్యములఁ బ్రతిషేధించును, సుగుణార్జనము నాతఁడు కావింపఁడు. సుగుణములవలని బహుమానము మానవుని సౌఖ్యమే.

ధనియై మంచిగా నుండుట, దరిద్రుఁడై మంచిగానుండుట కంటెఁ జాలఁ గష్టసాధ్యము. ఐశ్వర్య మున్నప్పటికంటె దారిద్ర్యమున్నప్పుడే మనుష్యుఁడు తన్నుఁదాను జక్కఁగా నియమించుకోఁగలఁడు.

దరిద్రుఁడు మంచితనముఁబొందుట కొక సుగుణ మావశ్యకము. అది యోరిమి. ఔదార్యము, పరిమితత్త్వము. వివేకము మొదలయిన సుగుణములు లేకుండు ధనికుఁడు పాపిష్ఠుఁడు.

బీదవాఁడు తన భద్రమునే చూచికొనవలసియున్నాఁడు. వేనవేలు ప్రజల భద్రమును భాగ్యవంతుఁడు చూడవలసియున్నాఁడు.

వివేకముతో ధనము నిచ్చివేయువాఁడు తన బాధలఁగూడ నిచ్చివేయును. ధనమును దాఁచుకొని వృద్ధిచేయువాఁడు బాధలనుగూడ వృద్ధిచేసికొనును.

అతిథి దేనినేని కోరిన నది లేదనకుము. నీకుఁ గావలసినదే యగుఁగాక! నీ సోదరులవంటివారు కోరుదురేని యీయ ననఁగూడదు.

అప్రయోజనముగా లక్షలకొలఁది ధనము నింటిలో నణఁచియుంచు కొనుటకంటె దానిని సత్పాత్ర దానమున వినియోగించుటయం దెక్కువ యానందమున్నదని యెఱుఁగుము.

3. ప్రత్యపకారచింత

ప్రత్యపకారచింత మనోదౌర్బల్యమున వేరూని యున్నది. నీచవృత్తి గలవాండ్రు పిఱికివాండ్రు దీనికిఁ జాల నలవాటు పడియుందురు.

గర్హింపఁదగినవారిని గష్టపెట్టువాండ్రు పిఱికివాండ్రు గాక మఱెవ్వరు? దొంగతికము చేయువాండ్రను జంపువారు స్త్రీలుగాక మఱెవ్వరు?

ప్రత్యపకారము చేయుటకుఁ బూర్వమేదైన నపకారబాధ నందియుండవల యునుగదా! ఉన్నతులగువారి కపకారము దమ్ము బాధించుచున్నదని యెన్నుటే యసహ్యమగును. అపకారబాధను నీ వలక్ష్యము చేయఁజాలక పోవుటవలన నా బాధను నీకుఁ గలిగించినవాఁడు తనకుఁ దా నపకార బాధను గలిగించు కొన్నవాఁ డగును. నీచునితో నీవును సమానముగాఁ గ్రుద్దులాడఁజూచెదవా?

నీకుఁజెడుగు చేయనెంచిన వానిని దృణీకరింపుము. నీకుఁ జీకాకు గలిగింపఁ జూచువానిని సరకుగొనకుము.

ఇట్లు చేయుటవలన నీ శాంతిని నీవు కాపాడుకొనుటయే కాక ప్రత్యపకార నైచ్యమునకుఁ బాల్పడకయే యా యపకారిని బ్రత్యపకారశిక్షకుఁ బాల్పఱుపఁ గల్గుదువు.

తుపానులు, పిడుగులు, మేలితావుననున్న సూర్యుని, నక్షత్రములను నేమియుఁ జేయఁజాలక కీళ్పట్టుననున్న చెట్టులను గుట్టలను గూల్చునట్టుగా నపకారము

లున్నతాత్ముల నందఁజాలక యవి గలిగించు నీచులనే నవయించును. అధీరత ప్రత్యపకారచింతను బ్రేరేచును. ఉదారహృదయత యపకారమును దృణీకరించుటేకాక యది చేసిన వాని యాత్మకు మేలునుగూడఁ గూర్చును.

మనుష్యుఁడా! ప్రత్యపకారము చేయ నేల కోరెదవు? దానిచే నీ విరోధిని గష్టపఱుపఁదలఁచెదవా? నీవే కష్టపడుదువని యెఱుఁగుమోయి?

ప్రత్యపకారచింత యది కలవాని హృదయమును దునుకలు దునుకలుగాఁ గొఱికివైచును. ప్రత్యపకార మెవనికిఁ జేయఁబడునో వాఁడందుచే సుఖమందును.

తాను గలిగించుబాధ యాతని కధికమై యన్యాయ్యముగా నున్నది. కాఁబట్టి ప్రత్యపకారము తాను జేయవలసినది గాదు మొదటనే గాయము తగిలినవాని కింకొక బాధ యెక్కువయెందుకు? అదియుఁగాక మఱి యొకఁడు తనకుఁ గలిగించినబాధ యుండఁగా దానింకను దానికాధిక్యము గల్పించుకొనవలెనా?

ప్రత్యపకారము చేయువాఁడు తనకుఁ గలిగిన యపకారబాధతో నడఁగి యుండక యింకను నాతఁడితరుని శిక్షనుగూడఁ బై వైచుకొనును.

ఎవనికిఁదాను బాధగలిగింపఁగోరునో వాఁడు నవ్వుచుఁబోవును. ఆ నవ్వెందు కనఁగా నా బాధ గలిగింపఁ గోరినవాఁడు తన దుర్దశను బలపఱచు కొన్నాఁడు గదాయని.

ప్రత్యపకారచింత మిక్కిలి పాపిష్ఠమైనది. అది మిక్కిలి యపాయకరము. సాధారణముగా నెక్కడవేయ నుద్దేశించునో యక్కడ గొడ్డలి వ్రేటుపడదు. ఒకవేళ నది యెదురుదిరిగి తన మీఁదికే రావచ్చును.

అపకారికిఁ బ్రత్యపకారమొనర్చి బాధ గలిగింపవలయు ననుకొనువాఁడు తఱచుగాఁ దనకే నాశము తెచ్చుకొనును. పగవాని కన్నొకటి పోగొట్టఁ జూచువాఁడు తన రెండుగన్నులను బోఁగొట్టుకొనువాఁడగును.

తాను జేయఁబూనిన ప్రత్యపకారము జరుగకపోయినచో దుఃఖము కలుగును. జరిగినచో దానికి బదులు కలిగి పశ్చాత్తాప మేర్పడును.

న్యాయమువలని భయము వాని యాత్మశాంతిని జెఱుచును. అన్యాయము నగపడనీయక వానిని న్యాయమున నిలువరింప వలయు ననెడి కలవరము వాని స్నేహితుని న్యాయమును జెఱుచును.

నీ విరోధి చావు నీ కోపమును జల్లార్చునా? ఆతనికి జావు గలిగించి శాంతి గలిగించితివి. అది నీకు శాంతిని గలిగింపఁ గలదా?

దుష్కార్యము చేసినవానికి సంతాపము గలిగించు విధ మేదనఁగా వానిని జయించి చంపకుండ విడుచుట. చంపితివా నీ యుత్కృష్టత నాతఁడూహింపఁ జాలఁడు. ఆహా! యనఁజాలఁడు. మఱియు నీ కోపము బలమును గనుఁ గొన జాలఁడు.

ప్రత్యపకారమువలనఁ బ్రత్యపకారికి జయముండవలయును గదా! ఆతని కపకారమొనర్చిన వాఁడు తన యకృత్యపు బరువు నెఱుఁగవలయును. ఎఱిఁగి యట్లొనర్చినందులకు గ్రుళ్లి, కుమిలి పశ్చాత్తాప పడవలయును. ప్రత్యపకార చింత కోపముననుండి పుట్టుచున్నది. దానిని దృణీకరించుటవలననే జయము కల్గును.

తప్పుచేసినందులకై యొకనిని జంపవలయు ననెడిబుద్ధి పిఱికితనము వలనఁ బుట్టును. బ్రతికియున్నచోఁ దన్ను బాధింపఁగలఁడని భయముఁజెంది శత్రువు నాతఁడు చంపును.

చావు తగవును జల్లార్చును గాని కీర్తిలతను మరల మొలవకుండఁ ద్రుంచివైచును. చంపుట ధైర్యస్థైర్యములు గలవాని పనికాదు. దానివలన న్యాయము నాశమగును.

అపకారమునకుఁ బ్రత్యపకారము చేయుటంత లఘువయినదేదియు లేదు. కాని దాని మన్నించుటంతఘనమయి నదియు వేఱొకటిలేదు.

మనుజునకు గొప్పజయ మేదనఁ దనను దాను జయించుటే. తనకు జరిగిన యపకారము నపకారముగా నెంచక తృణీకరించువాఁ డాయపకారమును జరిపినవానికే మరలఁ ద్రిప్పిపుచ్చినవాఁడగును.

ప్రత్యపకారము చేయుటకయి యాలోచించు నపు డా యపకారము నీ మనస్సునకు వ్యధకల్గించిన దనుటలో నీకు నీవే సాక్షివయ్యెదవు.

దానిఁగూర్చి పలవించి నాకు బాధకలిగిన దని నీకు నీవే యొప్పుఁజెప్పు కొనెదవు. నీ విరోధిగర్వమున కిట్లు విజయోత్సాహమును గూడఁ గూర్పనెంచె దవా?

మనస్సు నొవ్వకున్నచో నది యపకారముగాదు. అపకారమును దృణీకరించు వాఁడు ప్రత్యపకార మేలచేయవలెను! నిందమోచుట నీ కవమానము గూర్చు ననుకొనెదవేని నీ శక్తి యంతకింక నధికముగా నున్నది సుమా! కాన దానిని నీవు జయింపఁగలవు.

మంచితలంపులు గలిగి పరులకు మంచిపనిఁజేయఁ జూచుచుందువేని నీ కెవ్వరును విరోధము చేయరు. అట్లు చేయుట యవమానకరముగాఁ దలఁ తురు. నీ యాత్మోన్నత్యము వారి నపకారము చేయకుండఁ జేయును.

తప్పెంత గొప్పదగునో దాని మన్నించుటయు నంతగొప్పదగును. ప్రత్యపకార మొనర్చుటయం దెంత న్యాయమున్నదో క్షమించుటయం దంతఘనత యున్నది.

నీ విషయమున న్యాయనిర్ణాయకుఁడుగా నుండుటకు నీ కధికారము గలదా? వివాదమం దభినివిష్టుఁడగువాఁడు తానెట్లు ధర్మనిర్ణేత కాఁగలఁడు?

ప్రత్యపకార బుద్ధిగలవానిని జూచి యందఱును భయపడుదురు. అందువలన నాతఁడందఱకు నసహ్యుఁడగును. అపకారసహనము గలవానిఁ జూచి యందఱు నానందింతురు. అందువలన నాతఁ డందఱకుఁ బ్రేమపాత్ర మగును. ఆతని కీర్తి శాశ్వతముగ నుండును. ప్రపంచప్రేమ మాతని వెంబడించును.

4. క్రూరత్వము, ఏవగింపు, అసూయ

ప్రత్యపకారచింత యసహ్యమయినది యని యెఱిఁగితిమి. ఇఁకఁ గ్రౌర్యమను నది యెట్టిదనఁగా నది ప్రత్యపకారచింతకుండు చెట్టఱికము నెల్లఁ జెందియుండుటే కాక పరునికిఁ గోపము గలిగించు తీరుగూడఁ గూడియున్నది.

మనుష్యులు తమ స్వభావమున నది లేదందురు. అది తమ హృదయముల

కొక క్రొత్తదైనట్టు గూడ దానిఁ గూర్చి సిగ్గిలుదురు. మనుష్యుల కది తగిన గుణము కాదని కూడ వారందురు.

ఇఁక నది యెందుండి యేర్పడుచున్నది? మనుష్యసంబంధము గలది యేది దానికి జననకారణము? భయముదాని తండ్రి; నివ్వెఱ దాని తల్లి.

వీరుఁడు తన్నెదిరించు విరోధిపయిఁ గత్తియెత్తును. కాని యా విరోధిలోఁబడె నేని తృప్తిచెందును.

భయపడువాని నణఁగఁద్రొక్కుట బాగుకాదు. తనకుఁ దక్కువగ నుండు వానిని నిందించుట సౌశీల్యము గాదు. గర్వితులై నిన్నుఁ దృణీకరించువారిని లొంగఁదీసి కొనుము. యోగ్యులు విధేయులు నగువారిని మన్నింపుము. అట్లుచేసితివా అతిశయితమైన జయము నందుదువు. ఇట్లు జయమందఁ దగిన శక్తిలేనివాఁడు, సౌశీల్యముతో దాని సాధింపఁజాలనివాఁడు, ఎదిరి వానిని లొంగఁదీసికొని యేలుటకు బదులు వానిని జంపును.

పరులనుజూచి భయపడువాఁడు పరులను గొట్టఁ బ్రయత్నించును. భయమునఁ గొట్టుకాడుచుందురు గావుననే క్రూర ప్రభువులు చండశాసను లయి దండనీతితో నుందురు.

బ్రదికియున్నప్పుడు జంతువు ముఖమునుగూడఁ బరికింప జాలదుగాని యూరఁగుక్క, ప్రాణము పోయిన పిదప దాని బడుగుదేహమును బ్రచ్చివైచును. బ్రదికియున్నంతదాఁక జంతువుఁ బైపడి తఱిమి వేఁటాడును గాని వేఁటకుక్క, ప్రాణముపోయిన పిదప దానిని మూ చూడనేని చూడదు.

దేశమున జరుగు ప్రజాయుద్ధములు మిక్కిలి బీభత్సమయినవి. ఏలనఁగా నందు యుద్ధముచేయువారు దురాలోచన పరులగు పిఱికిపందలు. వారు తమ చేయు హింసవలనఁ దమ దౌష్ట్యము బయలుపడకుండునని తలఁ తురు. మారణము వలనఁ దప్పిదము మాసిపోవునని వారి తలఁపు.

క్రౌర్యముతో నుండకుండుటకు నిన్ను నీవ నిర్లక్ష్యముపై నెలకొల్పుకొమ్ము. ఈర్ష్యను నీదరికిఁ జేరనీయకుము.

ఇతరుని నీ విరుదెఱఁగులఁజూడవచ్చును. ఆతఁడు నా కధికోపద్రవకారి

యని చూచుట యొకతెఱఁగు. అల్పోపద్రవకారియే యని చూచుట వేఱొక తెఱఁగు. అన్యుఁడు నా కల్పోపద్రవకారియే కాఁగలఁడన్న తెఱఁగున నీవు సూచితివేని వేనికిని నీవు చెఱుపుసేయవు.

మానవుఁడు తన శ్రేయమునకు మార్చుకొనఁజాలని దేమున్నది? తన్ను బాధించు వానిని గర్హించుటకంటెఁ దన బాధనుగూర్చి వానికి విన్నవించుటలో మేలున్నది. తానెవరి నభ్యర్థించునో వారు దానితో సమాధానపడుదురు. తా నెవనిఁ గూర్చి యేవగింపుచెందునో వాఁడు వాని ప్రాణమును దీయును.

నీ లాభము నెవఁడేని చెడఁగొట్టినచో నీవు వానిపైఁ గోపగింపకుము. అట్లుకోపగించి మనశ్శాంతిని గోల్పోవుట యా లాభపుఁ గోల్పోక కంటె నెక్కువగా శోచనీయమయినది.

ఉత్తరీయ మెత్తుకొని పోఁబడె నని యంతరీయమునుగూడ నవతలఁ బాఱవైతువా?

సమ్మానములు, బిరుదులు, పెండెములు సంపాదించుకొన్న వానిఁ జూచి నీ వీర్ష్యచెందినపుడు, వాని గౌరవనామధేయములును ఘనతయును నీకుఁ గోపము కలిగించి నపుడు అవి యాతని కెక్కడనుండి వచ్చెనో యెఱిఁగి కొనుము. ఏయే మార్గములవాని నాతఁడార్జించెనో యెఱిఁగికొనుము. అప్పుడు నీకుఁ గలిగిన యీర్ష్యయుఁ గోపమును గనికరముగ మాఱఁగలవు.

ఆ ధరకే నీ కా భాగ్యము లభింప నుండినప్పుడు నీవు తెలివిగలిగినవాఁడ వగుదువేని దానిని నిరసింతువు.

బిరుదుపెండెరములకు సాధకమయినది ముఖస్తుతియే. అధికారము నిచ్చువానికి దాసుఁడుగా నుండనివాఁ డధికారమును గొనఁజాలఁడు.

ఇతరుల స్వాతంత్ర్యమును జేత నుంచుకొనుటకయి నీ స్వాతంత్ర్యమును గోల్పో వుదువా? అట్లెవఁడేని చేయునేని వానిని జూచి నీ వసూయ చెందవచ్చునా? ఎవఁడు గాని వెల యీయకుండఁ బయివారి దగ్గఱ నుండి దేనినేని విలువఁ జాలఁడు. ఆ యిచ్చెడువెలవాఁడు కొనఁదలఁచిన వస్తువు చేయు విలువకంటె హెచ్చువచ్చునా? లోకాచారమును నీవు మార్పఁజాలవు. విలుచుట నీకు దక్కుచో వెలకూడ నీకు దక్కఁజాలదుగదా!

ఈప్సితము గాని విషయమునుగూర్చి నీ వీర్ష్యచెందఁ జాలవు. కావున నీ కీర్ష్యను గలిగించునది యీప్సితత్వము. ఈర్ష్యాకారణమగు నీ యీప్సితత్వమును దృణీకరింపుము. నీకు గౌరవముండినచో గౌరవహాని గలిగించువస్తువును నీవు చెంద నెంచెదవా? సౌశీల్యపువిలువ నీకుఁ దెలిసినచో నీచముగా నా సౌశీల్యమును విక్రయించినవానిని జూచి నీవు కనికరమును జెందవా?

పరులక్షేమాభాసమును నీవు పరితపింపకుండ విని యోర్వఁగల్గి యుందు వేని వారి వాస్తవక్షేమమును సంతోషముతోఁ బ్రస్తుతింపఁగల్గుదువు.

కలుగవలసినవారికి మేలు కలిగెనేని నీవు సంతోషింపుము. సుశీలుఁడెప్పుడును సుశీలతగలవానిమేలును జూచి సుఖమందును.

ఇతరులకుఁ గలుగు సుఖమును జూచి సంతోషించువారు తమ సుఖమును వృద్ధిపఱుచుకొనువా రగుచున్నారు.

5. హృదయోద్వేగము

ఉల్లాసముతో నుండువాని హృదయము దుఃఖముఖమునఁ జిఱునగవును దొంగలింపఁజేయును. ఉసూరుమనుచుండు వాని నిరాశయు నధైర్యమును సుఖముఖమున నుండు శోభను శూన్యపఱుచును.

ఆత్మదౌర్బల్యమే దుఃఖమునకు మూలము. నిరుత్సాహమే దుఃఖమునకు బలము నిచ్చునది. గంద్రతనమునకు నీవు కడంగుము. అట్లు కడంగుట కింకను ముందే హృదయోద్వేగము నిన్ను వదలిపోఁగలదు.

ఆ హృదయోద్వేగము నీ జాతికంతకుఁ జెడుపు దెచ్చును. కావున దాని నీ హృదయమునఁ జేరనీయకుము. అది యుండెనా నీ జీవితమం దమృత మధురములగు విషయములెల్ల విషదిగ్ధములై చేఁదువాఱును.

అది కాసుపోయినంత నష్టమునుగూడ నీ భాగ్యమెల్లఁ బాడయినంత నష్టము నుగా నీకుఁజూపును. అక్కఱలేని యల్పవిషయములందది నీ కత్యంత విచారముఁ గలిగించి ఆవశ్యకము లయిన యధిక విషయములం దాలోచనమే పోకుండఁ జేయును.

నీ మంచిగుణముల కది మైకముఁ గ్రమ్మించును. ఇతరులు చూచి గౌరవింతు రని వాని నది మఱుగు పఱుచును. సద్గుణములను నీవు ప్రకటింపవలసిన సమయములందు వానిని జిక్కుపఱిచి యణఁగఁ ద్రొక్కును.

ఇట్లది మంచిగుణములను మాటుపఱిచి చెడుగుణములను జేకూర్చి మనుజుని బాధించును. తనపైనుండి భారమును దొలఁగఁ ద్రోసికొనవలసిన సమయమున నది వాని రెండు చేతులను గట్టివైచును.

నీచత్వమును, పిఱికితనమును, అధర్మమును, నీవు తొలఁగఁ ద్రోసికొనఁ గోరుదువేని హృదయోద్వేగము నిన్ను ముట్టకుండఁజూచుకొమ్ము.

దానిని భక్తివేషము వేయనీయకుము. మఱియుఁ దత్త్వజ్ఞానము రీతిగాఁ దోఁచి నిన్ను మోసపుచ్చకుండఁ గూడఁజూడుము. తత్త్వజ్ఞానము భగవంతుని గౌరవించును. ఈశ్వరచింతనమును హృదయోద్వేగముచే మఱుఁగుపడనీయ కుము. ఈశ్వరచింతనము నీకు సుఖమును గూర్చును. దానికి దుఃఖ మనునది యపరిచితము.

ఆపదవలనఁగాక మానవుఁడు మఱి దేనివలన దుఃఖియగును? సంతోషకారణ ములు తన దగ్గఱ నుండినప్పుడుగూడా మానవుని హృదయ మేల సంతోషమును గోల్పోవలెను? దౌర్భాగ్యము కోసమా యాకోల్పోవుట!

వాస్తవముగా వ్యధనుగలిగించు కారణమునఁగాక, మనసు చిన్నఁబోయిన మాత్రమున నుద్వేగము నందువాఁడు, కన్నీరుగార్చుటకై ధనముగొని శవము వెంటఁ జనుచు దుఃఖించు వాని వంటివాఁడు.

దుఃఖమును బుట్టించునది సమయము గాదు; సందర్భము గాదు. ఏలనఁగా నొక సమయమే యొక సందర్భమే యొకనికి దుఃఖమును వేఱొకనికి వేడుకను గూర్పఁగల్గును.

జరుగనున్న కార్యములను సంతాపవిచారములచే నెక్కువగాఁ జక్కపఱుపఁ గల్గుచుంటిరా యని యితరుల నెవ్వరినైన నడిగిచూడుము. లేదు. అఁట్లెన్నటి కిని సాధ్యము కాదని వారందురు.

సహనముతోఁ గష్టముల ననుభవించి ధైర్యముతో దురదృష్టము నెదుర్కొను వానినిఁ బ్రజలు శ్లాఘింతురు.

ప్రకృతిసంవిధానములను వ్యాకులత చీకాకుపాలు పఱుచును. కావున వ్యాకులత ప్రకృతికి విరుద్ధమయినది. ప్రకృతి ప్రియముగా నుండునట్లు కల్పించిన విషయములనెల్ల వ్యాకులత నీరసములనుగాను రుచిలేనివానిఁ గాను జేయును.

టేకుమ్రాఁకులు తుపానుతాఁకున నేలకుఁ వ్రాలి మఱల లేవజాలనట్లు మానవహృదయములు సంతాపోద్వేగముల సోఁకునఁ జదియఁబడి మఱలఁ బూర్వౌన్నత్యమును బొందఁజాలవు.

పర్వతముపయి వాన గురిసినప్పుడు సెలయేళ్లు క్రిందికి జాఱుచు నక్కడిమంచు సంచునెల్లఁ గ్రిందికిఁ గొట్టుకొని పోఁగొట్టునట్టు మనుష్యుఁడు సంతాపోద్వే గములపాలయి నప్పుడు కన్నీళ్ల జాళ్లు చెంపల నుండి కాఱుచు ముఖ వికాసమును దుడిచిపెట్టి తొలఁగఁ గొట్టును. పర్వతమున కా మంచుగాని ముఖమున కా వికాసముగాని మఱల మునుపటివలె వఱలదు.

బాహిరపుఁబట్టులందుల సంతాపచింతలను జూడుము. పలువురు గుమిగూడు పట్టులఁ జూపట్టు నుద్వేగములఁజూడుము.

ఎవరైన నందుఁ దవుల్కొను వారుందురా? వారి నందఱను దప్పించుకొని యా సంతాపచింతలు సాగుచుండుట లేదా? సంతాపచింతావశుల సమీపింపక యందఱును నావలీవలగా నరుగుచుండుట లేదా?

సంతాపచింతావశులు తొడిమ త్రుంచిన పువ్వులవలెఁ దలల వాల్చి వాడు వాఱి యుందురు. చూడుము. మొగమెత్తక వారు నేలవంకనే చూచుచుందురు. ఏడ్పునకుఁదప్ప వారి కన్ను లింకెందుకుఁ బనిగొనవు.

అట్టివారికి నోటమాట యుండదు. హృదయమున నలువురతోఁ గలసి మెలసి యుండుటకుఁ జెలికారము మొలకెత్తదు. బుద్ధియందు వివేకము పొడమదు. వారిని గారణ మడుగుము. కారణమేమో వారికిఁ దెలియదు. సందర్భము తెలుపుఁడనుము. అరయఁగా వారికి సందర్భ మేమియు నగపడదు.

అయినను వారి దేహమనోబలములు వారిని వీడిపోవుచున్నవి. కడకు వార డఁగారుచున్నారు. అడఁగారినపిదప నెవ్వరుగాని "వారేమై" రని వారిని గూర్చి విచారింపరు.

వివేకముగలిగియు నీవు దీనిని దెలిసికొనవా? ప్రపన్నుఁడ వయియు నీవు నీ ప్రమాదమును గనుఁగొనవా?

భగవంతుఁడు నిన్నుఁ గరుణతో సృష్టించెను. నీవు సుఖపడవలయునని తలఁ పఁడేని భగవంతుఁడు నిన్ను సృష్టించియే యుండఁడు. కరుణాళుఁడైన యా భగవంతుఁడు నిన్నుఁ గటాక్షించుచుండఁగనే నీవు కడముట్టఁజూతువా?

ఉద్వేగము నొందక శాంతముతో సంతోషముతోఁ జీవితము సాగించుటచే నీ వీశ్వరుని సత్కరించినవాఁడ వగుదువు. నీ వసంతుష్టుఁడవై యుండు టనఁగా మహనీయుఁడయిన భగవంతునిపై మటమట లాడుటగాక మఱేమి?

ప్రతిపదార్థమును బరిణామముఁ బొందునట్లుగదా భగవంతుఁడు సృష్టించెను! పదార్థములు పరిణామ మందుచుండ నీ వేల పరితాపమంద వలెను!

ప్రకృతి ధర్మము నెఱుఁగుదుమేని మన మా పరిణామమును గూర్చి పరితాపపడరాదు. దాని మన మెఱుఁగకపోవుదుమేని ప్రతిక్షణమును బ్రవ్యక్త మగుచుండు మన గ్రుడ్డితనమును గూర్చియే కదా మనము కోపించుకొనవలసినది.

లోకమునకెల్ల న్యాయనిర్ణయముచేయుట నీ పని గాదని యెఱుఁగుము. నిర్ణీతములైన న్యాయములకు లోఁగియుండుటే నీ పని. ఇది యెఱుఁగుము. అవి నీకుఁ గష్టమును గలిగించినప్పుడు నీవు గగ్గోలుపడితివా కలిగినకష్టము పెక్కుమడుఁగు లెక్కువగును.

కపటనటనల కెప్పుడును మోసపోకుము. దుఃఖము దుర్దశను దొలఁగించు నని తలంపకుము. అది యౌషధమువలె నగపడు విషము. నీ ఱొమ్ముపై నాఁటిన యమ్మును దొలఁగించునదివోలెఁ దోఁచునుగాని వాస్తవమున కా యమ్మును నీ గుండెలలోనికి గ్రుచ్చును.

చింతాసంతాపములు చెలికాండ్రలోనుండి నిన్ను విడఁగొట్టినప్పుడు నీవు సల్లాపార్హుఁడవు గావని చాటుట కాలేదా? మనఃక్షోభము నిన్ను మాఱుమూలల దాఁచి యుంచునప్పు డది తాను చేయుపని తనకే యవమానకరమని తెలియఁ జేయుట కాలేదా?

దురదృష్టము లనెడు శరపాతములకుఁ దొలఁగి మెలఁగుట నీ శక్యము కాదు. వివేకము నిన్నటుచేయఁ గోరదు. ధీరతతో దురదృష్టపు దెబ్బలకు నిబ్బరించి నిలుచుటే పురుషధర్మము. ధీరతతోనే తొలుత దానిని దెలిసికొని యెదుర్కొనవలెను.

నీ హృదయమున సౌమనస్యము సాగుచున్ననుగూడ నీ కన్నులనుండి నీరుగాఱ వచ్చును. కాని, యట్లు గన్నీరు గాఱుటకుఁ దగ్గ కారణ ముండుటమాత్రము చూచుకొనుము. ఆ యశ్రుపాతమును గూడ నధికము గానీకుము.

ఆపదలయాధిక్యము వానికై నీవు నించు కన్నీటిసంచుచే గణింపఁబడదు. గొప్ప సంతోషములను ముఖవికాసములు గోచరింపఁ జేయఁజాలనట్లే గొప్ప దుఃఖములను గన్నీటి బొట్లు కన్పఱుపఁజాలవు.

దుఃఖమునకంటె నాత్మను దుర్బలపఱుచునది మఱి యేమున్నది? సంతాపము వలె హృదయమును జదియఁగొట్టునది మఱియేమున్నది? క్షుభిత హృదయుఁడు గణనీయములయిన ఘనకార్యములను జేయఁగడంగఁగలఁడా? సౌమనస్యమును సంరక్షించుకొనుటకు శక్తుఁడు కాఁగలఁడా?

సత్ప్రతిఫలము లేదేని సంకటమునకుఁ బాలుపడకుము. మేలునకు సాధనములగు వానిని జెడుగునకై యుపయోగించి చెఱుచుకొనకుము.

✳ ✳ ✳

నీతినిధి

చతుర్థాధ్యాయము

మనుజుఁడు తోడివారిమీఁది పొందఁదగిన దొడ్డగుణములు

1. ఘనత, గౌరవము

ఘనతయు గౌరవమును నాత్మ నంటియుండును గాని యాకారభాషాదుల నంటియుండవు. సత్స్వభావమందే సత్యమైన గౌరవము గాననగును.

చెడ్డపనులుచేసి ప్రభు సమ్మానముఁ బడయవచ్చును. బిరుదు పెండెములను బదవులను ధనమిచ్చి కొనవచ్చును. కాని వీనిచే యథార్థమయిన గౌరవ మేర్పడదు. దుష్కార్యములుచేయు వాని నున్నతదశకుఁ దేఁజాలవు. బంగారము మానవులకు గౌరవముఁ గల్పింపఁజాలదు.

బిరుదులు సౌశీల్యమునకుఁ జేయు సత్కారము లయినప్పుడును దేశసేవకు లున్నతస్థితికిఁ దేఁబడునప్పుడును, బిరుదుపెండెముల నొసఁగువాఁడు వానిని గొనువానివలె వార్త కెక్కఁగలఁడు. తన్మూలమున లోకమునకు మేలు చేకూడఁ గలదు. "ఈతని కిది యే తీరున వచ్చిన" దని యెవ్వరును విచారింప నక్కఱ లేని విధమున ఘనతఁ గాంచఁజూతువా? లేక "యీతని కిది యెట్లు వచ్చిన" దని యందఱు నడుగ వలసినట్లు ఘనత గడింపఁజూతువా?

వీరపురుషులగుణములు వారి సంతానమునకుఁ గూడ సమకూడెనేని వారు తమ తండ్రులు గడించిన గౌరవసత్కారములు గాంచఁదగుదురు. అట్టి గుణ విశేషములు సమకూడనివా రా పేరుపెంపులను బెట్టుకొందురేని లోకులు వారిని "అధోగతి నున్నవా" రని యనుకొనరా?

తరతరములనుండి వచ్చు గౌరవమే గొప్పగౌరవమని కొందఱందురు. కాని వివేచన చేసి చూడఁగాఁ గష్టపడి సంపాదించిన గౌరవమే వాస్తవ మయిన గౌరవ మని చెప్పనొప్పును.

స్వయము యోగ్యత లేనివాఁడయియును దాతముత్తాతల ఘనతను జెప్పుకొని తాను ఘనత నందఁజూచువాఁడు, స్వయము దొంగయయియును

దేవాలయమునఁ జొచ్చి పవిత్రులతోపాటుగాఁ దానును బవిత్రత్వమును బ్రకటించుకొనఁ జూచువాని వంటివాఁడు.

తన తల్లిదండ్రులు కన్నులుగల్గి చూడఁగలవారై యున్నచో నందువలన నంధున కేమి లాభముండును? తన తాత వాగ్ధాటిగలవాఁడయినచో నందు వలన మూఁగవాని కేమి లాభముండును? తమ పౌర్వికులు మహనీయులయి యుండినను నందువలన నధము లేమియు లాభమందఁజాలరు.

సౌశీల్యమే మనుజుని ఘనునిఁగాఁజేయును. బిరుదుపెండెరములు లేకున్నను నది మనుజుని నున్నతస్థానమందుంచును.

అతఁడు స్వయముగా గౌరవమును సంపాదించును. ఇతరు లితరుల యొద్దనుండి కొనితెచ్చికొందురు.

వస్తువును నీడ వీడకుండునట్లు సౌశీల్యమును నిజమయిన గౌరవము సమాశ్రయించి యుండును.

గౌరవము ధైర్యమునకుఁ బుట్టినబిడ్డ యని తలంపకుము. ప్రాణత్యాగమునకు సిద్ధపడుటయె గౌరవమును గొనుటకుఁదగిన క్రయధనమని యనుకొనకుము. గౌరవము నీ వొనర్చు కార్యములనుబట్టి కాదు వచ్చునది. అది నీవు తలపెట్టిన కార్యములను గావించి విధానములనుబట్టి వచ్చును.

రాజ్యనౌక కెల్లరును గర్ణధారులుఁ గాఁజాలరు. సైన్యాధిపత్యము వహింప జనులందఱు లర్హులు గాఁజాలరు. నీకు విహితమయిన కృత్యమును నీవు నిర్వక్రముగా నెఱవేర్పుము. సమ్మానితుఁడ వగుదువు.

కీర్తిగాంచుటకుఁగష్టముల జయింపవలె నని కాని, అపాయములు నాయాసములు ననుభవింపవలెనని కాని యనుకొనకుము. పతివ్రత ప్రస్తుతి కెక్కుటఁ బరికింపుము. సుశీలుఁడు కీర్తితుఁ డగుటఁ జూడుము.

యశస్పృష్ట మిక్కిలి తీవ్రమయినది. గౌరవకాంక్ష గొప్పశక్తి గలది. ప్రశస్తకార్య ములఁ జేయుటకయి భగవంతుఁడు వీనిని మన కొసఁగినాఁడు.

లోకక్షేమమునకయి భయంకరకార్యములఁ జేయవలసి వచ్చినప్పుడును,

ప్రాణములఁగూడ నర్పింపవలసి వచ్చినప్పుడును సత్కీర్తిమీఁది యత్యాశ తప్ప మనుష్యునకుఁ శక్తి నిచ్చునది మఱియేమి?

ఘనగుణమునకు సంతోషమును గూర్చునది ఖ్యాతిని గాంచుటకాదు; అట్లు ఖ్యాతిని గాంచుటకుఁ దగ్గ యర్హత తన కుండుట.

ప్రజలు "వాని కేల ప్రతిమారూపమునఁ బ్రతిష్ఠ యేర్పడె" ననఁదగినట్లుండుట కంటె "ప్రతిమారూపమున వానికేల ప్రతిష్ఠ యేర్పడలే" దనఁదగి నట్లుండుట యుక్తముగాదా?

అత్యాశాపరుఁడే యందఱిలో ముందువాఁడుగా నుండును. వాఁడు వెనుకఁ జూడక ముందఱికిఁ ద్రోసికొనిపోవును. అందఱను వెనుకకుఁ ద్రోసిపుచ్చి వచ్చితిని గదా యని యానందించుచుండును. ఒక్కఁడెవఁడేని తన ముందటికిఁ ద్రొక్కికొని వచ్చుట వాని కెక్కువగా సంతాపమును గూర్చును.

ఆశాంకురములు ప్రతి హృదయము నంటియుండును. కాని, యవి యందఱి యందును బెంపొందవు. పలువురలో నవి భయముచే మూసిపెట్టఁబడి యుండును. కొందఱిలో నవి యణఁకువచే నణఁచివేయఁబడి యుండును.

ఆశ యనునది యాత్మ కంతరంగపుటుడుపు. దేహమునఁ బ్రవేశించు నపుడది దాని ధరించును. తాను దేహమును వీడునపుడు దానినిగూడ వీడును.

సత్కార్యములందు దాని నుపయోగించితివా నీ కది సద్యశము గల్గించును. దుష్కార్యములం దుపయోగించితివా నిన్నది దూషించి నాశపఱుచును.

విశ్వాసఘాతుకుని హృదయమున నత్యాశ దాఁగియుండును. దాని చాటునఁ గాపట్యమొకటి తలదాఁచుకొని యుండును. అత్యాశ కది మృదువాక్యముల మప్పును. ఈ క్రుళ్లు కొన్నాళ్లకు వెల్లడికాక మానదు. లోకు లిది యెల్లఁ దెలిసి కొందురు.

చలిచేఁ దిమ్మిరియెక్కి కొయ్యవాఱి యున్నను సర్పము తన విషమును వీడదు. చలిచే నోరు బిగిసిపోయినను గూడ పాముకోరలు పగిలిపోవు. దయఁదాల్చి నీవు దానిని రక్షించితివా తన సద్గుణము నది కనుపఱుచును. వలిగొన్న

దానికిఁ జలిమంట దరికొల్పి యసురు నిల్పినప్పుడది ప్రత్యుపకారమో యనునట్లు కాటువేసి నిన్నుఁ గడతేర్చును.

సచ్చరిత్రుఁడు సౌశీల్యమును సౌశీల్యముకోసమే ప్రేమించును. అత్యాశకోరెడు సమ్మానము నాతఁడు తృణీకరించును.

ఇతరులు స్తుతించినఁగాని పరితోషము పడయఁజాలని ఘనచరిత్రుని స్థితి యెంతయుఁ గనికరింపఁదగినది గదా! ఘనవర్తనము ప్రతిఫలము కాంక్షించునదిగా నుండ రాదు. ఆదరముకంటె నది యధికము కోరరాదు.

అభ్యుదయ మందుచున్నకొలఁదిని సూర్యునికి నీడ యల్పమగుచుండును. అట్లే సౌశీల్యమెక్కువగుచున్న కొలఁదిని శ్లాఘాపేక్ష దానికిఁ దక్కువగుచుండును.

తన్నుఁబట్టుకొనవలెనని తంటాలుపడుచుఁ బరుగువాఱు వానికిఁ గీర్తి నీడవలెఁ నందిరాక దూర మరుగుచుండును. కాని నా కీ కీర్తి యక్కఱలేదని ప్రక్కఁగాఁ జనఁజూచువాని నది వెంటాడి యంటుకొనును. అనర్హుఁడు కీర్తికై యాయాసపడినను నది యబ్బదు. అర్హుఁడు తన కది యబ్బకుండుటకై దాఁగియున్నను నబ్బకమానదు.

సత్పురుషుల వెంబడింపుము. సత్కార్యములఁజేయుము. అర్హతానర్హతల నెఱుఁగక పొగడుచుండు ననేకులకంటె నీ నడవడినిగూర్చి నీ యాత్మవిశ్వాసమే నీ కెక్కువగా ముదముఁ గూర్పఁగలది.

2. శాస్త్రములు, పాండిత్యము

భగవంతునిచే సృష్టింపఁబడిన పదార్థములను బరీక్షించి తెలిసికొనుటయే మనస్సునకు ఘనతరమయిన యుద్యోగము.

ప్రకృతిపరిశీలన మెవనికిఁ బరితోషముఁగూర్చునో వానికిఁ బ్రతిపదార్థమును భగవంతుని యస్తిత్వమును నిరూపించును. అట్లా యస్తిత్వమును నిరూపణచేయు నఖిలార్థములును భగవదారాధనాసక్తికిఁ బ్రయోజకము లగును.

ప్రతినిమిషము నట్టివాని మనసు భగవంతునిమీఁదనే యుండును. జీవిత

మున్నంతదాఁక నాతఁడు భక్తిరసమున నోలలాడుచుండును.

కన్నులు పైకెత్తినప్పు డాతని కంతరిక్షమెల్ల నద్భుతములతో నిండి యుండినట్టు కనుపట్టదా? భూమివంకఁ జూచినప్పు డాతనికిఁ జిన్ని పురుగుగూడ భగవంతుఁడు దక్కఁ దక్కొరుఁడు తన్ను సృష్టింపఁజాలఁడని నొక్కి వక్కాణింపదా?

గ్రహములు తమ తమ కక్ష్యలలోఁ దీరుదప్పక తిరుగుచున్నవి. నిశ్చలుఁడుగాఁ దన స్థానమున సూర్యుఁడు నిలిచియున్నాఁడు. తోఁకచుక్కలు మహాకాశమునఁ దమ త్రోవను జనుచున్నవి. ఓయి నరుడా! భగవంతుఁడు గాక వానికిట్లు పనిగొల్పినవాఁడు మఱెవ్వఁడు కాఁగలఁడు? అపారమయిన విజ్ఞానముగలవాఁడు గదా వాని నిట్లను శాసింపఁగలవాఁడు కాఁగల్గును!

గ్రహములకాంతిజ్వాలలెంత దేదీప్యమానములుగ నున్నవో చూడుము. కాంతిజ్వాల లట్లు గ్రక్కుచున్నను గ్రహములు తఱుఁగుట లేదు. వాని గమన వేగము క్రమము దప్పుట లేదు. ఒకదాని త్రోవ కింకొకటి యడ్డువచ్చుట లేదు.

భూమిని జూడుము. దానిలోనుండి పుట్టువస్తువులఁజూడుము. మఱియు నా భూగర్భమును జూడుము. సర్వజ్ఞుడును సర్వశక్తుఁడును గాక వాని నెల్ల నట్లు వర్తిల్లఁజేయఁజాలువాఁ డింకెవ్వఁడు కాఁగల్గును?

పచ్చికను మొలపించువాఁడు, ఆయాకాలములందు దాని నభివృద్ధి పఱుచువాఁడు, గోవులు గుఱ్ఱములు గొఱ్ఱెలు బఱ్ఱెలు మొదలగుజంతువులు దానిని మేయునట్లు చేయువాఁడు, భగవంతుఁడే కదా!

నీవు సల్లుధాన్యమును మొలపించి చక్కఁగాఁ బెంపొందించి విత్తిన దానికి వేయిరెట్లెక్కువగాఁబండించి నిన్ను భాగ్యవంతునిఁగాఁ జేయువాఁ డా భగవంతుఁడే కదా!

కార్యకారణసంబంధమును నీవు గనుఁగొనఁజాలకున్నను మామిఁడి మొదలగు వృక్షములను, ద్రాక్ష మొదలగు లతలను ఫలభరితములను గాఁజేయువాఁ డా భగవంతుఁడే కదా!

అధమాధమములయినవి చీమలు, దోమలు తమ్ముఁదాము సృష్టించుకొనఁ గలవా? దైవముకంటెఁ గొంత దక్కువయిన నీవయినను వానిని సృష్టింపఁ గలవా?

జంతువులు దాము జీవించుచున్నట్లు తెలిసికొనఁగల్గునే కాని తమ జీవితమును గూర్చి యచ్చెరువు చెందఁగలవా? జీవించియున్నప్పుడు క్షేమ మందునే కాని, జీవితాంతము కల్గునని యవి భావింపలేవుగదా!

ప్రపంచపు భాగములనే కాక సమిష్టి ప్రపంచమును గూడ జూడఁగల్గి సంతోష వైచిత్ర్యముల నందఁగల్గిన నీకు ప్రపంచ ప్రవర్తకుఁడయిన యా భగవంతుని ప్రాభవమును దెలిసికొనఁ బ్రయత్నించుటకంటె మేలయిన కాలక్షేపమేమి యుండును? నీ మనసును భగవద్విలాసములను బరిశీలించుటలోఁ గాక యింకే యితరకార్యములలోఁ బ్రవేశపెట్టఁదగును?

జంతువులసృష్టియందు భగవంతునిశక్తియుఁ గరుణయు వ్యక్తమగుచున్నది. వాని యాహారపదార్థ నిర్ణయమందు న్యాయమున్నది. దానికి దానికేర్పఱుపఁబడిన జీవిక చొప్పున నది యది సుఖముగా జీవించుచున్నది. ఒకదానిఁ జూచి మఱియొకటి యీర్ష్య చెందదు.

ఇట్లు చూడఁగాఁ బుస్తకపఠనమువలనఁ బొందఁదగిన జ్ఞానమేపాటిది? జ్ఞానమెల్లఁ బ్రకృతిని జదువుటలో నున్నది గాని పుస్తకములను జదువుటలో లేదు.

జగన్నిర్మాణమును గూర్చి సంతోషించిన పిదప దాని యుపయోగమును గూడ గుర్తింపుము. భూమిపైఁ బుట్టుచున్న ప్రతివస్తువును, నీ మేలుకొఱకే నెగడుచున్నది సుమా! అన్నవస్త్రములు, ఔషధములు, మొదలగున వన్నియు నందునుండి పుట్టుచున్నవే కదా!

దీనిని గనుఁగొన్నవాఁడే జ్ఞానవంతుఁడు. దీనినిగూర్చి పర్యాలోచించువాఁడే వివేకి.

లోకోపకారకమై గర్వమును గలిగింపని శాస్త్రజ్ఞానము నలవఱుచుకొనుము.

జీవించుట, మృతిసెందుట, అధికారముచేయుట, విధేయతనూపుట, సౌఖ్యమందుట, బాధపడుట, ఇత్యాదులన్నియు నీ వనుభవింపవలసిన విషయములు, ఆ యనుభవింపవలసిన వాని నన్నింటిని జీవితక్రమము నీకుఁ బ్రత్యక్షపఱుచును.

అవి నీ హృదయమున మెదలుచున్నవి; చూడుము. అవసరములం దవి నీకు జ్ఞప్తికి రావలెను. సులువుగా వానిని నీవు గుర్తింపఁగలవు. శ్రద్ధగలిగి యుండుము. సరిగా వానిని నిలుపుకొనఁగల్గుదువు.

ఇతర శాస్త్రము లన్నియు వ్యర్థములు. ఇతర జ్ఞానమంతయు గర్వపూరితము. మానవజీవితమునకవి యావశ్యకములు గావు. లాభకరములును గావు. అవి మనుష్యునెక్కువ మంచివానినిగాఁ గాని ధన్యాత్మునిఁగాఁ గాని చేయఁ జాలవు.

భగవంతునియందు భక్తియుఁ, బ్రాణికోట్లయెడ దయయు, నీ కెక్కువగా ధన్యతను జేకూర్పఁగలవి. భగవంతుని కార్యములఁ బరిశీలించి తెలిసికొనుట నీ కా భక్తిని గల్గించును. నీ కంటెఁ దక్కువయిన ప్రాణుల స్థితిగతులను గూర్చి విచారించుట నీకు దయను దయివార్చును.

నీతినిధి

పంచమాధ్యాయము

తప్పించుకోరాని దైవికములు

1. లాభనష్టములు

లాభము కల్గినదని నీ హృదయము నెక్కువగా నుప్పొంగ నీయకుము. అదృష్టము నీ కననుకూలముగానున్నదని ప్రాణాపాయముతో సమానమయిన పరితాపమునకును నీ హృదయమును బాల్పడనీయకుము.

అదృష్టదేవత వేడ్కచూడ్కులు కుదురుగా నుండవు. కావున నీవు వానిపై గట్టి నమ్మకముంపవలదు. ఆమె కోపపుఁజూపులును, గుదుర్కొని యుండవు. కావున నీవు ప్రత్యాశగలవాఁడవై యోర్మిఁ దాల్చియుండుము.

ఆపదలను దిన్నఁగా నోర్వఁగల్గియుండుట యతికష్టము. సంపదలను జాగ్రత్తతో నవదరించుకొనుటలోనే జ్ఞానాతిశయము కానవచ్చును.

మేలుగీడులందుఁ దూలిపోవకుండఁ బోవఁగలత్రోవను నీవు తెలిసికొనవలెను. అవి రెండే నీ యాత్మశక్తులను నీ యనుభవమునకుఁ దెచ్చునవి. అవి యెపుడు నీ వెంటఁ దవుల్కొనునో యపుడు నీవు జాగరూకతతో నుండవలెను.

సంపద నిన్నెంత సంతోషపఱిచి యుబ్బి తబ్బిబ్బగునట్లు చేయునో చూడుము. నీకుఁ దెలియకుండ నీ బలమును పరితోషమును నది హరించును.

దురదృష్టములు నిన్ను వెఱపింపఁజాలకపోయినను, కష్టములు నిన్నుఁ గదల్పఁ జాలకపోయినను, సంపద మాత్రము నిన్నుఁదప్పక జయింపఁగలదు.

బలపరితోషములు నీకు మరలఁ గావలసియేయున్నను జెల్లిపోయినవి మఱి యిఁకఁ జేకూడవని నీకుఁ దెలియకుండు తీరున సంపద నిన్ను జయించి వానిని సన్నగిల్లఁజేయును.

కష్టములు గల్గినప్పుడు విరోధులు గూడఁ గనికరింతురు. సంపద, సౌఖ్యము గల్గినప్పుడు హితులుగూడ నీర్ష్యఁ జెందుదురు.

ఆపన్నతయందే సత్కార్యముల యంకురము లున్నవి. ధైర్యమునకు, శౌర్యమునకు, ధర్మమునకు నాపద దాదివంటిది. సత్యమైన సౌశీల్య మన్ని సందర్భములందును గార్యసాధక మగును. దానితోఁ గొన్ని దైవికములుగూడ జతకూడినప్పుడు ఫలము బాగుగాఁ బ్రవ్యక్తమగును.

ఆపన్నుఁడగు వాని నాప్తులుగూడ విడుతురు. అప్పుడు తన ప్రత్యాశలన్నియుఁ దన వలననే కలవని యాతఁ డెఱుఁగును. తన యాత్మను రెక్కొలుపుకొనును. రెక్కొల్పుకొని చిక్కుల నెదుర్కొనును. జయించును.

సంపన్నుఁడు తాను సుఖముగా నున్నాఁడ ననుకొనును. గోష్ఠిలోఁ దన్నుఁ జుట్టియుండు వారందఱును నిజముగాఁ దన్నుఁ బ్రేమించుచున్నారనుకొనును.

అజాగ్రత్తతో, నశ్రద్ధతో నాతఁడుండును. తన ముందఱ నుండు నపాయముల నాతఁడు చూడఁడు. ఇతరులను నమ్మును. తుదికి వారు వానిని మోస పుత్తురు.

ఆపత్కాలమునఁ బ్రతిమానవుఁడును దనకుఁ దాను దారి ద్రొక్కుకొనఁ గలఁడు. కాని సంపత్కాలమునఁ బ్రతిమానవుఁడు నట్లు సాగఁజాలఁడు. సంపద వాస్తవమును మఱుఁగుపఱుచును.

కష్టములఁ గానరానీయకుండునట్టు కన్పట్టి తుదకుఁ గష్టములలోనే ముంచివైచు సంతోషోద్రేకము కంటెఁ దృష్తికి ద్రోవఁజూపెడు దుఃఖమే చాల మేలయినది.

మన కామక్రోధములే కొంతకు మనపై దిమాకు సాగించును. ఒద్దికతో నుండుటే జ్ఞానమునకు ఫలము.

యావజ్జీవితము నీవు నిష్కాపట్యముతో నుండుము. సర్వపరిణామములందును నీవు సంతృప్తిగలిగి యుండుము.

అన్ని విషయములందును లాభ మందఁగల్గుదువు. ఇట్లగుటచే సంభవించునది యెల్ల నీకు శ్లాఘ్యతనే కల్గించును.

జ్ఞానవంతుఁడు సర్వసందర్భములను జ్ఞానసాధనములనుగానే చూచుకొనును. విధివిధానముల మార్పుల నన్నింటిని నాతఁడు సమదృష్టితో సందర్శించును.

ఆతఁడు మేలును బాలించును. కీడును వీడును. దేని యందును జలన మందఁడు.

సంపత్సమయమున గర్వింపకుము. ఆపత్సమయమున హతాశుఁడవు గాకుము; కావలెనని యపాయములఁ దెచ్చుకొనకుము. అవి పైఁబడినప్పుడు పిఱికివాఁడవై పాఱిపోకుము. నీతో నేది నిలువదో దానినిఁ దృణీకరింపుము.

ఆపద, ప్రత్యాశ ఱెక్కలను విఱుగఁగొట్టకుండునట్లును సంపద, వివేకపు వెల్తురును సన్నగిలఁ జేయకుండునట్లును జాగ్రత్తగొనుము.

లాభముఁ బొందఁజాలనని భయపడువాఁడెన్నఁటికిని లాభమును బొందఁ జాలఁడు. ముందఱనుండు గోతిని జూడలేనివాఁ డా గోతిలోఁ దప్పక కూలును.

సంపదను బడసి సర్వక్షేమముల నందుచున్నాఁడ నని తనిసియుండువాఁడు ఇసుకనేల నోడలంగరు దించి కుదురుగా నున్నాఁడనని ముదమందు నోడవాని వంటివాఁడు. సంపద దప్పి యాపద వచ్చినప్పుడాతఁడు సంకటపడును. అలలు మళ్లివచ్చి యిసుకను దొలఁగించి నప్పుడీతఁడు సంకటపడును.

పర్వతములపయినుండి పాఱు నదీప్రవాహము తట ప్రదేశముల నెట్లు తాఁకుచు సముద్రమునఁ గలయఁబోవునో, అట్లే భాగ్యమును జనులను దాఁకుచుఁ జనుచుండును.

చలనము దానికి సార్వకాలికము. అది యెక్కడను గుదురుకొని యుండదు. ఇఁక దానిని నీ వెట్లు ధరించి యుంచుకొనఁగల్గుదువు? అది నిన్నుఁ గదిసి నప్పుడు ముదంపడుదువు. కాని యంతలోనే యది నిన్నువీడి వేఱొకని చెంతకుఁ బోవును.

2. వ్యాధి, బాధ

శరీరమునకు వ్యాధి కలిగినప్పుడు దాని ఛాయ యాత్మను గూడ నావరించును. ఒకటి యనారోగ్యముతో నున్నప్పుడు మఱియొకటి యారోగ్యముతో నుండఁ జాలదు.

అన్నియవస్థలకంటె నధికముగా శరీరబాధ మనుష్యుని వ్యథపెట్టును. అట్లయినను జికిత్సలు దానికే మిక్కిలి తక్కువగా నున్నవి.

నిశ్చలత నిన్ను వీడినప్పుడు తెలివిని బిలువుము. ఓర్పు నిన్ను వీడినప్పుడు ధైర్యమును దగ్గఱకుఁ దీయుము.

బాధానుభవ సహనము నీకుఁ దప్పనిపని. దానిని నీవు మెల్పుఁజేఁతలచేఁ దప్పించుకొనఁజూతువా? లేక యది నాకు జరిగినదని పరితపింతువా? అది యందఱకును జరుగుచుండలేదా?

నీవు దేని ననుభవించుటకుఁ బుట్టితివో దాని ననుభవింపకుండఁ దప్పించు కొనఁ దలంచుట సరికాదు. సాధ్యమును గాదు. నీ జీవిత మర్యాదకు నీవు లోఁగి యుండవలెను.

వార్ధకము నాకు వచ్చును గావున నీవు దొరలవలదని ఋతుచక్రము నరికట్టఁ జూతువా? అపాకరింపరాని దాని నాభిముఖ్యముతో నందుకొనుట మంచిది గదా!

అధికకాల ముండెడిబాధ యంత తీవ్రముగా నుండదు. కాన దానిఁగూర్చి నీవు కళవళింపకుము. తీవ్రబాధ యల్పకాలమునకే తీఱిపోవునదిగా నుండును. అది యంతలోనే యంతరించును. మనుజుఁడు దానియంతము నంతలోనే చూడఁగల్గును.

ఆత్మకు లొంగియుండుటకై దేహ మనుగ్రహింపఁబడినది. శరీరబాధ కా యాత్మను నీ వాయాసపెట్టెదవేని, నీ వాత్మకంటె శరీరమునే అధికమయిన దానినిగాఁ జూచుకొన్నవాఁడవగుదువు.

3. మరణము

బంగారమును జేయుట రసవాదజ్ఞుని ప్రజ్ఞావిశేషమును బ్రవ్యక్తపఱుచునట్లు మరణమందుట మానవుని జీవితయోగ్యతను బ్రవ్యక్తపఱుచును. మరణమే మనము చేయు కార్యముల మంచిచెడుగులకు మానము. నీవొకని జీవితస్థితిని నిర్ణయింపఁ దలఁచెదవేని వాని జీవితచర్యలఁ బరీక్షింపుము. దోషములేనిచోట

సంతోష మగపడును. మంచి మరణము నొంద నెఱిఁగినవాఁడు తన జీవితమును ధర్మదూరముగాఁ గడపఁదలఁపఁడు. సద్గతికై తన కడపటి కాలమును గడపఁగల్గువాఁడు తన మొదటికాలము నల్లరిచిల్లరిగాఁ బొల్లుపుచ్చఁడు.

మరణమొందవలసినట్లుగా మరణమొందువాని జీవితము నిరర్థకము గాదు. సుఖమరణమొందువాఁడు నిష్ఫలముగా జీవించియుండఁడు.

చావవలసియుండు నని తెలిసియుండువాఁడు జీవించు నప్పుడు తృప్తిగల్గి యుండును. మరణమును స్మరణమున లేకుండఁ జేసికొనఁదలఁచువాఁడు దేనియందును సుఖమును గానఁడు. సంతోష మాతని కిది యెప్పు డెక్కడ పడిపోవునో యని భయపడవలసియుండు రత్నము వంటిది.

సుఖముగా, సుప్రఖ్యాతముగా మరణమొందఁ గోరెదవేని నీ కంటె ముందుగా నీదుర్వృత్తులకు మరణము గల్పింపుము.

మృతికి ముందే తన జీవితకార్యములను ముగించుకొన్నవాఁడు సుఖి. కృతార్థుఁడు. మరణకాలము వచ్చినప్పుడందుకు సర్వసిద్ధముగా నున్నవాఁడు సౌఖ్యమందును. మరణము మంచిది గాదనకుము. దాని తత్త్వమును దెలిసికొనలేనయితి నని నీవు దానికి భయపడకుము. దుఃఖముల నెల్ల నది తుదిముట్టించు ననియేని నిశ్చయముగా నీ వెఱుఁగుదువు.

ఎక్కువకాలము జీవించినచో నెక్కువ సౌఖ్యము గులుగునని యెన్నకుము. మంచిగాఁ గడపిన జీవితమే మనుజునకు సుఖగౌరవముల నొసఁగునది.

మంచిగా నిట్లు జీవితము గడపినవాఁడు మరణమునకుఁబిదప నా మను గడ వలని లాభముల ననుభవించును; ఆనందించును.

మానవజీవితమున కిదియే మంచిక్రమము.

నీతినిధి ముగిసెను.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం ద్వారా
ప్రచురింపబడిన గ్రంథములు

1.	తెలుగుమెఱుగులు	2008
2.	కావ్యమంజరి	2008
3.	అన్నమాచార్యచరిత్రపీఠిక	2008
4.	సింహావలోకనము	2009
5.	పూలవిందు	2010
6.	ప్రజ్ఞాప్రభాకరము-గురుపూజ	2011
7.	వేటూరిప్రభాకరశాస్త్రి వాఙ్మయసూచిక	2012
8.	కేయూరబాహుచరిత్ర	2012
9.	శ్రీ వేంకటేశ్వర స్తుతిరత్నమాల	2012
10.	వేటూరివారి పీఠికలు (మొదటిభాగం)	2012
11.	వేటూరివారి పీఠికలు (రెండవభాగం)	2012
12.	చాటుపద్యమణిమంజరి (1వ భాగము)	2013
13.	చాటుపద్యమణిమంజరి (2వ భాగము)	2013
14.	సుభద్రాకళ్యాణము	2013
15.	సుగ్రీవవిజయము.	2013
16.	బసవపురాణము (బసవోదాహరణము అనుబంధంగా)	2013
17.	శ్రీ వేంకటేశ్వరలఘుకృతులు.	2013
18.	శ్రీ వేంకటేశ్వరవచనములు.	2013
19.	ఆంధ్రకామందకము	2013
20.	శృంగారామరుకావ్యము	2013
21.	ప్రబంధరత్నావళి	2014
22.	ఉద్భటారాధ్యచరిత్ర	2014
23.	రంగనాథరామాయణము	2014